

గురువారం 15, మే 2025

https://www.telugudesam.org



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

దసరాలోగా చేనేత సహకార ఎన్నికలు: సవిత



6

# ఏకమొత్తంగా 'దీపం'!

- ముందుగానే ఖాతాల్లోకి మూడు సిలెండర్ల నగదు
- మూడుసార్లు పదవుల్లోవున్న మండల పార్టీ అధ్యక్షుల మార్పు
- కూటమి నేతలతో 16, 17, 18 తేదీల్లో తిరంగ ర్యాలీలు
- ప్రతినెలా సంక్షేమం అందేలా 'ఏడాది క్యాలెండర్'
- మే నెలాఖరుకు అన్ని సంస్థాగత ఎన్నికలు పూర్తి
- 20 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా ముందుకి..
- మహానాడునుంచి 'మై టీడీపీ' యాప్ అందుబాటులోకి..
- ఏడాదిలో అన్ని జిల్లాల్లో పార్టీ కార్యాలయాలు..
- పొలిట్ బ్యూరో నిర్ణయాలు వెల్లడించిన మంత్రి అచ్చెన్న
- అదిరిపోయేలా కడప మహానాడు: రాష్ట్ర అధ్యక్షుడు పల్లా
- సీమకు ఉజ్వల భవిష్యత్ చూపనున్న మహానాడు: కాల్వ శ్రీనివాసులు

2



తెలుగుదేశం పార్టీలో ఒకే పదవిలో మూడుసార్లుకంటే ఎక్కువ ఉండరాదన్న పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ప్రతిపాదనపై పొలిట్ బ్యూరోలో నిర్ణయం తీసుకున్నారు. మూడు పర్యాయాలు.. ఆరేళ్లుగాఉన్న మండల పార్టీ అధ్యక్షుల్ని మార్చాలని నిర్ణయించారు. మూడుసార్లు మండల పార్టీ అధ్యక్ష బాధ్యతలు నిర్వర్తించిన వారికి పైస్థాయి పదవి లేదా ఇతర సమాంతర పదవి ఇవ్వాలని నిర్ణయించారు. అలాగే, ఏడాదిలో మూడు సిలిండర్ల నగదును లబ్దిదారులకు ఒకేసారి చెల్లించాలని తెదేపా పోలిట్‌బ్యూరో నిర్ణయించింది. లబ్ధిదారులు సిలిండర్ ఎప్పుడు బుక్ చేసుకున్నా, సిలిండర్ తీసుకోకపోయినా మూడు సిలిండర్ల నగదు ఒకేసారి ఖాతాల్లో వేసేలా నిర్ణయించింది. తెదేపా కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో చంద్రబాబు అధ్యక్షతన తెలుగుదేశం పొలిట్ బ్యూరో సమావేశం తీసుకున్న నిర్ణయాలను మంత్రి అచ్చెన్నాయుడు మీడియాకు వెల్లడించారు.



## చరిత్రలో నిలిచిపోతుంది

- కడపలో తొలిసారి మహానాడు నిర్వహణపై సీఎం చంద్రబాబు
- సీమకు సాగు నీళ్లిచ్చింది.. ఫ్యాక్షన్‌ను అంతం చేసింది మనమే
- పెట్టుబడులు, భారీ పరిశ్రమలు, హార్టికల్చర్‌తో స్వరూపమే మారుతోంది
- మహానాడు నిర్ణయంతో సీమ శ్రేణుల్లో నూతనోత్సాహం
- నిర్వహణ బాధ్యులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు
- టీడీపీ కేంద్ర కార్యాలయంలో పెద్దఎత్తున సన్నాహక సమావేశం

4

## పండుగలా మహానాడు!

- ఎప్పటిలాగే మూడు రోజులపాటు నిర్వహణ
- భారీ ఏర్పాట్లపై జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ చర్చ
- మంత్రులు, పార్టీ సీనియర్లతో విస్తృత సమావేశం
- ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం

5



## పశుసంవర్ధకమే మన బలం

- రాష్ట్ర వృద్ధిరేటులో కీలక పాత్ర పోషించే శాఖకు ప్రాధాన్యం
- జీఎస్డీపీలో 11.23 శాతం వాటా పశుసంవర్ధక శాఖదే
- కోడిగుడ్ల ఉత్పత్తిలో రాష్ట్రానిదే ప్రథమ స్థానం
- పాడి పరిశ్రమతో పేదల జీవితాల్లో మార్పు సాధ్యం
- పశుసంవర్ధక శాఖలో టెక్నాలజీతో మెరుగైన ఫలితాలు
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టీకరణ

3



## ఏపీకి రెన్యూ ఎనర్జీ కాంప్లెక్స్

- రూ.22వేల కోట్లతో అనంతపురం జిల్లాలో ఏర్పాటు
- దేశంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ ప్రాజెక్టుగా ఆవిర్భావం
- 16న ఐటీ మంత్రి లోకేష్ శంకుస్థాపన
- ప్రజా ప్రభుత్వంలో పెద్దఎత్తున తరలివస్తున్న పునరుత్పాదక ఇంధన పరిశ్రమలు



5

## ఏపీ 'మెట్రో'పై మరో ముందడుగు

- రుణాలిచ్చేందుకు ముందుకొస్తున్న విదేశీ బ్యాంకులు
- ఏఐఐబీ ప్రతినిధులతో కార్పొరేషన్ ఎండీ సమావేశం
- ప్రతిపాదిక విజయవాడ కారిడార్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలన
- విజయవాడ, విశాఖ ప్రాజెక్టులకు రూ.12వేల కోట్లు అవసరమని అంచనా



6



## బుడమేరు గట్టుకు లైటెనింగ్

- వర్షాకాలం మొదలయ్యేలోగా పనులు పూర్తి చేయాలి
- బుడమేరునుంచి బెజవాడకు శాశ్వత ముంపు రక్షణ ప్రణాళిక
- జల వనరుల మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడి
- గతంలో గండ్లుపడిన 3 ప్రాంతాలను పరిశీలించిన మంత్రి

7

# ఏకమొత్తంగా 'దీపం'!



- ముందుగానే ఖాతాల్లోకి మూడు సిలెండర్ల నగదు
- మూడుసార్లు పదవుల్లోవున్న మండల పార్టీ అధ్యక్షుల మార్పు
- కూటమి నేతలతో 16, 17, 18 తేదీల్లో తిరంగ ర్యాలీలు
- ప్రతినెలా సంక్షేమం అందేలా 'ఏడాది క్యాలెండర్'
- మే నెలాఖరుకు అన్ని సంస్థాగత ఎన్నికలు పూర్తి
- 20 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా ముందుకి..
- మహానాడునుంచి 'మై టీడీపీ' యాప్ అందుబాటులోకి..
- ఏడాదిలో అన్ని జిల్లాల్లో పార్టీ కార్యాలయాలు..
- పొలిట్ బ్యూరో నిర్ణయాలు వెల్లడించిన మంత్రి అచ్చెన్న
- అదిరిపోయేలా కడప మహానాడు: రాష్ట్ర అధ్యక్షుడు పల్లా
- సీమకు ఉజ్వల భవిష్యత్ చూపనున్న మహానాడు: కాల్వ

అమరావతి: తెలుగుదేశం పార్టీలో ఒకే పదవిలో మూడుసార్లుకంటే ఎక్కువ ఉండరాదన్న పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ప్రతిపాదనపై పొలిట్ బ్యూరోలో నిర్ణయం తీసుకున్నారు. మూడు పర్యాయాలు.. ఆరేళ్లుగాఉన్న మండల పార్టీ అధ్యక్షుల్ని మార్చాలని నిర్ణయించారు. మూడుసార్లు మండల పార్టీ అధ్యక్ష బాధ్యతలు నిర్వర్తించిన వారికి పైస్థాయి పదవి లేదా ఇతర సమాంతర పదవి ఇవ్వాలని నిర్ణయించారు. తెదేపా కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో చంద్రబాబు అధ్యక్షతన తెలుగుదేశం పొలిట్ బ్యూరో సమావేశం జరిగింది. అనంతరం పొలిట్ బ్యూరో తీసుకున్న కీలక నిర్ణయాలను మంత్రి అచ్చెన్నాయుడు, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, మాజీ మంత్రి కాల్వ శ్రీనివాసులు మీడియాకు వెల్లడించారు. ప్రజలకు ప్రతి నెలా సంక్షేమం అందేలా ఏడాది క్యాలెండర్ రూపకల్పనకు పొలిట్ బ్యూరో నిర్ణయించిందని మంత్రి అచ్చెన్న వెల్లడించారు. అలాగే, ఏడాదిలో మూడు సిలిండర్ల నగదును లబ్దిదారులకు ఒకేసారి చెల్లించాలని నిర్ణయించామన్నారు. లబ్దిదారులు సిలిండర్ ఎప్పుడు బుక్ చేసుకున్నా, సిలిండర్ తీసుకోకపోయినా మూడు సిలిండర్ల నగదు ఒకేసారి ఖాతాల్లో వేసేలా పొలిట్ బ్యూరో నిర్ణయించిందన్నారు.

ఏప్రిల్ 22న పహల్గాంలో 27మంది అమాయకులైన యాత్రికులను ఉగ్రవాదులు పొట్టన పెట్టుకున్నారు. దీన్ని తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సమావేశం తీవ్రంగా ఖండించింది. మృతులకు నివాళిగా మౌనం పాటించి.. మృతుల కుటుంబాలకు సంతాపం ప్రకటించింది.

తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, మాజీ ఎమ్మెల్యే పాలకొండ్రాయుడు, పోతుగంటి పీరయ్య, వీరయ్యచౌదరి మరణం పట్ల పొలిట్ బ్యూరో ప్రగాఢ సానుభూతి ప్రకటించింది. వారి కుటుంబాలకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుంది. ఆపరేషన్ సింధూర్ రూపకల్పనచేసి, ఉగ్రవాద దాడుల్ని.. పాక్ సైనిక చర్యలను తిప్పికొట్టి, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టి, దేశం తరపున పాకిస్తాన్‌పై పోరాటం చేసిన ప్రధాని నరేంద్రమోడీ, త్రివిధ దళాలు, అధిపతులు, ఆపరేషన్ సింధూర్‌లో పాల్గొన్న ప్రతి సైనికుడినీ అభినందిస్తూ పొలిట్ బ్యూరో తీర్మానం చేసింది. పొలిట్ బ్యూరో సభ్యుడు నందమూరి బాలకృష్ణకు పద్మభూషణ్ రావడంపట్ల అభినందిస్తూ తీర్మానం చేశాం. పహల్గాం ఘటనలో 27మంది పౌరుల మృతిపట్ల తిరంగ సభలు జరపాలని కేంద్ర ప్రభుత్వం చేసిన తీర్మానంలో భాగంగా.. తెలుగుదేశం, జనసేన, బీజేపీలు 16, 17, 18 తేదీల్లో మూడు రోజులు అన్ని నియోజకవర్గాల్లో తిరంగ ర్యాలీలు జరిపాలని తెలుగుదేశం తరపున నిర్ణయం తీసుకున్నాం. టీడీపీ సభ్యులు ఎవరైనా ప్రమాదవశాత్తు చనిపోతే 2 లక్షలు బీమా సౌకర్యం ఉండేది. దాన్ని 5 లక్షలకు పెంచాం. ఇప్పటికే 195మందికి రూ.9.75 కోట్లు కార్యకర్తలకు అందించాం. ఎక్కడా ఆలస్యం కాకుండా కార్యకర్త చనిపోతే ఇన్సూరెన్స్ కంపెనీలతో మాట్లాడి వీలైనంత త్వరగా బీమా సొమ్ము అందేలా పొలిట్ బ్యూరో సమావేశంలో చర్చించాం. తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సంక్షేమానికి, వారికి ఏవైనా ఇబ్బందులుంటే ఆదుకోవడానికి అన్నివిధాల చర్యలు తీసుకుంటున్నాం. గత 11 నెలల్లో అర్హులైన 50,235 మందికి సీఎంఆర్ఎఫ్ కింద సుమారు రూ.349 కోట్లు ఆర్థిక సాయం చేశాం. ఎన్టీఆర్ స్కూల్, కార్పొరేట్ స్కూల్స్‌లో 600మందికి ఉచితంగా విద్యను అభ్యసించే ఏర్పాటు చేశాం. కార్యకర్తల సంక్షేమ నిధితో కార్యకర్తలకు సహాయపడేలా పొలిట్ బ్యూరో సమావేశంలో చర్చించాం' అని అచ్చెన్న వెల్లడించారు.

మే నెలాఖరుకు పార్టీ సంస్థాగత ఎన్నికలన్నింటినీ పూర్తి చేయాలని, ఇప్పటికే కేఎస్ఎస్, బూత్, గ్రామ కమిటీలు, క్లస్టర్, యూనిట్, మండల, నియోజకవర్గ, జిల్లాస్థాయి వరకూ మహానాడులోగా అన్ని కమిటీలు పూర్తి చేయాలని నిర్ణయించాం. మూడు సార్లు మండల పార్టీ అధ్యక్షులుగా చేసిన వారిని ఇతర పోస్ట్‌లో ఉంచేలా నిర్ణయం తీసుకున్నాం. నేడు రాష్ట్రంలో చాలా సమస్యలు ఉన్నాయి. ఆర్థికంగా కష్టాలున్నాయి. ఎన్ని కష్టాలున్నా అభివృద్ధి, సంక్షేమాన్ని సమాంతరంగా ముందుకు తీసుకెళ్తూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను, మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ.. ముందుకు వెళ్తున్నాం. ఇప్పటికే పింఛన్లు పెంచి ఇస్తున్నాం. వికలాంగుల పింఛన్ 15 వేలకు పెంచాం. గత ప్రభుత్వంలో భర్తలు చనిపోయిన భార్యలు పింఛన్ రానివారు లక్షమందికి పైగా ఉన్నారు. వారికి జూన్ 12న విడో పింఛన్‌లు అందించేందుకు నిర్ణయించాం. గ్యాస్ సిలిండర్లు తీసుకున్నా లేకపోయినా.. లబ్దిదారులకు ఖాతాల్లోకి ముందే డబ్బులు వేసేలా నిర్ణయం తీసుకున్నాం. మొన్ననే మత్స్యకారులకు రూ.258 కోట్ల వేట నిషేధ భృతి ఇచ్చాం. పాఠశాలలు తెరిచేలోగా తల్లికి వందనం కింద పిల్లల తల్లిదండ్రుల ఖాతాల్లో డబ్బులు వేయాలని పొలిట్ బ్యూరోలో నిర్ణయించాం. కేంద్రం అన్నదాత సుఖీభవ కింద ఫస్ట్ ఇన్‌స్టాల్‌మెంట్ ఇచ్చే రోజు మనం కూడా రైతుల అకౌంట్లలో డబ్బులు వేసేందుకు నిర్ణయించాం. త్వరలోనే ఒక్కొక్క నెలలో ఒక్కొక్క సంక్షేమ పథకాన్ని అమలు చేయాలని సంక్షేమ క్యాలెండర్‌ను కూడా వీలైనంత త్వరగా ఇచ్చేందుకు చర్చించాం. 11 నెలల్లో రూ.8.50 లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయి. అవన్నీ అమలు జరిగే విధంగా చూసి 20 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నాం. దీంతోపాటు ఈనెల 27, 28, 29న కడప జిల్లాలో మూడు రోజులు మహానాడును జరపాలని నిర్ణయించాం. రెండు రోజులు తీర్మానాలు ఉంటాయి. 27న జాతీయ పార్టీ అధ్యక్షులు నామినేషన్ వేస్తారు. 28న మళ్లీ జాతీయ పార్టీ అధ్యక్ష ఎన్నికతోపాటు మా వ్యవస్థాపక అధ్యక్షుల జన్మదిన వేడుకల పండుగను నిర్వహిస్తాం. కనీవినీ ఎరుగని విధంగా మహానాడును జరపాలని నిర్ణయించాం. మూడో రోజు బహిరంగ సభ ఉంటుంది' అని అచ్చెన్నాయుడు వివరించారు.

'2014 –2019లలో నీరు–చెట్టు పనులు చేసిన తెలుగుదేశం కార్యకర్తలకు గత ప్రభుత్వం ఒక పైసా కూడా బిల్లు రిలీజ్ చేయలేదు. మేము అపోజిషన్‌లో ఉన్నప్పుడు న్యాయస్థానంలో పోరాడి కొంత ఇప్పించాం. ఇంకా చాలా బిల్లులు పెండింగ్ ఉంటే ఫస్ట్ విడతలో కొంతఇచ్చాం. నీరు చెట్టులో రూ.445 కోట్లు, నరేగాలో రూ.211 కోట్లు బిల్లులు చెల్లించాలి. మహానాడులోపు బిల్లులను చెల్లించాలని ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారు. పొలిట్ బ్యూరోలో దీనిపైనా చర్చించడం జరిగింది. దుర్మార్గ ప్రభుత్వం మా కార్యకర్తలపై అక్రమంగా 2,887 కేసులు పెట్టారు. ఈ అక్రమ కేసులపై న్యాయపరంగా ముందుకు వెళు తున్నాం. తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో ఎక్కువమంది యానాదులున్నారు. వారికి రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు కూడా లేవు. వారి కోసం ప్రత్యేక డ్రైవ్‌పెట్టి ఈ యానాది కమ్యునిటీకి కార్డులతోపాటు అన్ని సంక్షేమ పథకాలు అందించేందుకు పొలిట్ బ్యూరో నిర్ణయం తీసుకోవడం జరిగింది. ఇకపై ఏ కార్యక్రమం జరిగినా ఒకే యాప్‌లో ప్రతి కార్యక్రమాన్నీ చూసేలా మై టీడీపీ యాప్‌ను తీసుకు రావడం జరిగింది. ఇటువంటి యాప్ దేశంలో ఏపార్టీకి లేదు. జాతీయ పార్టీ అధ్యక్షుల నుండి యాక్టీవ్ పార్టీ మెంబర్ వరకు దాదాపు కోటిమంది ఈ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకునేలా పొలిట్ బ్యూరోలో చర్చించాం. ఈ యాప్‌ను మహానాడు నుండే ఉపయోగంలోకి తీసుకురావాలని అధినేత చంద్రబాబు నాయుడు ఆదేశించారు. అన్ని జిల్లాల్లో పార్టీ కార్యాలయాలు వన్ ఇయర్‌లో నిర్మించాలి. దానికి రాష్ట్రస్థాయిలో త్రిమెన్ కమిటీ, జిల్లాస్థాయిలో త్రిమెన్ కమిటీ వేస్తారు. రాష్ట్రస్థాయిలో రాష్ట్ర అధ్యక్షులు నాయకత్వం వహిస్తారు. జిల్లాల్లో జిల్లా మంత్రి నాయకత్వం వహిస్తారు' అని పొలిట్ బ్యూరో నిర్ణయాలను అచ్చెన్నాయుడు వివరించారు.

## అదిరిపోయేలా మహానాడు: పల్లా

'టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లాశ్రీనివాసరావు మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ స్థాపించినప్పటినుంచి ప్రతి ఏడాది మహానాడును క్రమం తప్పక నిర్వహించడం జరుగుతోంది. యుద్ధ వాతావరణ నేపథ్యంలో మహానాడుపై మిమాంసలో ఉండి కొంత ఆలస్యమైంది. యుద్ధం ఆగిపోయిన నేపథ్యంలో మహానాడును నిర్వహించాలని పొలిట్ బ్యూరో నిర్ణయించింది. కనుక ఈనెల కడప జిల్లా సీకే దిన్నె మండలంలో 27, 28, 29 తేదీల్లో ఘనంగా మహానాడు నిర్వహించబోతున్నాం. ఇందులో మొదటి, రెండు రోజులు మండలస్థాయితోపాటు యూనిట్, క్లస్టర్ నాయకుల వరకు కార్యక్రమానికి పిలుస్తున్నాం. మొదటి రెండు రోజులు సుమారు 23 వేలమందిని ఆహ్వానిస్తున్నాం. మూడో రోజు గ్రామస్థాయి కమిటీ వరకు సుమారు 50 వేలమందికి ఆహ్వానం పంపుతున్నాం. ఇది కాకుండా చుట్టుపక్కల నియోజకవర్గాల్లోని కుటుంబ సాధికార సమితి కమిటీలకూ ఆహ్వానం పంపుతున్నాం. 2024 ఎన్నికల్లో కడప ప్రజలు తెలుగుదేశం పార్టీని బాగా ఆదరించారు. ఈ మహానాడును అందరూ కలిసి విజయంతం చేయాలి. ఇందుకోసం ప్రతి నియోజకవర్గంలో క్యాడర్‌ను పిలిచి ట్రైనింగ్ ఇస్తున్నా'మని వివరించారు.

## సీమకు ఉజ్వల భవిష్యత్: కాల్వ

మాజీ మంత్రి కాల్వ శ్రీనివాసులు మాట్లాడుతూ.. మొట్టమొదటిసారి తెలుగుదేశం పార్టీ కడప గడ్డపై టీడీపీ తన మూడు రోజుల మహానాడును నిర్వహించుకోబోతుంది. రాయలసీమలో ఈరోజు అభివృద్ధి ఫలాలను ప్రజలు, రైతులు, పేదలు చూడబోతున్నారంటే దానికి కారణం మహనీయుడు ఎన్టీఆర్ చేసిన ఆలోచనలు.. చంద్రబాబు చేసిన ఆచరణ. రాయలసీమకు ఈరోజు నీళ్లు వచ్చాయన్నా, పరిశ్రమలు వచ్చి ఉద్యోగాలు వచ్చాయన్నా వీరి కృషే కారణం. శతాబ్దాల రాయలసీమ వెనుకబాటు తనానికి శాశ్వతమైన పరిష్కార మార్గాలు కనుగొనడానికి కడప మహానాడుకు వేదిక కాబోతుంది. ఎందుకంటే చేసే తీర్మానాలు, జరిగే చర్చల్లో దాదాపు 60 శాతం రాయలసీమకు సంబంధించి మాట్లాడుకోబుతన్నాం. ఇది మా యువనాయకుడు నారా లోకేష్ చేసిన తీర్మానం. రాయలసీమలో తరాల వెనుకబాటుతనానికి, శతాబ్దాల దారిద్ర్యానికి శాశ్వతమైన పరిష్కారం మహానాడు చూపెట్టబోతుంది. అదే కడపగడ్డపై నారా లోకేష్ రాయలసీమ డిక్లరేషన్ ప్రకటించారు. ఆ డిక్లరేషన్ అమల్లో భాగంగానే ఈరోజు డ్రిప్ సబ్సీడీగాని, పరిశ్రమల ఏర్పాటుగాని, సాగునీటి రంగంలో హంద్రీనీవాకు రూ.3700 కోట్లు ఇవ్వడం.. ఇవన్నీ కూడా చంద్రబాబు తీసుకునే ప్రత్యే శద్ధగా తెలియజేస్తున్న. ఈ నేపథ్యంలో కడపలో జరుగుతన్న మహానాడు ద్వారా రాయలసీమకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని రాయలసీమ ప్రజలకు చెబుతున్నాం. ఈ మహానాడు చారిత్రాత్మక ఘట్టంగా చరిత్రలో నిలిచిపోతుంది. అదే విధంగా చేసే తీర్మానాల్లో 11 నెలల్లో సాధించిన విజయాలతో పాటు.. ప్రజలపట్ల ఎంత బాధ్యతతో పనిచేశాం.. ప్రజల ఆశలు ఆకాంక్షలు నెరవేర్చడానికి ఆర్థిక సమస్యలను ఏవిధంగా అధిగమిస్తున్నాం. చంద్రబాబు నాయుడి పరిపాలన దక్ష్యత, పాలనా అనుభవంతో విదేశాల్లో ఆయనకున్న పరిచయంతో పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని స్వర్గదామంగా మార్చగలు తున్నాం. లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించగలు తున్నాం. ఈ రాష్ట్రానికి చంద్రబాబు నాయుడు పెద్ద ఆస్తి. ఆయన మార్గదర్శకత్వంలో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి అసలు సిసలు చిరునామాగా మారుతుందని ఒక స్పష్టమైన సంకేతాన్ని కడప మహానాడు ద్వారా ప్రజలకు ఇవ్వబోతున్నాం' అన్నారు.

చైతన్యరథం

# పశుసంవర్ధకమే మన బలం



- రాష్ట్ర వృద్ధిరేటులో కీలక పాత్ర పోషించే శాఖకు ప్రాధాన్యం
- జీఎస్డీపీలో 11.23 శాతం వాటా పశుసంవర్ధక శాఖదే
- కోడిగుడ్ల ఉత్పత్తిలో రాష్ట్రానిదే ప్రథమ స్థానం
- మాంసం ఉత్పత్తిలో 5, పాల ఉత్పత్తిలో 7వ స్థానంలో ఉన్నాం
- పాడి పరిశ్రమతో పేదల జీవితాల్లో మార్పు సాధ్యం
- గ్రామాల్లో డెయిరీ షెడ్లకు ప్రాపర్టీ టాక్స్ రద్దు చేస్తాం
- పశుసంవర్ధక శాఖలో టెక్నాలజీతో మెరుగైన ఫలితాలు
- సామర్థ్య పెంపునకు టెక్నాలజీని అనుసరించాలి
- కులవృత్తుల వారికి ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టీకరణ
- పశు సంవర్ధక శాఖ - టెక్ ఏఐ 2.0 కాన్క్లేవ్‌కు హాజరైన సీఎం
- పాడి, పౌల్ట్రీ, జీవాల పెంపకంలో ఏఐ వినియోగంపై చర్చ

విజయవాడ (చైతన్య రథం): పాడి పరిశ్రమ ద్వారా పేదల జీవితాల్లో మార్పు వస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. వ్యవసాయం, అనుబంధ రంగాల్లో ఏపీ నెంబర్‌వన్‌గా ఉందని, టీడీపీ అధికారంలో ఉన్నప్పుడల్లా వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. విజయవాడలో బుధవారం హోటల్ మురళీ ఫార్చ్యూన్‌లో జరిగిన పశు సంవర్ధక శాఖ–టెక్ ఏఐ 2.0 కాన్క్లేవ్‌లో సీఎం పాల్గొన్నారు. పశుగణ రంగాన్ని అభివృద్ధి చేయడం ద్వారా పేదరికాన్ని తగ్గించాలనే లక్ష్యంతో జిఎఫ్ఎస్‌టి (గ్లోబల్ ఫోరమ్ ఫర్ సస్టయినబుల్ ట్రాన్స్‌ఫర్మేషన్) సంస్థ ఈ వర్క్ షాపు ఏర్పాటు చేయడం సంతోషకరమని, ఇటువంటి సమావేశాలకు హాజరవుతూ కొత్త విషయాలను అందరూ నేర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు వివిధ వృత్తులవారితో ముచ్చటించారు. వారి ఆదాయ, వ్యయాలపై చర్చించారు. సుమారు మూడు గంటలకు పైగా సీఎం సమావేశంలో పాల్గొన్నారు.

## అన్ని రంగాల్లో దూసుకెళ్తున్న ఏపీ

'భారతదేశం ప్రపంచంలోనే పాల ఉత్పత్తిలో అగ్రగామి కాగా మన రాష్ట్రం అందులో వేగంగా పురోగతి సాధిస్తుండటం శుభ పరిణామం. గుడ్ల ఉత్పత్తిలో మొదటిస్థానం, మాంసం ఉత్పత్తిలో 5వ స్థానం, పాల ఉత్పత్తిలో 7వ స్థానంలో మన రాష్ట్రం ఉంది. లైవ్‌స్టాక్‌లో 2014-15లో జీఎస్‌డీపీ రూ.43,127 కోట్లు ఉండగా.... 2018-2019 నాటికి దానిని రూ.91,633 కోట్లకు పెంచాం. 2014-19 మధ్య సీఏజీఆర్ 21 శాతం ఉండగా.. 2019-24 మధ్య ఈ వృద్ధి 11శాతానికి తగ్గింది. 2024-25లో రూ.1.69 లక్షల కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. రాష్ట్ర జీఎస్‌డీపీలో ఇది 11.23 శాతం. 2025-26 సంవత్సరానికి ఈ రంగంలో జీఎస్డీపీ వృద్ధి లక్ష్యం రూ.1,95,460 కోట్లుగా పెట్టుకున్నాం' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.



## పాడి రంగంతో పేదల జీవితాల్లో మార్పు

లైవ్ స్టాక్‌పైన 42 లక్షల కుటుంబాలు అధారపడి జీవిస్తున్నాయని, పాడి పరిశ్రమ ద్వారా పేదల బతుకుల్లో మార్పు వస్తుందన్నారు. టీడీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల కాలంలో రైతుల ఆదాయాలు రెట్టింపు అయ్యాయి. కానీ తరువాత వచ్చిన ప్రభుత్వాలు సమర్ధవంతంగా పని చేయలేదు. మా ప్రభుత్వంలో పాడి పరిశ్రమలో 22 శాతం సీఏజీఆర్ సాధించాం. జీఎస్టీలో రూ.లక్షా 69 వేల కోట్ల రూపాయలే లైవ్ స్టాక్ విభాగం నుంచి వస్తోంది. 18 లక్షల హెక్టార్లలో ఉద్యానవన పంటలు సాగైతే రూ.లక్షా 55 వేల కోట్ల ఆదాయం వస్తుంది. అదే 50 లక్షల హెక్టార్లలో పండే వ్యవసాయ పంటల కారణంగా రూ.55వేల కోట్లు వస్తోంది. అందుకే అధిక ఆదాయాన్నిచ్చే ఉద్యానవన పంటలను ప్రోత్సహించాలని నిర్ణయించుకున్నాం. 18 లక్షల హెక్టార్లను 36 లక్షల హెక్టార్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాం' అని సీఎం చంద్రబాబు అన్నారు.

## వ్యవసాయ రంగంలో మనమే టాప్

'ఆంధ్రప్రదేశ్ వ్యవసాయంలో నెంబర్‌వన్ రాష్ట్రంగా ఉంది. కానీ సేవల రంగం కూడా మెరుగవ్వాలి. ఇండస్ట్రీలు కూడా పెరగాలి. తెలంగాణ ఆదాయంలో 67 శాతం సేవల రంగం నుంచే వస్తోంది. అదే మన రాష్ట్రంలో 46 శాతం మాత్రమే ఉంది. రాష్ట్రంలో సేవల రంగంతోపాటు ఇండస్ట్రీని పెంచుకోవాల్సిన అవసరం ఉంది. ప్రపంచవ్యాప్తంగా ప్రజల ఆహారపు అలవాట్లు మారుతున్నాయి. మంచి ఆరోగ్యం కోసం ప్రోటీన్ ఫుడ్‌వైపు ప్రజలు మళ్లుతున్నారు. మిల్లెట్స్‌వంటి వాటిపై ఆసక్తి చూపుతున్నారు. వీటితోపాటు పండ్లు, కూరగాయలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. అందుకోసమే మనం ఉద్యానవన పంటలను అధికంగా పండించాలి. ఉద్యాన పంటల సంరక్షణ కోసం మైక్రో ఇరిగేషన్ చాలా అవసరం. మైక్రో ఇరిగేషన్‌పై అప్పటి వాజ్‌పేయి ప్రభుత్వానికి నేనొక నివేదిక ఇచ్చాను. ఆ నివేదికనే ఇప్పటికీ మైక్రో ఇరిగేషన్‌కు ఒక బైబిల్‌గా వాడుతున్నారు. మైక్రో ఇరిగేషన్‌కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిరునామాగా ఉంది' అన్నారు.

## పాడి, పౌల్ట్రీ పరిశ్రమలను లాభాల బాట పట్టిస్తాం

'పాడి, పౌల్ట్రీ పరిశ్రమలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెడుతుంది. ఈ రెండు రంగాలను లాభాల బాట పట్టిస్తాం. గ్రామస్థాయిలో డెయిరీ షెడ్లకు ప్రాపర్టీ టాక్స్, హౌస్ టాక్స్ రద్దు చేస్తాం. కేంద్ర ప్రభుత్వ పథకాలన్నీ ఆన్‌లైన్‌లో పెడతాం. అలాగే రాష్ట్రంలో మొబైల్ అంబులెన్స్‌లు ఎన్ని ఉన్నాయి, ఇంకెన్ని అవసరమో అధ్యయనం చేస్తాం. నరేగా ఇంటిగ్రేట్ చేస్తున్నాం. అవసరమైతే వాటిని డ్వాక్రాకు అప్పగిస్తాం. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో మాట్లాడి దానిపై కార్యాచరణ రూపొందిస్తాం. ప్రతి రైతుకు నరేగా ద్వారా వాటర్ సప్లయ్ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుడతాం. బీసీల్లో కులవృత్తుల వారిని ఆర్థికంగా పైకి తీసుకొస్తాం. యాదవ, కురబలతోపాటు అన్నివర్గాల వారిని ఆదుకుంటాం. డెయిరీకి మైక్రో ఇరిగేషన్ వర్తింపచేస్తాం. మైక్రో ఇరిగేషన్‌లో 2.5 లక్షల ఎకరాలకు ఈ ఏడాది ప్రాధాన్యత ఇచ్చాం. సోలార్ పవర్ వెయ్యి యూనిట్ల వరకు పర్మిషన్ ఇస్తాం. మహిళలు తేలిగ్గా గడ్డి కోసేలా కటింగ్ మిషన్స్ అందుబాటులోకి తెస్తాం. డెయిరీని ఎలా ముందుకు తీసుకుపోవాలి, ఖర్చు ఎలా తగ్గించాలి, పశువుల ఎలా చూసుకోవాలనే అంశంపై అధ్యయనంతో అవగాహన కల్పిస్తామని సీఎం చంద్రబాబు వివరించారు.

## నేను నిత్య విద్యార్థిని

నేనెప్పుడూ నిత్య విద్యార్థిగా నేర్చుకుంటూనే ఉంటాను. టెక్నాలజీలో చాలా మార్పులు వస్తున్నాయి. దాన్ని అందిపుచ్చుకున్నవారు మాత్రమే ముందుకు సాగుతారు. హైదరాబాద్‌లో ఐటీని అభివృద్ధి చేసిన కారణంగా ప్రపంచంలోనే అత్యధిక తలసరి ఆదాయం పొందుతున్న వారు భారతీయులు కాగా అందులో 35 శాతం మంది తెలుగు వారున్నారు. ప్రస్తుతం నాలెడ్జ్, టెక్నాలజీ అందుబాటులో ఉన్నాయి. వీటిని ఉపయోగించుకొని ఎంట్రప్రెన్యూర్లను తయారు చేయాలి. అందుకోసం ఏర్పడిన సంస్థనే జీఎఫ్ఎస్టీ. ఈ సంస్థ ముందుకు సాగేందుకు కొంతమేరకు మేం సహాయపడతాం. దీన్ని జాతీయస్థాయిలో గొప్ప సంస్థగా రూపు దిద్దవలసింది నిర్వాహకులే. నాంది ఫౌండేషన్ నా సహాయంతో రెడ్డి ల్యాబ్స్ అధినేత అప్పట్లో ప్రారంభించారు. ఆ తర్వాత దాని నిర్వహణ ఆనంద్ మహీంద్రా చేతికి వెళ్లింది. ఇప్పుడు నాంది ఫౌండేషన్ ఎంత సేవ చేస్తుందో మనం చూస్తూనే ఉన్నాం. అలాగే బసవతారకం క్యాన్సర్ హాస్పటల్ ఒక ట్రస్టుగా ఆ రంగంలో సేవలందిస్తున్న సంస్థల్లో దేశంలోనే మేటైన ట్రస్టుగా ఉంది. అలాగే ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్‌ను కూడా ఏర్పాటు చేసి సేవలందిస్తున్నామని చంద్రబాబు పేర్కొన్నారు.

## ఐదేళ్ల విధ్వంసాన్ని అధిగమిస్తున్నాం

గడిచిన ఐదేళ్లలో రాష్ట్రంలో జరిగింది మామూలు విధ్వంసం కాదు. రూ.10 లక్షల కోట్ల అప్పుల భారం ప్రజలపై వేసి వెళ్లారు. బ్రాండ్ ఏపీ మైనస్‌కు పడిపోయింది. ఆంధ్రప్రదేశ్ పేరు చెబితేనే పారిశ్రామికవేత్తలు భయపడిపోయారు. అమ్మో ఏపీకి రాలేమంటూ పరుగులు తీశారు. నా విశ్వసనీయతతో అందర్నీ రాష్ట్రానికి తిరిగి తీసుకొస్తున్నాను. ఎన్టీఆర్ స్ఫూర్తితో పీ4కు శ్రీకారం చుట్టాం. పేదరిక నిర్మూలనతో పాటు ఆర్థిక వ్యత్యాసాలు తగ్గిస్తూ ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు పనిచేస్తాం' అని సీఎం చంద్రబాబు అన్నారు.

## వివిధ వృత్తిదారులతో సీఎం ముఖాముఖి

గొర్రెల ఫామ్ నడుపుతున్న నరేంద్ర యాదవ్ మాట్లాడుతూ –గొర్రెల పెంపకంపై అవగాహన కోసం ప్రతి రోజూ యువకులు మా ఫామ్‌కు వస్తుంటారు. మేము గొర్రెల పెంపంకంపై ప్రభుత్వ ఆస్పత్రుల నుంచే సలహాలు తీసుకుంటున్నాము. జమ్మలమడుగు నియోజకవర్గంలో మమ్మల్ని ఆదర్శంగా తీసుకుని 13మంది గొర్రెల ఫామ్‌లు పెట్టుకున్నారు. మాకు 24 గంటలూ సింగిల్ ఫేజ్ విద్యుత్ అందేలా చర్యలు తీసుకోవాలి అని కోరారు. కోవా తయారీదారు జుబేదా మాట్లాడుతూ –మేము పాల కోవా తయారుచేస్తాం. 2014లో మీరు సీఎం అయ్యాక డ్వాక్రా బజార్లలో విక్రయించేవాళ్లం. 2017లో పశువుల పెంపకం చేపట్టాము. 200 గేదెలు ఉండేవి. గత ప్రభుత్వంలో ఇబ్బందులు వచ్చాయి. కేసులు పెట్టి వేధించారు. అయినా ధైర్యంగా నిలబడ్డానని వివరించారు. డెయిరీ నిర్వాహకురాలు శ్రీపద్మ మాట్లాడుతూ పశువుల మేత కోసం గడ్డి పెంచుకోవాలంటే నీరు పెట్టడానికి మనిషిని పెట్టుకోవాలి. ఇందుకోసం పశుసంవర్ధక సంస్థ ద్వారా సాయం చేయండి. నా దగ్గర 50 పశువులు ఉన్నాయి. నెలకు రూ.15 వేలు కరెంటు బిల్లు వస్తోంది. 10 కేవీ కరెంటు వాడుతున్నాను. దీనికి సరిపడా సోలార్ ప్యానల్స్‌ను ప్రభుత్వం అందిస్తే ఖర్చు తగ్గుతుందని కోరారు.









# చరిత్రలో నిలిచిపోతుంది

- కడపలో తొలిసారి మహానాడు నిర్వహణపై సీఎం చంద్రబాబు
- సీమకు సాగు నీళ్లిచ్చింది... ఫ్యాక్షన్‌ను అంతం చేసింది మనమే
- పెట్టుబడులు, భారీ పరిశ్రమలు, హార్టికల్చర్‌తో స్వరూపమే మారుతోంది
- మహానాడు నిర్ణయంతో సీమ శ్రేణుల్లో నూతనోత్సాహం
- నిర్వహణ బాధ్యులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు
- టీడీపీ కేంద్ర కార్యాలయంలో పెద్దఎత్తున సన్నాహక సమావేశం



అమరావతి (చైతన్య రథం): కడపలో మొట్టమొదటిసారిగా నిర్వహిస్తోన్న మహానాడు చరిత్రలో నిలిచిపోతుందని సీఎం చంద్రబాబునాయుడు అన్నారు. బుధవారం తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహణ కమిటీ బాధ్యులు, ముఖ్య నేతలతో మహానాడు సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబునాయుడు మాట్లాడుతూ... ఈ నెల 27, 28, 29వ తేదీల్లో జరుగుతున్న మహానాడు కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత జరుగుతున్న తొలి మహానాడు అన్నారు. గతంలో రాయలసీమలో తిరుపతివంటి చోట్ల మహానాడు నిర్వహించినా.... కడపలో తొలిసారి నిర్వహిస్తున్నామన్నారు. అనేక సవాళ్లు, సంక్షోభాలను ఎదుర్కొని 2024లో అధికారంలోకి వచ్చామని... ఏడాది కాలంలో అనుకున్న దానికంటే మెరుగైన పాలన అందించామని సీఎం చంద్రబాబు అన్నారు. ఈ సమయంలో జరుగుతున్న మహానాడు కార్యక్రమంలో పార్టీ వ్యవహారాలు, ప్రభుత్వ నిర్ణయాలు, పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్ ప్రణాళికలపై సమగ్ర చర్చ జరగాలన్నారు.



## రాయలసీమ రూపురేఖలు మార్చిందే తెలుగుదేశం

రాయలసీమ ప్రజల గుండెల్లో పార్టీ బలంగా ఉందని... దీనికి కారణం తెలుగుదేశం ఆవిర్భావం తరువాత ఆ ప్రాంతంలో వచ్చిన మార్పులేనని అన్నారు. రాయలసీయను పీడిస్తున్న ఫ్యాక్షన్ భూతాన్ని సమూలంగా అంతం చేసిన చరిత్ర తెలుగుదేశం పార్టీదని... ఫ్యాక్షన్‌పై అత్యంత కఠినంగా వ్యవహరించాం కాబట్టే నేడు సీమనుంచి ఫ్యాక్షన్‌ను పూర్తిగా తరిమేశామని సీఎం అన్నారు. ఇలాంటి చారిత్రాత్మక చర్యలు ప్రజల గుండెల్లో ఉన్నాయని గుర్తు చేశారు. సీమకు సాగునీరు ఇవ్వడం ద్వారా అక్కడి స్థితిగతులు మార్చాలని మొదట ఎన్టీఆర్ సంకల్పం చేశారన్నారు. హంద్రీనీవా, గాలేరు -నగరి, తెలుగుగంగ, ముచ్చుమర్రి లిఫ్ట్ వంటి ప్రాజెక్టులు టీడీపీ హయాంలో చేపట్టినవేనని సీఎం గుర్తు చేశారు. ఎడారిగా మారుతున్న అనంతపురం జిల్లాకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి తాగు, సాగు నీరిచ్చిన ఘనత టీడీపీదన్నారు. డ్రిప్ ఇరిగేషన్ ద్వారా సీమలో కరువుకు సమాధానం చెప్పామని.... నేడు డ్రిప్‌లేని ప్రాంతాన్ని రాయలసీమలో మనం చూడగలమా? అన్నారు. 2014 తరవాత టీడీపీ పాలనలో రూ.12 వేల కోట్లకు పైగా నిధులను రాయలసీమలోనే సాగునీటి ప్రాజెక్టులపై ఖర్చు పెట్టి గొప్ప ఫలితాలు సాధించామన్నారు. ఒకవైపు కరువు సీమను సస్యశ్యామలం చేస్తూ మరోవైపు పారిశ్రామికీకరణకు పెద్దపీట వేస్తున్నామన్నారు. కడప జిల్లా కొప్పర్తిలో పారిశ్రామిక హబ్, నెల్లూరు జిల్లా రామాయపట్నంలో బీపీసీఎల్, కర్నూలులో ఓర్వకల్ హబ్, అనంతపురం జిల్లాలో కియా, విండ్ పవర్, సోలార్ ద్వారా సీమలో ప్రగతిని వేగవంతం చేశామన్నారు. తిరుమల, తిరుపతి అభివృద్ధి జరిగిందంటే టీడీపీ హయాంలోనేనన్న విషయం అందరికీ తెలుసని సీఎం అన్నారు. కడప, కర్నూలు ఎయిర్ పోర్టు నిర్మించింది కూడా తెలుగుదేశం ప్రభుత్వమేనని గుర్తుచేశారు.

## మహానాడుతో నూతనోత్సాహం

టీడీపీ క్యాడర్ మంచి ఉత్సాహంతో పనిచేస్తున్నారని, ఈ సభ ద్వారా రాయలసీమలో నూతన ఉత్సాహం వస్తుందని చంద్రబాబు అన్నారు. రాయలసీమలో హార్టికల్చర్, పరిశ్రమలు, డెయిరీలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. హార్టికల్చర్ ద్వారా వచ్చే మార్పులతో రాయలసీమ ప్రజలు కోనసీమ రైతులను అధిగమిస్తారని... ఈ ఫలితాలు రానున్న 4 ఏళ్లలో చూస్తామన్నారు. పార్టీ నేతలు ఈ అంశాలన్నీ ప్రజల్లో చర్చించాలన్నారు.

## పార్టీ సిద్ధాంతాలు... ప్రభుత్వ విజయాలపై చర్చ

మహానాడుకు హాజరయ్యే ప్రతినిధులకు, పార్టీ శ్రేణులకు వసతి, రవాణాకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని చంద్రబాబు సూచించారు. పార్టీ సిద్ధాంతాలు, నాలుగు దశాబ్దాల ప్రయాణంలో సాధించిన విజయాలు, నేడు ప్రభుత్వ విజయాలు మహానాడులో విస్తృతంగా చర్చించాలని సీఎం సూచించారు. మొదటిరోజు పార్టీపరమైన అంశాలపై, రెండోరోజు ప్రభుత్వ పరంగా అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి చర్చించాలన్నారు. మూడో రోజు లక్షలాదిమందితో భారీ బహిరంగ సభ ఉంటుందని, ఎక్కడ ఎవరికీ ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి అందరికీ అవగాహన కలిగించేలా తీర్మానాలు ఉండాలని చంద్రబాబు తెలిపారు. మినీ మహానాడును ఈనెల 18, 19, 20వ తేదీల్లో అన్ని నియోజకవర్గాల్లో, 22, 23వ తేదీల్లో పార్లమెంట్లవారీగా నిర్వహించాలని చంద్రబాబు పార్టీ నేతలకు సూచించారు.

చైతన్యరథం

# పండుగలా మహానాడు!

- ఎప్పటిలాగే మూడు రోజులపాటు నిర్వహణ
- భారీ ఏర్పాట్లపై జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ చర్చ
- మంత్రులు, పార్టీ సీనియర్లతో విస్తృత సమావేశం
- ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం



మంగళగిరి (చైతన్య రథం): కడపలో పండుగ వాతావరణంలో తెలుగుదేశం మహానాడు నిర్వహిస్తామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. పొలిట్‌బ్యూరో సమావేశానికి హాజరయ్యే ముందు మంగళగిరిలోని తెలుగుదేశం జాతీయ కార్యాలయంలో మహానాడు కమిటీల కన్వీనర్లు, కో కన్వీనర్లతో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సమావేశం నిర్వహించారు. మహానాడు ఏర్పాట్ల గురించి నేతలతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా పలువురు మంత్రులు, సీనియర్ నేతలకు బాధ్యతలు అప్పగించారు. పొలిట్‌బ్యూరో సమావేశంలో మహానాడు ఏర్పాట్లపై మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలోని మంత్రుల కమిటీ నివేదిక ఇవ్వనుంది. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. 'అన్న ఎన్టీఆర్‌నుంచీ పండుగ వాతావరణంలో మహానాడు నిర్వహించడం జరుగుతోంది. పార్టీ కష్టకాలంలో ఉన్నా, అధికారంలో ఉన్నా మహానాడును నిర్వహించాం. గత ప్రభుత్వంలో మహానాడుకు అడుగడుగునా ఇబ్బందులు పెట్టారు. అయినా ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి విజయవంతం చేశారు. పార్టీ ఆవిర్భావం తర్వాత చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా తిరుగులేని మెజార్టీ సాధించాం. పండుగ వాతావరణంలో జరగనున్న మహానాడుకు వసతి, రవాణకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఈ సందర్భంగా నేతలకు దిశానిర్దేశం చేశారు. మూడు రోజులపాటు మహానాడు నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. మొదటిరోజు తెలుగుదేశం పార్టీ విధి విధానాలు, సిద్ధాంతాలు, కార్యాచరణపై చర్చించనున్నారు. రెండో రోజు రాష్ట్రం కోసం కూటమి ప్రభుత్వం చేపట్టిన పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై రూపొందించిన తీర్మానాలపై చర్చ జరగనుంది. మూడో రోజు బహిరంగ సభ నిర్వహించనున్నారు. పార్లమెంట్ మహానాడు, నియోజకవర్గాల మహానాడు నిర్వహణపైనా సమావేశంలో చర్చించారు.

కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు అనగాని సత్యప్రసాద్, నిమ్మల రామానాయుడు, ఎస్.సవిత, పి నారాయణ, గొట్టిపాటి రవికుమార్, డాక్టర్ డోలా బాలవీరాంజనేయ స్వామితో పాటు సీనియర్ నేతలు బీద రవిచంద్ర యాదవ్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, దామచర్ల సత్య, రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి, వీరంకి వెంకట గురుమూర్తి, మంతెన రామరాజు, సి.భూపేష్‌రెడ్డి, ఎమ్మెల్యేల జ్యోతుల నెహ్రూ, ఆర్.మాధవి రెడ్డి, జీవీ ఆంజనేయులు, మంతెన సత్యనారాయణ రాజు, చింతకాయల విజయ్ తదితరులు పాల్గొన్నారు.



## నేడు ప్రకాశంలో మంత్రి లోకేష్ పర్యటన

### 16, 17న అనంతపురంలో జిల్లాలో

అమరావతి (చైతన్య రథం): రాష్ట్ర విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ రాష్ట్ర పర్యటనలో భాగంగా వివిధ కార్యక్రమాల్లో పాల్గొనున్నారు. గురువారం ఉదయం ప్రకాశం జిల్లాకు వెళ్తున్న మంత్రి లోకేష్, అమ్మనబ్రోలులో ఇటీవల హత్యకు గురైన వీరయ్యచౌదరి కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు. సాయంత్రం 3 గంటలకు గుంతకల్లు నియోజకవర్గం రామరాజుపల్లెలో ఉత్తమ కార్యకర్తలతో భేటీ అవుతారు. అనంతరం 4 గంటలకు రామరాజుపల్లిలో పార్టీ కార్యకర్తలతో సమావేశమవుతారు. 16న శుక్రవారం ఉదయం 10 గంటలకు అనంతపురం జిల్లా గుంతకల్లు నియోజకవర్గం బేతపల్లిలో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటవుతున్న రెన్యూ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తారు.

మధ్యాహ్నం 1 గంటకు జీఎంఆర్ కాంపౌండ్ అయ్యప్పస్వామి ఆలయం దగ్గర 80 ఫీట్ల రోడ్‌ను ప్రారంభిస్తారు. అనంతరం అనంతపురంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు కుమార్తె వివాహానికి హాజరవుతారు. 17న ఉదయం 10 గంటలకు అనంతపురం జెఎన్‌టీయూ స్నాతకోత్సవానికి హాజరవుతారు.

# ఏపీకి రెన్యూ ఎనర్జీ కాంప్లెక్స్

- రూ.22వేల కోట్లతో అనంతపురం జిల్లాలో ఏర్పాటు
- దేశంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ ప్రాజెక్టుగా ఆవిర్భావం
- 16న ఐటీ మంత్రి లోకేష్ శంకుస్థాపన
- ప్రజా ప్రభుత్వంలో పెద్దఎత్తున తరలివస్తున్న పునరుత్పాదక ఇంధన పరిశ్రమలు



అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో ప్రజాప్రభుత్వం ఏర్పాటయ్యాక తెచ్చిన ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ (ఐసీఈ)తో పెద్దఎత్తున పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు ఏపీకి క్యూకడుతున్నాయి. ఇందులో భాగంగా అనంతపురం జిల్లా గుంతకల్లు నియోజకవర్గం బేతపల్లిలో రెన్యూ సంస్థ రూ.22వేల కోట్లతో భారతదేశంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ రెన్యువబుల్ పవర్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయనుంది. ఈనెల 16న రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేష్ ఈ భారీ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయనున్నారు. దావోస్ వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సులో మంత్రి లోకేష్, రెన్యూ చైర్మన్ సుమంత్ సిన్హా నడుమ జరిగిన వ్యూహాత్మక చర్చలు ఫలించడంతో లోకేష్ ఆరేళ్ల తర్వాత రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు రెన్యూ పవర్ ముందుకు వచ్చింది.

రెన్యూ ఇంటిగ్రేటెడ్ ప్రాజెక్టు భారతదేశంలోనే అతిపెద్ద పునరుత్పాదక ఇంధన పెట్టుబడులలో ఒకటిగా నిలవనుంది. ఈ ప్రాజెక్టు తొలిదశలో రెన్యూ సంస్థ 587 మెగావాట్ల సోలార్, 250 మెగావాట్ల విండ్, 415 మెగావాట్ల సామర్థ్యంగల బ్యాటరీ స్టోరేజీ యూనిట్లపై రూ.7 వేల కోట్ల పెట్టుబడి పెట్టనుంది. వివిధ దశల్లో 1800 మెగావాట్ల సోలార్, 1 గిగావాట్ విండ్, 2000 మెగావాట్ల సామర్థ్యంగల బ్యాటరీ స్టోరేజీ యూనిట్లపై మొత్తంగా 22 వేల కోట్ల పెట్టుబడి పెట్టనుంది. ఈ ప్రాజెక్టు దేశంలోనే అతిపెద్ద రెన్యూవబుల్ పవర్ కాంప్లెక్స్‌గా ఆవిర్భవించడమేగాక ఏపీ క్లీన్ ఎనర్జీ కెపాసిటీ, గ్రిడ్ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుతుంది. 2019కి ముందు 777 మెగావాట్ల సామర్థ్యంతో ఏపీ పునరుత్పాదక ఇంధనరంగంలో ప్రధాన పెట్టుబడిదారుగా ఉన్న రెన్యూ... ఆ తర్వాత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ అరాచక విధానాలతో పెట్టుబడులు పెట్టడం ఆపేసింది. టీడీపీ ప్రభుత్వ హయాంలో కుదుర్చుకున్న పీపీఏలన్నింటినీ జగన్ ప్రభుత్వం ఏకపక్షంగా రద్దుచేసింది. వైసీపీ ప్రభుత్వ అనాలోచిత చర్యలతో పునరుత్పాదక ఇంధన సామర్థ్యం జీరోస్థాయికి పడిపోయింది.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక పునరుత్పాదక ఇంధన రంగం మళ్లీ పట్టాలెక్కింది. గత ఏడాది అక్టోబర్‌లో క్లీన్ ఎనర్జీ పాలసీని ప్రభుత్వం విడుదల చేసింది. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అనుసరిస్తున్న ఇండస్ట్రీ ఫ్రెండ్లీ విధానాలు, పెట్టుబడిదారులకు అనుకూలమైన వాతావరణం, రెన్యూవబుల్ ఎనర్జీ పరిశ్రమలకు అందిస్తున్న ప్రోత్సాహకాలను దావోస్ చర్చల్లో మంత్రి లోకేష్ రెన్యూ పవర్ చైర్మన్‌కు వివరించారు. పరిశ్రమల ఏర్పాటుకు ఫాస్ట్-ట్రాక్ అనుమతులు, ఆకర్షణీయమైన ప్రోత్సాహకాలు పునరుత్పాదక ఇంధనరంగంలో పెద్దఎత్తున పెట్టుబడులకు మార్గం సుగమం చేయడమేగాక పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని నింపాయి. దీంతో పునరుత్పాదక ఇంధనరంగంలో పెట్టుబడుల ప్రవాహం మొదలైంది. వచ్చే ఐదేళ్లలో 72 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు రాష్ట్రానికి తీసుకురావడం లక్ష్యంగా పెట్టుకున్న మంత్రి నారా లోకేష్ ఇప్పటికే పలు కంపెనీలతో చర్చలు జరిపి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పించారు. దీంతో పునరుత్పాదక ఇంధనరంగంలో పెట్టుబడుల ప్రవాహం మొదలైంది.

రాష్ట్రవ్యాప్తంగా రూ.65వేలకోట్లతో 500 సీబీజీ ప్లాంట్ల ఏర్పాటుకు రిలయన్స్ సంస్థ ముందుకురాగా, కనిగిరిలో తొలిప్లాంట్‌కు మంత్రి లోకేష్ ఇటీవల భూమిపూజ చేశారు. టాటా పవర్ (7వేల మెగావాట్లు, రూ.49వేలకోట్ల పెట్టుబడి), ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టు (రూ.1.86లక్షల కోట్లు), వేదాంత అనుబంధ సంస్థ సెరెంటికా (10వేల మెగావాట్లు, రూ.50వేల కోట్లు), ఎస్ఏఈఎల్ ఇండస్ట్రీస్ (1200 మెగావాట్లు, 6వేలకోట్ల పెట్టుబడులు), బ్రూక్ ఫీల్డ్ (8వేల మెగావాట్లు, రూ.50వేలకోట్ల పెట్టుబడి) తదితర ప్రఖ్యాత సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయి. రాబోయే రోజుల్లో గ్రీన్‌ఎనర్జీ రంగంలో పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ గమ్యస్థానంగా నిలవనుంది.

# దసరాలోగా చేనేత సహకార ఎన్నికలు

- త్వరలో హెల్త్ ఇన్సూరెన్స్ అమలు
- రూ.5 కోట్ల త్రిఫ్ట్ ఫండ్ నిధులూ విడుదల చేస్తాం
- 3 నెలలకోసారి ఆప్కో ద్వారా చేనేత దుస్తుల కొనుగోలు
- ఎంఎస్ఎంఈ పార్కుల్లో చేనేతలకు పెద్దపీట
- వారానికోసారి చేనేత దుస్తుల ధరించడంపై విస్తృత ప్రచారం
- సీఎం చంద్రబాబుతోనే చేనేతలకు స్వర్ణయుగం
- రాష్ట్ర చేనేత మరియు జౌళి మంత్రి సవిత



విజయవాడ (చైతన్య రథం): దసరాలోగా చేనేత సహకార సంఘ ఎన్నికలు నిర్వహిస్తామని బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ చేనేత మరియు జౌళి మంత్రి ఎస్.సవిత తెలిపారు. చేనేతలకు త్వరలో హెల్త్ ఇన్స్యూరెన్స్ అమలు చేయనున్నామన్నారు. చేనేతల సంక్షేమానికి సీఎం చంద్రబాబునాయుడు అధిక ప్రాధాన్యమిస్తున్నారని, చేనేత దుస్తుల అమ్మకాలు పెంచేలా కేంద్ర ప్రభుత్వ సహకారంతో చర్యలు తీసుకుంటున్నామన్నారు. విజయవాడలో ఓ ప్రైవేటు కన్వెన్షన్ సెంటర్‌లో రాష్ట్రంలో నలుమూలల నుంచి వచ్చిన నేతన్నలతో ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డితో కలిసి మంత్రి సవిత బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె చేనేతరంగ అభివృద్ధికి సూచనలు, ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి సవిత మాట్లాడుతూ, చేనేతల అభివృద్ధికి అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచి సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ రేయింబవళ్లు కృషి చేస్తున్నారన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా మగ్గాలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల విద్యుత్ ఉచితంగా అందజేస్తున్నామన్నారు. నూతన డిజైన్ల తయారీలో శిక్షణ ఇస్తున్నామన్నారు. తయారైన ఉత్పత్తులకు మార్కెట్ సౌకర్యం కల్పించేలా ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మినీ కస్టర్లు, మెగా క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నామని, నూతన టెక్స్‌టైల్స్ పాలసీ తీసుకొచ్చామని తెలిపారు. 50 ఏళ్లు నిండిన నేతన్నలకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకంలో 92,724 మందికి రూ.4 వేల పెన్షన్ ఇస్తున్నామన్నారు.

### దసరాలోగా సహకార సంఘ ఎన్నికలు

చేనేత సహకార సంఘాల బలోపేతానికి సీఎం చంద్రబాబునాయుడు అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారని మంత్రి సవిత వెల్లడించారు. దీనిలో భాగంగా సహకార సంఘ ఎన్నికలు నిర్వహించడానికి కూటమి ప్రభుత్వం సమాయత్తమవుతోందన్నారు. దసరాలోగా చేనేత సహకార సంఘ ఎన్నికలు నిర్వహించనున్నామన్నారు. నూతన చేనేత సహకార సంఘాల ఏర్పాటుతోపాటు నిద్రావస్థలో ఉన్న సంఘాలను క్రియాశీలకంగా పనిచేసేటట్లు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

### 3 నెలలకోసారి ఆప్కో ద్వారా కొనుగోలు

నేతన్నలకు ఆర్థిక భరోసా కలిగించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మంత్రి సవిత తెలిపారు. ప్రస్తుతం నేతన్నల నుంచి ఆప్కో ద్వారా ఆరు నెలలకోసారి దుస్తులు కొనుగోలు చేస్తున్నామన్నారు. ఇకపై మూడు నెలలకోసారి దుస్తులు కొనుగోలు చేయనున్నట్లు వెల్లడించారు. నేతన్నలకు బకాయిలను కూడా విడతలవారీగా చెల్లించనున్నామన్నారు. త్రిఫ్ట్ పథకం కింద కేటాయించిన రూ.5 కోట్లను కూడా త్వరలోనే విడుదల చేయనున్నట్లు తెలిపారు.

### ఎంఎస్ఎంఈ పార్కుల్లో చేనేతలకు పెద్దపీట

ఉపాధి కల్పనలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి సవిత తెలిపారు. ఈ పార్కుల్లో యూనిట్ల స్థాపనకు నేతన్నలకే పెద్దపీట వేస్తున్నామన్నారు. వర్క్ షెడ్ల ఏర్పాటుకు చేయూతనందిస్తున్నామన్నారు. ఇళ్ల నిర్మాణాల్లో చేనేతలకు అదనంగా రూ.50 వేలు అందజేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. హైదరాబాద్‌లో ఉన్న ఎన్.హెచ్.డి.ఎస్. రీజనల్ కార్యాలయం విజయవాడలో ఏర్పాటు చేసేలా సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లనున్నామన్నారు. 90 శాతం సబ్సిడీతో ఆధునిక పనిముట్లు అందజేస్తామని, సీఎం చంద్రబాబుతోనే చేనేతలకు స్వర్ణయుగమని మంత్రి సవిత తెలిపారు.

### వారానికోసారి చేనేత దుస్తుల ధరించడంపై ప్రచారం

చేనేత అమ్మకాలు పెరిగేలా కూటమి ప్రభుత్వం రాష్ట్రంతోపాటు జాతీయస్థాయిలోనూ ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేస్తోందని మంత్రి సవిత వెల్లడించారు. చేనేత దుస్తులకు మరింత ప్రాచుర్యం కల్పించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు త్వరలో ఓ నిర్ణయం తీసుకోనున్నాయన్నారు. రాష్ట్రంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు వారంలో ఒకరోజు చేనేత దుస్తులు తప్పనిసరిగా ధరించేలా రెండు ప్రభుత్వాలు త్వరలో పిలుపునివ్వనున్నట్లు మంత్రి వెల్లడించారు. కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లో చేనేత రంగానికి నిధులు కేటాయింపు పెంచేలా సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లనున్నామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో, దేశంలో డబుల్ ఇంజన్ సర్కార్ నడుస్తోందన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏపీ చేనేత రంగానికి అధిక ప్రాధాన్యమిచ్చారన్నారు. మంగళగిరిలో ఏర్పాటు చేసిన వీవర్స్‌శాల మాదిరిగా అన్ని జిల్లాల్లోనూ వీవర్స్‌శాలలు ఏర్పాటు చేసి కార్మికులకు చేతినిండా పని కల్పిస్తామన్నారు.

రాష్ట్రంలో 2.5 లక్షల చేనేత కుటుంబాలు ఉన్నాయని వారి సంక్షేమం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి అన్నారు. చేనేతలకు బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ-కామర్స్ మాద్యమంలో అమ్మకాలు జరపడం వలన ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. నూతన డిజైన్ల కోసం స్థానిక చేనేత కార్మికుల సలహాలు, సూచనలు తీసుకోవాలని కోరారు. సంచార వాహనాల ద్వారా మార్కెటింగ్ సౌకర్యాలు పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. చేనేత మరియు జౌళీ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియా మాట్లాడుతూ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సహకారంతో నిరంతరం పని కల్పించి మార్కెటింగ్ సౌకర్యాలను మెరుగుపరుస్తున్నామన్నారు. చేనేత సహకార సంఘాలు రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కీలకంగా నిలుస్తున్నాయన్నారు. అనంతరం చేనేత మరియు జౌళీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాల ఎగ్జిబిషన్‌ను మంత్రి సవిత, ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, అధికారులు సందర్శించారు. ధరలు, నాణ్యతపై వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో చేనేత మరియు జౌళీ శాఖ కమిషనర్ రేఖారాణి, సెర్ప్ సీఈవో కరుణ, ఆప్కో వీసీ అండ్ ఎండీ ఎం.విశ్వ, పద్మశాలి కార్పొరేషన్ ఛైర్మన్ అబద్దయ్య, గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.



# ఏపీ 'మెట్రో'పై మరో ముందడుగు

- రుణాలిచ్చేందుకు ముందుకొస్తున్న విదేశీ బ్యాంకులు
- ఏఐఐబీ ప్రతినిధులతో కార్పొరేషన్ ఎండీ సమావేశం
- ప్రతిపాదిక విజయవాడ కారిడార్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలన
- విజయవాడ, విశాఖ ప్రాజెక్టులకు రూ.12వేల కోట్లు అవసరమని అంచనా



అమరావతి (చైతన్య రథం): ఏపీలో మెట్రో రైలు ప్రాజెక్టులపై కీలక ముందడుగు పడింది. పలు విదేశీ బ్యాంకుల ప్రతినిధులతో మెట్రోరైలు కార్పొరేషన్ ఎండీ రామకృష్ణారెడ్డి భేటీ అయ్యారు. తక్కువ వడ్డీకి రుణం ఇచ్చే బ్యాంకులతో ఎండీ సంప్రదింపులు చేశారు. సమావేశానికి కేఎఫ్ డబ్ల్యూ,ఏఎఫ్, ఏడీబీ, ఎన్డీబీ, ఏఐఐబీ, జైకా, ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు హాజరయ్యారు. వీరంతా విజయవాడలో ప్రతిపాదిత మెట్రో కారిడార్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో విశాఖ మెట్రోకు రూ.6,100కోట్లు, విజయవాడ మెట్రోకు రూ.5,900 కోట్లు రుణం సమీకరించాలని నిర్ణయించారు. త్వరలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో విదేశీ బ్యాంకుల ప్రతినిధులు చర్చలు జరపనున్నట్లు సమాచారం.

విజయవాడ, విశాఖ మెట్రో రైల్ ప్రాజెక్ట్‌లపై ఏపీ మెట్రోరైల్ కార్పొరేషన్ వేగంగా అడుగులేస్తోంది. రెండు మెట్రో ప్రాజెక్ట్‌లకు సంబంధించి ఇప్పటికే జనరల్ కన్సల్టెంట్‌ల నియామకానికి టెండర్ నోటిఫికేషన్ జారీ చేయగా... తాజాగా రుణ సమీకరణపై దృష్టి సారించింది. రెండు మెట్రో ప్రాజెక్ట్‌ల నిర్మాణానికి అయ్యే వ్యయంలో 12000కోట్లు రుణం అవసరం అవుతుందని అంచనా వేశారు. ఈ నిధుల కోసం తక్కువ వడ్డీకి రుణాలు మంజూరుచేసే బ్యాంకులతో ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ ఎండీ రామకృష్ణా రెడ్డి సంప్రదింపులు జరుపుతున్నారు. విజయవాడ, విశాఖ మెట్రో రైల్ ప్రాజెక్ట్‌లకు రుణాలు ఇచ్చేందుకు విదేశీ బ్యాంకులు ఆసక్తి చూపుతున్నాయి. పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ నుంచి గన్నవరం వరకూ ఉన్న 26 కిమీ కారిడార్‌ను, అలాగే బస్టాండ్‌నుంచి పెనమలూరు వరకూ ఉన్న 12 కిమీల కారిడార్‌ను పరిశీలించారు. త్వరలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలతో బ్యాంకు ప్రతినిధులు సమావేశమవుతారని ఎండీ రామకృష్ణారెడ్డి తెలిపారు.

# మంగినపూడిలో మసులా ఫెస్ట్

- జూన్ తొలివారంలో నిర్వహణకు భారీ ఏర్పాట్లు
- సీఎం, కేంద్ర పర్యాటక మంత్రులకు ఆహ్వానం
- అట్టహాసంగా నిర్వహిస్తున్నామన్న మంత్రి కొల్లు
- స్వదేశీ దర్శన్ పథకానికి ప్రతిపాదనలు పంపామని వెల్లడి
- భారీగా పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యం
- స్వయంగా ఏర్పాట్లను పర్యవేక్షించిన మంత్రి



మచిలీపట్నం (చైతన్య రథం): వచ్చే జూన్ మాసం మొదటివారంలో 4 రోజులపాటు మసులా ఫెస్ట్ పేరిట మంగినపూడి బీచ్ ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు వేగంగా పూర్తిచేయాలని రాష్ట్ర గనులు భూగర్భ వనరుల మంత్రి కొల్లు రవీంద్ర అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం మంగినపూడి బీచ్‌ను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. తొలుత ప్రవేశ మార్గంలో ఫిలిం ఆర్ట్ డైరెక్టర్ రమణ వంక ఏర్పాటు చేస్తున్న స్వాగత తోరణాలను మంత్రివర్యులు పరిశీలించారు. మంత్రి స్వయంగా తోరణాల వెల్డింగ్ పనులను చేసి అందరినీ ఆశ్చర్యపరిచారు. ధర్మాకోల్‌తో తయారు చేస్తున్న గౌతమ బుద్ధుడు, ఆక్టోపస్, డాల్ఫిన్, ఎండ్రకాయ, నక్షత్ర చేప, వివిధ రకాల చేపలు, తాబేలు, శంఖము తదితర సముద్ర జీవులు, పాండురంగ స్వామి ఆకారాలతో ఏర్పాటు చేస్తోన్న బొమ్మలను పరిశీలించారు. బీచ్‌లో ప్రధాన రహదారి వెడల్పుచేసి మధ్యలో ఒక కూడలి ఏర్పాటు చేసి.. అక్కడి నుండి హెలిపాడ్ వరకు రహదారి నిర్మించాలని సూచించారు. అనంతరం మంత్రి కొల్లు మీడియాతో మాట్లాడుతూ జూన్ మొదటి వారంలో మసులా ఫెస్ట్ పేరిట మంగినపూడి బీచ్ ఉత్సవాల నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు. బీచ్ ఉత్సవాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు ఫిలిం ఆర్ట్ డైరెక్టర్ రమణ వంకను పిలిపించామని, ఆయన ఆధ్వర్యంలో అమరావతికి ముఖ ద్వారంగా ఉండేలా ప్రవేశమార్గంలో స్వాగత తోరణాలు, అసెంబ్లీ టవర్ తలపించేలా రూపాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే విధంగా అత్యద్భుతమైన పర్యాటక ప్రాంతంగా మచిలీపట్నం బీచ్‌ను తీర్చిదిద్దుతామన్నారు. మన రాష్ట్రంతోపాటు చుట్టుపక్కల పరిసరాల సంస్కృతి సాంప్రదాయాలు ప్రతిబింబించేలా కలంకారి, బందరు లడ్డు, హల్వా, బంగారు నగలు, డాల్ఫిన్, వివిధ రకాల చేపల ఆకృతులతో ధర్మాకోల్ బొమ్మలు రూపొందిస్తున్నామన్నారు. ఉత్సవాల్లో భాగంగా జాతీయ క్రీడలైన బీచ్ కబడ్డీ, కయా కింగ్ జలక్రీడలు కూడా నిర్వహిస్తామన్నారు. ఈ క్రీడల్లో 2,000 మందికి పైగా క్రీడాకారులు పాల్గొంటారన్నారు. ఇవికాక ప్రత్యేక ఆకర్షణగా నిలిచే పారా గ్లైడింగ్, హెలికాప్టర్ రైడింగ్, నీటిలో నడిపే స్కూటర్లు, నీటిలో గ్లైడింగ్, స్కోవ డైవింగ్, మోటార్ స్పీడ్ బోట్లు తదితర సాహస క్రీడలు ఉంటాయన్నారు. అంతేకాకుండా ఉల్లాసం కోసం జెయింట్ వీల్స్, రకరకాల పూల ప్రదర్శన, మ్యూజికల్ ఫౌంటెన్ కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. వివిధ రకాల రుచికరమైన వంటకాలశాలలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉత్సవాలకు వచ్చే పర్యాటకులకు వినోదం కోసం అనేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని, ముఖ్యంగా ప్రముఖ సినీ కళాకారులు, సంగీత దర్శకులతో సంగీత విభావరి నిర్వహిస్తామన్నారు. ఉత్సవాలకు సీఎం చంద్రబాబు, కేంద్ర పర్యాటక మంత్రిని ఆహ్వానిస్తున్నట్టు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ స్వదేశీ దర్శన్ పథకం కింద 100నుంచి 150కోట్ల రూపాయలు రానున్నాయని, ఇందు కోసం ప్రతిపాదనలు పంపామన్నారు. కేంద్ర పథకం ప్రభావంతో పలు రకాల రిసార్టులు, హోటళ్లు నెలకొల్పేందుకు రూ.800నుంచి 1000 కోట్ల వరకు పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందన్నారు. విజయవాడతోపాటు రాష్ట్ర రాజధాని అమరావతికి ముఖద్వారంగా ఉండటమే కాకుండా హైదరాబాదుకు అత్యంత సమీపంలో మంగినపూడి బీచ్ ఉందని, ఈ బీచ్ అభివృద్ధికి మెండుగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు మంత్రి కొల్లు వివరించారు. పర్యటనలో మంత్రి వెంట మచిలీపట్నం ఆర్డీఓ కె స్వాతి, మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచె నాని, గోపు సత్యనారాయణ, గొర్రెపాటి గోపీచంద్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గర్భిణి మృతిపై విచారణకు మంత్రి సత్యకుమార్ ఆదేశం




అమరావతి (చైతన్య రథం): పోలవరం ప్రభుత్వాసుపత్రిలో గర్భిణి తామ శిరీష (25) మృతిపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ సెకండరీ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ ఎ సిరిని ఆదేశించారు. దీంతో అధికార యంత్రాంగం అప్రమత్తమయ్యింది. జరిగిన సంఘటనపై ఆరా తీసిన సెకండరీ హెల్త్ డైరెక్టర్ ఏలూరు డిసిహెచ్‌యస్‌తో మాట్లాడారు. పోలవరం సామాజిక ఆరోగ్య కేంద్రం (సిహెచ్‌సి)లో బుధవారం తెల్లవారు జామున గర్భిణి మృతి విషయంలో డ్యూటీలో ఉన్న డాక్టర్, ప్రసూతి వైద్య నిపుణులు సకాలంలో స్పందించి వైద్యం అందించనట్టు ప్రాథమిక విచారణలో తేలిందని ఏలూరు జిల్లా ఆసుపత్రుల సేవల సమన్వయాధికారి (డిసిహెచ్‌యస్) ఉన్నతాధికారులకు తెలిపారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణకు ఆదేశించామని, వైద్యం అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని తేలితే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రాథమిక నివేదికను ఏలూరు జిల్లా కలెక్టర్, సెకండరీ హెల్త్ డైరెక్టర్‌కు పంపామని ఈ మేరకు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## 2019-2022లో బడ్జెట్ ఎస్టిమేట్స్‌ను సమీక్షించిన అసెంబ్లీ ఎస్టిమేట్స్ కమిటీ



అమరావతి (చైతన్య రథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన వ్యవస్థ అంచనాల కమిటీ అధ్యక్షులు, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అధ్యక్షతన ఎస్టిమేట్స్ కమిటీ బుధవారం రాష్ట్ర అసెంబ్లీ భవనంలోని కమిటీ హాల్లో సమావేశమైంది. 2019 నుండి 2022 వరకూ మూడేళ్ల కాలంలో పంచాయితీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించిన బడ్జెట్ అంచనాలపై ఆయా శాఖల అధికారులతో సమీక్షించింది. సమావేశంలో రాష్ట్ర శాసన వ్యవస్థ అంచనాల కమిటీ సభ్యులు అఖిలప్రియ, డా.పార్ధసారధి, మద్దిపాటి వెంకటరాజు, నిమ్మక జయకృష్ణ, కందుల నారాయణ రెడ్డి, పాసిం సునీల్ కుమార్, అసెంబ్లీ ఉప కార్యదర్శి రాజ్‌కుమార్, పంచాయతీ రాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు పాల్గొన్నారు.

# బుడమేరు గట్టుకు రిటైనింగ్

- వర్షాకాలం మొదలయ్యేలోగా పనులు పూర్తి చేయాలి
- బుడమేరునుంచి బెజవాడకు శాశ్వత ముంపు రక్షణ ప్రణాళిక
- జల వనరుల మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడి
- గతంలో గండ్లుపడిన 3 ప్రాంతాలను పరిశీలించిన మంత్రి



ఇబ్రహీంపట్నం (చైతన్య రథం): గత వర్షాకాలంలో ఆకస్మికంగా వచ్చిన వరదతో బుడమేరుకు 3 గండ్లుపడి విజయవాడను ముంచెత్తింది. భారీ వర్షాల్లో సైతం మంత్రి నిమ్మల బుడమేరు గట్టుపైనే ఉండి 3 గండ్లను పూడ్చి విజయవాడకు వరదముంపు నివారించారు. అయితే, బుడమేరు నుండి విజయవాడకు శాశ్వత ముంపు రక్షణ కల్పించేందుకు.. గతంలో పడిన 3 గండ్లను కలుపుతూ రిటైనింగ్ వాల్ నిర్మిస్తున్నట్టు జనవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. దీనికోసం త్వరలోనే కాంక్రీట్ నిర్మాణ పనులు మొదలుపెట్టబోతున్నట్టు ప్రకటించారు. బుధవారం మైలవరం ఎమ్మెల్యే వసంతకృష్ణప్రసాద్, ఈఎన్సీ ఎం వెంకటేశ్వరరావు, ప్రాజెక్టు ఇంజనీర్లతో కలసి పనులు జరుగుతున్న ప్రాంతాన్ని పరిశీలించారు. వెంటనే నిర్మాణ పనులు మొదలుపెట్టి, వర్షాకాలం సీజన్ మొదలయ్యేలోగా జూన్ 10లోగా రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు కొలిక్కి తీసుకురావాలని, దీని కోసం అదనంగా యంత్ర సామాగ్రిని సమకూర్చుకోవాలని అధికారులను, ఏజెన్సీలను మంత్రి ఆదేశించారు. అదేవిధంగా విజయవాడకు వరద ముంపునుండి శాశ్వత రక్షణ కల్పించేందుకు బుడమేరు డైవర్షన్ కెనాల్‌ను 37,500 క్యూసెక్కులకు పెంచేలా, పెండింగ్ పనులు పూర్తి చేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేశామని మంత్రి వివరించారు.

బుడమేరు వరద, ఎనికేపాడు మీదుగా కొల్లేరు, ఉప్పుటేరు నుండి సముద్రంలో కలిసేలా, డీపీఆర్ తయారీ దశలో ఉందని, బుడమేరు ఓల్డ్ ఛానెల్‌కు సమాంతరంగా మరొక కొత్త ఛానెల్‌ను కూడా 20 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. బుడమేరు వరదల నియంత్రణకు డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కింద, కేంద్రం సహకారంతో ముందుకు వెళ్ళేలా ప్రతిపాదనలు తయారు చేసామని, మున్సిపల్, రెవెన్యూ, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ శాఖలను సమన్వయం చేసుకుని.. ఈ ప్రతిపాదనలను సీఎం చంద్రబాబుకు నివేదిస్తామన్నారు.

# ఆర్టీజీఎస్ అదరహో..!

*మలావి దేశ ప్రతినిధి బృందం ప్రశంస*




అమరావతి (చైతన్య రథం): రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ కేంద్ర కమాండ్ కంట్రోల్ రూమును ఆగ్నేయ ఆఫ్రికాలోని మలావి దేశ ప్రతినిధుల బృందం బుధవారం సందర్శించింది. మలావి నేషనల్ వాటర్ రిసోర్స్ అథారిటీకి చెందిన ప్రతినిధులు రాష్ట్రంలోని జలవనరుల పరిక్షణలో ఏపీ అవలంభిస్తున్న మంచి విధానాలను అధ్యయనం చేయడానికి వచ్చింది. ఈ సందర్భంగా బృందం ఆర్టీజీఎస్‌ను కూడా సందర్శించారు. వీరికి ఆర్టీజీఎస్ సీఈఓ ప్రఖర్ జైన్ స్వాగతం పలికి ఆర్టీజీఎస్ పనితీరును వివరించారు. ప్రభుత్వ కార్యక్రమాలను, ప్రభుత్వ పథకాలను ప్రజలకు ఎలాంటి అడ్డంకులు లేకుండా తీసుకెళ్లడంలో తమ సంస్థ అందిస్తున్న సాంకేతిక సదుపాయాల గురించి వివరించారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య ఆర్టీజీఎస్ ఒక వారధిలా పని చేస్తోందని తెలిపారు. పరిష్కారవేదిక ద్వారా ప్రజలనుంచి అందే అర్జీలను పరిష్కరిస్తున్న తీరు గురించి వివరించారు. మలావి నేషనల్ వాటర్ రిసోర్స్ అథారిటీ సీఈఓ డ్వైట్ కంబుకు మాట్లాడుతూ ఆర్టీజీఎస్ పనితీరు ఆదర్శప్రాయంగా ఉందని కొనియాడారు. ప్రజలకు మెరుగైన సేవలందించడానికి సాంకేతిక సొబగులతో ఏర్పాటు చేసుకున్న ఇలాంటి వ్యవస్థ అందరికీ ఆదర్శప్రాయమన్నారు. కారక్రమంలో ఆర్టీజీఎస్ డిప్యూటీ సీఈఓ ఎం మాధురి తదితరులు పాల్గొన్నారు.

# వన్ ఎర్త్.. వన్ హెల్త్

- విశాఖలో జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం
- హాజరుకానున్న ప్రధాని నరేంద్రమోదీ
- ప్రధాని పర్యటన ఏర్పాట్లపై సీఎస్ ప్రాథమిక సమీక్ష
- ఇప్పటినుంచే సమాయత్తం కావాలని అధికారులకు సూచన
- నోడల్ అధికారిగా ఎంటి కృష్ణబాబుకు బాధ్యతలు

విజయవాడ (చైతన్య రథం): విశాఖపట్నంలో జూన్ 21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ముఖ్య అతిధిగా ప్రధాని నరేంద్ర మోదీ హాజరవుతున్నారు. ప్రధాని పర్యటన నేపధ్యంలో.. బుధవారం విజయవాడలోని సీఎస్ క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ సంబంధిత శాఖల అధికారులతో ప్రాథమిక సమీక్ష నిర్వహించారు. కొద్దిరోజుల క్రితం అమరావతి పర్యటనకు వచ్చిన ప్రధాని.. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను విశాఖలో నిర్వహించాలని, వేడుకలకు తాను హాజరవుతానని సభా వేదిక నుంచి ప్రకటించడం తెలిసిందే. అందుకు అనుగుణంగా జూన్ 21న విశాఖలో యోగా ఫర్ వన్ ఎర్త్ వన్ హెల్త్ నినాదంతో యోగా వేడుకలను నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తగిన ఏర్పాట్లకు సన్నద్ధమవుతోంది. యోగా ప్రాముఖ్యతపై అవగాహన పెంచేందుకు మొరార్జీ దేశాయ్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ యోగా గత మార్చి 13నుండి జూన్ 21వరకు 100 రోజుల్లో 100 నగరాల్లో 100 ఆర్గనైజేషన్ల పేరిట గ్లోబల్ ప్రచార కార్యక్రమాన్ని చేపట్టింది. దానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం "యోగాంధ్ర-2025" నినాదంతో ప్రజల్లో యోగాపట్ల అవగాహన కల్పించేందుకు పెద్దఎత్తున చర్యలు తీసుకుంటోంది. కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ సహకారంతో ఆర్ట్ ఆఫ్ లివింగ్, ఈశా ఫౌండేషన్, యోగా స్పోర్ట్స్ అసోసియేషన్, వివిధ విశ్వవిద్యాలయాలు తదితర సంస్థల భాగస్వామ్యంతో సుమారు 2 లక్షల మందితో రాష్ట్ర ప్రభుత్వం 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విశాఖలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది.



ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఈనెల 29నుండి 4 వారాల నాలుగంచెల ప్రచార కార్యక్రమ కార్యాచరణ ప్రణాళిక అమలు చేయనుంది. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ మాట్లాడుతూ విశాఖలో నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాల్సి ఉందన్నారు. ఏర్పాట్ల పర్యవేక్షణకు రాష్ట్రస్థాయిలో వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి యం.టి.కృష్ణబాబును ప్రభుత్వం నోడలు అధికారిగా నియమించిందని తెలిపారు. ఇప్పటి నుంచే ఏర్పాట్లు ప్రారుభించాలని అధికారులను ఆదేశించారు. విశాఖపట్నం నగరంలోని వివిధ విద్యా సంస్థలకు చెందిన 8వ తరగతి మొదలు డిగ్రీ, పీజీ చదివే విద్యార్థులు అందరినీ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని సూచించారు. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా ఆయుష్ మిషన్ ప్రతినిధులు, యోగా శిక్షకులు, యోగా స్పోర్ట్స్ అసోసియేషన్లు, యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్లు, పిఇటిలు, స్పోర్ట్స్ కోచ్‌లు, విశాఖలోని పలు కేంద్ర ప్రభుత్వ సంస్థలను పెద్దఎత్తున భాగస్వాములను చేయాలని సీఎస్ సూచించారు. సమావేశానికి ఢిల్లీ నుండి వర్చువల్‌గా పాల్గొన్న కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి రాజేష్ మాట్లాడుతూ కొద్దిరోజుల్లో ఈవెంట్ మేనేజ్మెంట్‌ను ఖరారు చేస్తామని, రెండు లక్షల టి షర్టులు, యోగా మ్యాట్లను రాష్ట్రానికి పంపనున్నట్లు చెప్పారు. ఈ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, నోడలు అధికారి యం.టి.కృష్ణబాబు అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలకు సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేస్తూ ఈ వేడుకల్లో సుమారు రెండు లక్షల మంది పాల్గొనేలా ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ త్వరలో ఈవెంట్ మేనేజ్మెంట్‌ను ఖరారు చేయనుందని చెప్పారు. విశాఖలో ఈ ఈవెంట్‌ను ఎక్కడ నిర్వహించాలనేది ఖరారు చేయాల్సి ఉందన్నారు. సమావేశంలో రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్ కుమార్ మీనా, వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ వీరపాండ్యన్, ఆయుష్ డైరెక్టర్ దినేష్‌కుమార్ పాల్గొన్నారు. అలాగే పిఆర్ అండ్ ఆర్డి ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, విద్యా శాఖ కార్యదర్శి కె శశిధర్, సీఆర్డీఏ కమిషనర్ కె.కన్నబాబు, ఐటి శాఖ కార్యదర్శి కె భాస్కర్, యువజన సర్వీసుల శాఖ కార్యదర్శి వినయ్‌చంద్, విశాఖపట్నం జిల్లా కలెక్టర్ హరీంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# కంప్లైంట్ చేస్తే కక్షగట్టారు

**సీఐ, సర్పంచ్‌పై సామాన్యుడి ఫిర్యాదు - సమస్యల పరిష్కారం కోరుతూ బాధితుల అర్జీలు**

**పరిశీలించి పరిష్కరిస్తామన్న మంత్రి ఫరూక్**





మంగళగిరి (చైతన్య రథం): టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమానికి పెద్దఎత్తున అర్జీదారులు హాజరయ్యారు. అర్జీలు స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మైనార్టీ శాఖ మంత్రి ఫరూక్, సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ మన్నె సుబ్బారెడ్డిలు హామీ ఇచ్చారు. అవనిగడ్డ మండలం తుగలవారిపాలెంకు చెందిన తోట వెంకట శ్రీనివాసరావు అర్జీని సమర్పిస్తూ.. కంప్లైంట్ చేసినందుకు తనపై సీఐ, సర్పంచ్ కక్షగట్టారని వాపోయాడు. తన ఇంటిని ఆక్రమించుకున్నారని కంప్లేట్ చేస్తే.. అందులో సగం రాసివ్వాలని సీఐ, గ్రామ సర్పంచ్, మరింకొందరు బెదిరిస్తున్నారని వాపోయాడు. తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తూ మంత్రి ఫరూక్‌కు అర్జీ సమర్పించాడు. 2016- 2017నకు సంబంధించి విశాఖపట్నం జిల్లాలో పలు మండలాల్లో విద్యార్థుల యూనిఫాం కుట్టుకూలీ బకాయిలు రూ.18,90,208లు తనకు రావాలని.. అది ఇప్పించి ఆదుకోవాలని హుసెన్ బాషా గ్రీవెన్స్‌లో నేతలకు అర్జీ ఇచ్చాడు. పార్వతీపురం జిల్లా వీరఘట్టం మండలం నడిమికెల్ల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ యామాక అప్పల నాయుడు గ్రీవెన్స్‌లో నేతలకు అర్జి ఇస్తూ.. 2017- 2018లో మహాత్మా జాతీయ ఉపాధి హామీ పథకం క్రింద పనులు చేశామని, దానికి సంబంధించిన బిల్లులు మంజూరు చేయాలని కోరాడు. తనకు తన తండ్రి ద్వారా వచ్చిన భూములను సర్వే చేసి హద్దులు చూపాలని ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడెం మండలం నరుకుళ్లపాడు గ్రామానికి చెందిన వేల్పుల జేమ్స్ వెంకయ్య గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేశాడు. సంబంధం లేని వారు భూముల్లోకి వచ్చి తమను బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రకాశం జిల్లా పామూరు మండలం తూర్పు కట్టక్రిందపల్లి గ్రామానికి చెందిన అల్ల వెంకటేశ్వర్లు గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. గ్రామంలో అర్థాంతరంగా ఆగిపోయిన సచివాలయాన్ని పూర్తి చేయాలని.. అలాగే గ్రామంలో ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం కింద నీటి కుళాయిలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కడప నగరంలోని 45వ డివిజన్ భగత్‌సింగ్‌నగర్‌లో గుడి స్థలాన్ని వైసీపీ పార్టీకి చెందిన వ్యక్తి ఆక్రమించుకుని అమ్ముకోవాలని చూస్తున్నారని.. అధికారులు విచారించి చర్యలు తీసుకోవాలని చంద్రగిరి నారాయణ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశాడు. ప్రైమరీ మినిమం టైమ్ స్కేల్ క్రింద పాచిపెంట జూనియర్ కలాశాలలో పనిచేస్తున్న తమకు 15 నెలల నుండి జీతం రాక తీవ్ర ఇబ్బంది పడుతున్నామని.. దయచేసి తమకు జీతాలు ఇప్పించి ఆదుకోవాలని పి ఈశ్వర్‌రావు అనే వ్యక్తి గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేశాడు.



## వీరయ్యచౌదరి హత్య కేసు

# 9 మంది అరెస్ట్

ఒంగోలు (చైతన్య రథం): తెదేపా నేత, మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్య చౌదరి హత్య కేసు మిస్టరీని ఎట్టకేలకు పోలీసులు ఛేదించారు. ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలుకు చెందిన వీరయ్యచౌదరి ఏప్రిల్ 22వ తేదీ సాయంత్రం 7.30 గంటల సమయంలో ఒంగోలులోని ఆయన కార్యాలయంలో దారుణ హత్యకు గురయ్యారు. కత్తులతో ఆయన్ను 53సార్లు విచక్షణారహితంగా పొడిచి హతమార్చారు. ఆపై స్కూటీ, ద్విచక్ర వాహనంపై పరారయ్యారు. అధికార పార్టీ నేత హత్యతో జిల్లా పోలీసులు దర్యాప్తును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. 9మంది నిందితులను అరెస్టుచేసి బుధవారం మీడియా ముందు ప్రవేశపెట్టారు. కేసు వివరాలను జిల్లా ఎస్పీ ఆర్ దామోదర్ వెల్లడించారు. "వీరయ్య చౌదరి హత్యకు ప్రధాన సూత్రధారి ఆళ్ల సాంబయ్య అలియాస్ సిద్ధాంతి. అమ్మనబ్రోలు గ్రామంలో అధిపత్యపోరే హత్యకు ప్రధాన కారణం. రాజకీయ కక్షలతో పాటు ఇసుక వ్యవహారంలోనూ సాంబయ్యతో వీరయ్య చౌదరికి విభేదాలున్నాయి. ఈ నేపథ్యంలో కిరాయి వ్యక్తుల సాయంతో వీరయ్యచౌదరిని హతమార్చారు. బోర్ల గుంట వినోద్ కుమార్, తువ్వర వంశీకృష్ణ, బెల్లంకొండ వెంకట గౌతమ్, మన్నెం తేజ, మార్టూరి కిరణ్ కుమార్, షేక్ సమీర్, ఆళ్ల సాంబయ్య, వీరగంధం దేవేంద్రనాథ్ చౌదరి,తోట శ్రీనివాసరావులను అరెస్టు చేశాం. నిందితుల వద్ద నుంచి 7 సెల్ఫోన్లు, 3 కత్తులు స్వాధీనం చేసుకున్నాం" అని ఎస్పీ వివరించారు.



**అమరావతి రాజధాని ఉద్యమ**

# గేయ రచయిత బొప్పన మృతి

మంగళగిరి (చైతన్య రథం): అమరావతి రాజధాని ఉద్యమ గేయ రచయిత, సాంస్కృతిక చైతన్య వేదిక అధ్యక్షులు, మాజీ పోలీసు ఉన్నతాధికారి బొప్పన విజయకుమార్ బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. విజయకుమార్ మృతిపట్ల అమరావతి రాజధాని ఐక్య కార్యాచరణ సమితి (జేఏసీ) నేతలు ప్రగాఢ సంతాపం తెలిపారు. పలువురు జేఏసీ నేతలు, పోలీసు అధికారులు, వామపక్ష పార్టీల నేతలు, ప్రజా సంఘాల నాయకులు విజయకుమార్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళు లర్పించారు. అమరావతి ఉద్యమం సందర్భంగా ఆయన చేసిన కృషిని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.



## ఉపాధి అవకాశాలు కల్పిస్తాం : నిమ్మక




పాలకొండ (చైతన్యరథం): రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. సీతంపేట మండలం పనుకువలస వద్ద సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎమ్) పార్కుకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎమ్ఈ పార్కును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## పార్వతీపురంలో ఎన్డీఆర్ఎఫ్ మాక్‌డ్రిల్



పార్వతీపురం (చైతన్యరథం): జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద అన్ని శాఖల అధికారుల ఆధ్వర్యంలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. యుద్ధం సంభవిస్తే ప్రజలను ఏ విధంగా సురక్షిత ప్రాంతాలకు తరలించాలి, పశువులను ఎలా రక్షించాలి, బాంబులతో దాడులు జరిగితే ప్రజలు ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టాలి అన్న అంశాలను మాక్‌డ్రిల్ ద్వారా ప్రదర్శించి చూపించారు. మాక్‌డ్రిల్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ పర్యవేక్షించారు. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు వీలుగా ప్రజలకు అవగాహన కల్పించేందుకే ఈ మాక్‌డ్రిల్ నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు.

## అభివృద్ధి పనులకు బేబీనాయన శంకుస్థాపన

విజయనగరం (చైతన్యరథం): బొబ్బిలి నియోజకవర్గం లింగాపురం నుంచి అంట్లవార మధ్య రోడ్డు నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే బేబీనాయన, బుడా ఛైర్మన్ తెంటు లక్ష్మునాయుడుతో కలిసి శంకుస్థాపన చేశారు. నాబార్డు సహకారంతో రూ.2.40 కోట్ల నిధులతో తారు రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్.. గ్రామాలు, పట్టణాల్లో ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన, రోడ్ల నిర్మాణం, తాగు సాగునీటికి ఇబ్బందులు లేకుండా ఉండటానికి ఏర్పాట్లు చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ నర్సుపల్లి వెంకట్ నాయుడు, అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



## ఆలమ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్న కలిశెట్టి



విజయనగరం రూరల్: రాజాం నియోజకవర్గం రేగిడి ఆముదలవలస మండలంలోని పోరాము గ్రామంలో బుధవారం శ్రీ గణపతి సుబ్రహ్మణ్య అయ్యప్పస్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే కొండ్రు మురళీమోహన్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. గణపతి సుబ్రహ్మణ్యస్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబం సంతోషంగా ఉండాలనేది కూటమి ప్రభుత్వ లక్ష్యమని వారు తెలిపారు.

# అన్నదాతకు యంత్ర సాయం...

### రాయితీపై యాంత్రీకరణ పథకాన్ని పునరుద్ధరించిన మంత్రి అచ్చెన్నాయుడు



అన్నదాతలకు కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చి తీపి కబురు తీసుకువచ్చింది. గత ఐదేళ్లలో నిర్లక్ష్యానికి గురైన రైతులను ఆదుకునేందుకు చర్యలు చేపట్టింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు రైతులకు అండగా నిలిచి ఖరీఫ్ ప్రారంభానికి ముందే రాయితీపై యంత్ర పరికరాలు అందించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో (2014 -2019) సాగు యాంత్రికరణలో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపింది. అనంతరం అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం ఈ పథకాన్ని పూర్తిగా రద్దు చేసి రైతుల నోట్ల మట్టికొట్టింది. వైసీపీ పాలనలో యంత్ర సాయం అందక రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చొరవతో ఈ పథకానికి మరోసారి పునరుజ్జీవనం పోశారు. వైసీపీ హయాంలో పరికరాల సరఫరాలో పెద్దఎత్తున అవినీతికి పాల్పడ్డారు. సొంత పార్టీ నాయకులు దోచిపెట్టిన జగన్... యంత్రాల పంపిణీ కార్యక్రమాన్ని దుర్వినియోగం చేశారు. ఇటీవల అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రాయితీపై యాంత్రీకరణ పథకాన్ని పునరుద్ధరించడం అభినందనీయం. ఒక్క శ్రీకాకుళం జిల్లాకు 1,773 యూనిట్లు లక్ష్యం, కాగా రైతులు దరఖాస్తులు చేసుకునే మేరకు 1,377 యూనిట్స్ సరఫరా చేసేందుకు మంత్రి అచ్చెన్నాయుడు అంతా సిద్ధం చేశారు. బ్యాటరీ, పవర్ స్ప్రేయర్లు, ట్రాక్టర్‌తో నడిచే పరికరాలు, పవర్ వీడర్, బ్రష్ కట్టర్లు, రోటో వెటర్లు తదితర పరికరాలు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లాలో ఆహారభద్రత మిషన్ పథకంలో భాగంగా 57 సూక్ష్మయంత్రాలు సరఫరా చేశారు. సాధారణ రైతులకు రూ.80,000లు రాయితీ ఇస్తుండగా... బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రూ.1,00,000 రాయితీ అందజేయడం జరిగింది. కనీసపు ధర రూ.2,60,000 ఉండగా... రాయితీపై అందజేయడం జరిగింది. వీటివలన రైతులు తక్కువ ఖర్చుతో సూర్పు చేసుకోవచ్చు... కూలీలు ఖర్చు కూడా తగ్గుతుంది. జిల్లాలో 31,8113 రైతులు ఉండగా... ఖరీఫ్‌లో 1,56,579 హెక్టార్లు, రబీలో 53,854 హెక్టార్లు సాగు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన యాంత్రీకరణ పథకాన్ని పునరుద్ధరించేందుకు ప్రభుత్వం నిర్ణయించడంతో జిల్లా రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. వ్యవసాయ పరికరాలపై రాయితీ అమలులోకి రానుంది. సాగుకు ఉపయోగించే మూడు కాళ్ల నాగళ్లు, రొప్పు గొర్లు, పౌవ్, ఆఫ్ కేజీవీల్లు (దుమ్ములు), మందు పిచికారి డబ్బాలు తదితర సామగ్రి రైతులకు రాయితీపై అందుబాటులోకి రానున్నాయి. ఇవి చిన్న, సన్నకారు రైతులకు ఎంతో ఉపయోగపడనున్నాయి.

## ఏపీలో పాలిసెట్ ఫలితాలు విడుదల చేసిన మంత్రి లోకేష్

ఏపీలోని పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (పాలిసెట్ -2025) ఫలితాలు విడుదలయ్యాయి. మంత్రి నారా లోకేష్ ఫలితాలను విడుదల చేశారు. ఈ ఏడాది ఏప్రిల్ 30న నిర్వహించిన పాలిసెట్ పరీక్షకు 1,39,840 మంది విద్యార్థులు హాజరవ్వగా.. 1,33,358 మంది పాసైనట్లు తెలిపారు. అంటే 95.36 శాతం మంది పాలిసెట్‌లో ఉత్తీర్ణత సాధించారు. ఈ ఫలితాల్లోనూ బాలికల హవానే కొనసాగిందని మంత్రి పేర్కొన్నారు. 96.9 శాతం మంది బాలికలు పాలిసెట్ ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. అత్యధికంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో 98.66 శాతం మంది పాసవ్వగా.. 19 మంది విద్యార్థులు 120కి 120 మార్కులు సాధించారని నారా లోకేష్‌లో పోస్ట్ చేశారు. మీ పాలిసెట్ రిజల్ట్ తెలుసుకోవాలంటే https://polycetap.nic.in వెబ్‌సైట్‌ని ఓపెన్ చేసి.. ఏపీ పాలిసెట్ రిజల్ట్స్ 2025పై క్లిక్ చేయాలి. నెక్ట్స్ ఓపెన్ అయిన పేజీలో హాల్ టికెట్ నంబర్, డీటెయిల్స్ ను సబ్మిట్ చేయగానే మీ రిజల్ట్ స్క్రీన్పై కనిపిస్తుంది. అక్కడే ర్యాంక్ కార్డ్ కూడా డౌన్ లోడ్ చేసుకోవచ్చు.




## రాబోయే రెండు రోజుల్లో ఏపీలో వర్షాలు ! వెల్లడించిన వాతావరణశాఖ



విశాఖపట్నం (చైతన్యరథం): తెలుగు రాష్ట్రాల్లో భిన్న వాతావరణ పరిస్థితులు కొనసాగుతున్నాయి.. పగలు ఎండలు, సాయంత్రం వేళ అక్కడక్కడ వర్షాలు కురుస్తున్నాయి. ఈ క్రమంలో వాతావరణ శాఖ ఆంధ్రప్రదేశ్‌కు కీలక సూచనలు చేసింది. రాష్ట్రంలో రానున్న రెండు రోజులు భిన్నమైన వాతావరణ పరిస్థితులు కొనసాగనున్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ వెల్లడించారు. కొన్నిచోట్ల పిడుగులతో కూడిన వర్షాలు, మరికొన్ని చోట్ల ఎండలు ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గురువారం (15-05-25) అల్లూరి సీతారామరాజు, పార్వతీపురమన్యం, శ్రీకాకుళం, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, ఏలూరు జిల్లాల్లో పలుచోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు, మిగతా జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. శుక్రవారం (16-05-25) అల్లూరి సీతారామరాజు, కోనసీమ, నంద్యాల, కర్నూలు, అనంతపురం, వైఎస్సార్, శ్రీసత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో పలుచోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉన్నదన్నారు. పిడుగులు, ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున హోర్డింగ్స్, చెట్ల క్రింద, శిథిలావస్థలో ఉన్న గోడలు, భవనాలు వద్ద నిలబడరాదన్నారు.

## ప్రతి మహిళా పోషకాహారం విలువ తెలుసుకోవాలి

మల్కాపురం (చైతన్యరథం): ప్రతి మహిళా పోషకాహారం విలువను తెలుసుకుంటే ఆరోగ్యకరమైన సమాజం సిద్ధిస్తుందని ఐసీడీఎస్ (ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్మెంట్ సర్వీసెస్ స్కీమ్) మల్కాపురం సెక్టరు సూపర్వైజర్ వరలక్ష్మి అన్నారు. జీవీఎంసీ 62వ వార్డు హరిజన్ వీధిలో ఉన్న సామాజిక భవనంలో బుధవారం సృజన వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'పౌష్టికాహారం'పై మహిళలకు అవగాహన కల్పించారు. అనంతరం నిర్వహించిన వంటల పోటీల్లో పాల్గొన్న మహిళలకు సృజన వెల్ఫేర్ సభ్యులు బహుమతుల ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ప్రైమరీ ప్రధానోపాధ్యాయులు హరికృష్ణ, వెల్ఫేర్ సభ్యులు లక్ష్మి, దివ్య పాల్గొన్నారు.



# బుడమేరు గట్టు రక్షణకు రిటైనింగ్ వాల్

●సీజన్ మొదలయ్యే లోగా పనులు పూర్తిచేయాలి

●బుడమేరు వరదకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళికలు

●గతంలో బుడమేరు గట్టుకు 3 గండ్లుపడిన ప్రాంతాలను పరిశీలించిన మంత్రి నిమ్మల



విజయవాడ (చైతన్యరథం): గత వర్షాకాలంలో ఆకస్మికంగా వచ్చిన వరదకు బుడమేరుకు 3గండ్లు పడి విజయవాడ ను ముంచెత్తడంతో అప్పటికప్పుడు అత్యవసరంగా యుద్ధప్రాతిపదికన భారీ వర్షాల్లో సైతం బుడమేరు గట్టుమీదనే ఉండి 3గండ్లను పూడ్చి విజయవాడకు వరదముంపును నివారించడం జరిగింది. ఐతే బుడమేరు వరద నుండి విజయవాడ నగరానికి శాశ్వత ప్రాతిపదికన ముంపును నివారించేందుకు, గతంలో పడిన ఈ 3గండ్లను కలుపుతూ రిటైనింగ్ వాల్ నిర్మిస్తున్నాం అని, దీని కోసం త్వరలోనే కాంక్రీట్ నిర్మాణ పనులు మొదలుపెట్టబోతున్నాం అని తెలిపారు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు. బుధవారం మైలవరం ఎమ్మెల్యే వసంతకృష్ణప్రసాద్, ఈఎన్సీ ఎం.వెంకటేశ్వరరావు,మరియు ప్రాజెక్టు ఇంజనీర్లతో కలసి పనులు జరుగుతున్న ప్రాంతాన్ని పరిశీలించారు. వెంటనే నిర్మాణ పనులు మొదలుపెట్టి, వర్షాకాలం సీజన్ మొదలయ్యేలోగా, జూన్ 10వ తేదీలోగా రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు ఒకొలిక్కి తీసుకురావాలని, దీని కోసం అదనంగా యంత్ర సామాగ్రిని సమకూర్చుకోవాలని అధికారులను, ఏజెన్సీలను ఆదేశించారాయన. అదేవిధంగా విజయవాడను వరద ముంపునుండి శాశ్వతంగా రక్షించేందుకు బుడమేరు డైవర్షన్ కెనాల్ ను 37,500 క్యూసెక్కులకు పెంచేలా, పెండింగ్ పనులు పూర్తి చేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేశామని తెలిపారు. బుడమేరు వరద, ఎనికేపాడు మీదుగా కొల్లేరు, ఉప్పుటేరు నుండి సముద్రంలో కలిసేలా, డీపీఆర్ తయారీ దశలో ఉందని, బుడమేరు ఓల్డ్ ఛానెల్ కు సమాంతరంగా, మరొక కొత్త ఛానెల్ ను కూడా 20 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నాం అని తెలిపారు. బుడమేరు వరదల నియంత్రణకు డిజాస్టర్ మానేజ్మెంట్ కింద, కేంద్రం సహకారంతో ముందుకు వెళ్ళేలా ప్రపోజల్స్ తయారు చేసాం అని, మున్సిపల్, రెవెన్యూ, డిజాస్టర్ మానేజ్మెంట్ శాఖలు సమన్వయం చేసి ప్రతిపాదన ముఖ్యమంత్రి ముందు ఉంచుతామన్నారు.

# ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించే ధాన్యం కొనుగోళ్లు



నిడదవోలు (చైతన్యరథం): రైతుల నుంచి నేరుగా మిల్లర్లు కొనుగోలు చేసే ధాన్యం.. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించి ఉండాలని కొవ్వూరు రెవెన్యూ డివిజనల్ (ఆర్డీవో) అధికారిణి రాణి సుస్మిత పేర్కొన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిడదవోలు పరిధిలో ఉన్న మిల్లర్ల ప్రతినిధులతో ధాన్యం కొనుగోలుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రస్తుతం రబీ సీజన్లో జిల్లాలో 3.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని ప్రభుత్వం నిర్దేశించినట్లు చెప్పారు. అందుకు అనుగుణంగా ఆయా మండలాల పరిధిలో ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నట్లు తెలిపారు. ప్రతి సీజన్లో రైతుల నుంచి మిల్లర్లు నేరుగా ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. లావాదేవీలు నిర్వహించే సమయంలో విధిగా 'బి' రిజిస్టర్లో సంబంధిత వివరాలు నమోదు చేయాలన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చిన ధాన్యం వివరాలు 'ఏ' రిజిస్టర్లో నమోదు చేయాలని సూచించారు. కొనుగోళ్ల విషయంలో రైతులను ఎలాంటి ఇబ్బందులకు గురి చేయవద్దని అధికారులను కోరారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఇన్ఛార్జ్ జిల్లా పౌర సరఫరాల అధికారి ఎన్ఆర్ఆర్ ప్రేమ్ కుమార్, తహసీల్దార్ బి. నాగరాజు నాయక్, నిడదవోలు మండల మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షులు ఎస్. రమేష్ పాల్గొన్నారు.

# వినియోగదారుల హక్కుల పరిరక్షణకు నిరంతరం కృషి



ముమ్మిడివరం (చైతన్యరథం): వినియోగదారుల హక్కుల పరిరక్షణకు పౌరసరఫరాల శాఖ నిరంతరం కృషి చేస్తోందని జిల్లా పౌరసరఫరాల అధికారి అడపా ఉదయభాస్కర్ అన్నారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం అమలుపై జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశానికి డీఎస్ఓ అధ్యక్షత వహించారు. వస్తువుల సేవలు, పరిమాణం, నాణ్యత, స్వచ్ఛత, ప్రమాణం, ధరలపై ఖచ్చితమైన సమాచారం తెలుసుకునే హక్కు వినియోగదారుడికి ఉంటుందన్నారు. విజిలెన్స్ కమిటీ, జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు ఉదయభాస్కర్ వివరించారు. పౌరసరఫరాల శాఖకు తోడు కోకో ఫెడ్ ఆధ్వర్యంలోని వినియోగదారుల సంఘాలు విశేష కృషి చేస్తున్నాయన్నారు. తూనికలు, కొలతలు, ఆహార భద్రత శాఖల సమన్వయంతో మరిన్ని మెరుగైన సేవలు అందిస్తామన్నారు. కోకో ఫెడ్ జిల్లా అధ్యక్షుడు బలరామమూర్తి మాట్లాడుతూ వినియోగదారుల రక్షణకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆదిత్య కిరణ్, అద్దంకి అమరేశ్వరరావు పాల్గొన్నారు.

# భీమడోలు చెరువులో మునిగి ముగ్గురు వ్యక్తులు మృతి

భీమడోలు (చైతన్యరథం): ఏలూరు జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది. భీమడోలుకు సమీపంలో ఉన్న చెరువులో ముగ్గురు వ్యక్తులు ప్రమాదవశాత్తు పడి మరణించారు. మరో ఇద్దరు వ్యక్తులు గల్లంతయ్యారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా ప్రాంతానికి చేరుకుని, మృతదేహాల్ని పోస్టుమార్టంకు పంపి, కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. గల్లంతైన ఇద్దరు వ్యక్తుల ఆచూకీ కోసం గజ ఈతగాళ్ల సహాయంతో గాలిస్తున్నారు. కాగా.. ఈ ఘటనపై పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.



# డీఎస్సీలో ప్రతి ఒక్కరూ

## విజేతలుగా నిలిచినప్పుడే నిజమైన సంతృప్తి

●చంద్రబాబు డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వడం చారిత్రాత్మక నిర్ణయం

●పాలకొల్లులో ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఉచిత డీఎస్సీ శిక్షణ ముగింపు సభలో మంత్రి రామానాయుడు.



పాలకొల్లు (చైతన్యరథం): ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో 110 రోజులపాటు నిర్వహించిన ఉచిత డీఎస్సీ కోచింగ్ సెంటర్లో ప్రతి విద్యార్థినీ, విద్యార్థులు విజేతలుగా నిలిచినప్పుడే నాకు నిజమైన సంతృప్తి అని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లులో ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంత్రి రామానాయుడు సొంత ఖర్చులతో 110 రోజులు పాటు, ఎనిమిది వందల మంది అభ్యర్థులకు నిర్వహించిన ఉచిత డీఎస్సీ శిక్షణ ముగింపు సందర్భంగా బిఆర్ఎంవి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జరిగిన సభకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ముందుగా శిక్షణ ఇచ్చిన అధ్యాపకుల దంపతులను ఘనంగా సన్మానించారు. శిక్షణ పొందిన అభ్యర్థులు ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మూడు నెలలకు పైగా ఉచిత శిక్షణతో పాటు స్టడీ మెటీరియల్, భోజనం టిఫిన్ వంటి సౌకర్యాలను అందించిన మంత్రి రామానాయుడుకు జీవితాంత కాలం రుణపడి ఉంటామని ఆనందం సంతోషంతో వ్యక్తపరిచారు. కొందరు విద్యార్థినిలు నృత్య రూపంలో పాటలు పాడి అలరించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు అంబరాన్ని అంటాయి. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ చంద్రబాబుఈ విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే, ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వడం చారిత్రాత్మక నిర్ణయమన్నారు. డీఎస్సీ అంటే చంద్రబాబు. చంద్రబాబు అంటే డిఎస్సీ అని తెలిపారు. వంటవాళ్లు, డ్రైవర్ల భార్యలతో దిద్దించిన దుర్మార్గ చరిత్ర జగన్ దన్నారు.వచ్చే ఐదేళ్లలో ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో 5 లక్షల ఉద్యోగాల కల్పనే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమ పరుగులు పెడుతున్నాయి అంటే చంద్రబాబు, పవన్ కళ్యాణ్, మోడీ లతో పాటు విద్యా వ్యవస్థలో సంస్కరణలు తీసుకు వస్తున్న లోకేష్ లకు మంత్రి రామానాయుడు కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. ధర్మారావు ఫౌండేషన్ ద్వారా డీఎస్సీ శిక్షణ పొందిన మీరంతా ఉద్యోగాలు సాధించాలని, ఉపాధ్యాయులుగా స్థిరపడాలన్నారు. "ఉత్తమ పౌరులు ఎక్కడ తయారవుతారు అంటే తరగతి గదుల్లోనే " అనే ఆర్యోక్తిని అక్షర సత్యం చేయాలి. అలాగే మీ వృత్తిలో మీరు కూడా గొప్పగా రాణించి పేరు ప్రతిష్టలు సంపాదించుకోవాలి. మీ కుటుంబాలు బాగుండాలి. ఆల్ ది బెస్ట్, బెస్ట్ ఆఫ్లక్ అని మంత్రి తెలిపారు. అన్ని వృత్తుల్లో కంటే ఉపాధ్యాయ వృత్తి అత్యుత్తమైనది. పవిత్రమైనది. సంతృప్తికరమైనది. ఈ టీచింగ్ ప్రొఫెషన్ అంటే నాకు ఎంతో ఇష్టం. ఈ కారణంగానే విద్యార్థి దశ ముగిసిన వెంటనే నరసాపురం వైఎన్ కాలేజీలో అధ్యాపక వృత్తి చేపట్టి పదేళ్లపాటు పని చేశాను. ఆ సంతృప్తిని నేను ఇప్పటికీ అనుభవిస్తుంటానని తెలిపారు. అంతకంటే ఎక్కువ సేవ చేసే అవకాశం రావడంతో రాజకీయాల్లోకి వచ్చాను. అన్ని రంగాల వారికి నా పరిమితి మేరకు సేవలందిస్తూ ఇక్కడ కూడా సంతృప్తికరంగానే ఉన్నానని



చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే తొలిగా సంతకాలు చేసిన ఐదింటిలో డీఎస్సీ ఒకటి అన్నారు. డిఎస్సీ నోటిఫికేషన్తో రాష్ట్రంలో 16,347 మందికి ఉద్యోగాలు రాబోతున్నాయని తెలిపారు. దేశంలో 1.80 లక్షల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు.మాది మాటల ప్రభుత్వం కాదు. చేతల ప్రభుత్వం, మంచి ప్రభుత్వం అని మరోసారి నిరూపించుకున్నామన్నారు. గ్రూప్ వన్ పేపర్లను వెద్దర్లు, చెప్పారు. మూడుసార్లు వరుసగా ఎమ్మెల్యేగా విజయం సాధించడంతోపాటు నేడు ఈ స్థానంలో ఉన్నానంటే పాలకొల్లు నియోజకవర్గం నా కుటుంబ సభ్యులేనని, మీ అందరికీ జీవితాంతం రుణం తీర్చుకునేలా ప్రతిక్షణం సేవ చేస్తానని మంత్రి రామానాయుడు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి లకు చెందిన కూటమి నాయకులు, శిక్షణ పొందిన అభ్యర్థులు, అధ్యాపకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మూడు రోజులపాటు ఘనంగా టీడీపీ మహానాడు: చీఫ్ విప్ జీవీ



వినుకొండ (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ ప్రస్థానంలోనే కనీవినీ ఎరగని రీతిలో ఈసారి మహానాడు ఉండబోతోందని ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తెలిపారు. కీలకమైన సమయంలో అనేక సవాళ్లకు ఎదురొడ్డి తిరిగి అధికారంలోకి వచ్చిన సందర్భానికి గుర్తుగా కడప వేదికగా 3 రోజుల పాటు నిర్వహించబోతున్న మహానాడు పార్టీ అధినాయకత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందన్నారా యన. బుధవారం ఈ మేరకు మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మంత్రులు, సీనియర్ నాయకుల సమావేశంలో ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పాల్గొన్నారు. మంత్రులు నారాయణ, గొట్టిపాటి రవి, అనగాని సత్యప్రసాద్, డీబీవీ స్వామి, రామానాయుడు, ఫరూక్, పల్లా శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం మాట్లాడిన చీఫ్‌విప్ జీవీ కడపలో మహానాడు నిర్వహణపైనే ఈ సమావేశంలోనే ప్రధానంగా చర్చించినట్లు తెలిపారు. మే 27, 28 తేదీల్లో ప్రతినిధుల సభ, 29న బహిరంగ సభ నిర్వహణకు అధిష్ఠానం నిర్ణయం తీసుకుందన్నారు. తొలిరోజు టీడీపీ విధివిధానాలు, సిద్ధాంతాలు, కార్యాచరణపై , రెండో రోజు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల తీర్మానాలపై చర్చ, మూడో రోజు బహిరంగ సభ ఉంటుందన్నారు. మూడు రోజుల కార్యక్రమం మొత్తం పండుగ వాతావరణాన్ని తలపించాలని మంత్రులకు బాధ్యతలు అప్పగించాలని లోకేష్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలోనే నిర్ణయించామన్నారు. తుది ఏర్పాట్లపై పొలిట్ బ్యూరో సమావేశంలో లోకేష్ ఆధ్వర్యంలోని మంత్రుల కమిటీ నివేదిక ఇవ్వనుంది. వసతి, రవాణాకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సమావేశంలో తీర్మానించారు.

# అసెంబ్లీ, హైకోర్టు భవనాల నిర్మాణ పనులు దక్కించుకున్న ఎల్ అండ్ టీ


ఏపీ రాజధాని అమరావతి నిర్మాణం పున:ప్రారంభమైన విషయం తెలిసిందే. అయితే ఈ పునఃనిర్మాణంలో శాశ్వాత ఏపీ అసెంబ్లీ, హైకోర్టు భవనాలు నిర్మిచాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ఈ పనుల కాంట్రాక్టును ఎల్‌అండ్ టీ సంస్థకు అప్పగించింది. టెండర్ల ప్రక్రియ సైతం ఇప్పటికే పూర్తి అయిపోయింది. దీంతో అసెంబ్లీకి రూ. 617 కోట్లు, హైకోర్టు భవానికి రూ.786 కోట్ల విలువైన నిర్మాణ పనులను చేసేందుకు ఎల్ అండ్ టీ సంస్థ కాంట్రాక్ట్ తీసుకుంది. తాజాగా పనులు ప్రారంభించేందుకు ముందుకు వచ్చింది. తొలుత అసెంబ్లీకి సంబంధించి బేస్మెంట్, గ్రౌండ్ ఫ్లోర్తో పాటు 3 అప్పర్ ఫ్లోర్లు నిర్మించనుంది. మొత్తం 18 నెలల్లో పూర్తి చేసేందుకు సీఆర్డీఏతో ఎల్ అండ్ టీ సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు పనుల చేపట్టేందుకు సర్వం సిద్ధమైంది.

# ఆపరేషన్ సిందూర్ దేశానికి గర్వకారణం... మోపిదేవిలో ర్యాలీ



మోపిదేవి (చైతన్యరథం): 'ఆపరేషన్ సిందూర్ దేశానికి గర్వకారణమని పలువురు వక్తలు పేర్కొన్నారు. బుధవారం మోపిదేవిలో మండల పరిషత్ కార్యాలయ పర్యవేక్షణలో ఎంపీపీ రావి దుర్గావాణి ఆధ్వర్యంలో భారతదేశ త్రివిధ దళాల పోరాటపటిమ పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మోపిదేవి పురవీధుల్లో తిరంగా ర్యాలీ నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ ప్రజాప్రతినిధులు, శ్రేణులు, అధికారులు, నాయకులు మోపిదేవి మండల పరిషత్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు వెయ్యి అడుగుల పొడువున్న జాతీయ పతాకంతో భారీ ర్యాలీ నిర్వహించారు. శ్రేణులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, కూటమి నేతలు, ప్రజలు తరలివచ్చి ర్యాలీలో పాల్గొన్నారు. మోపిదేవి శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయం వద్ద అమర జవాన్లకు నివాళులు అర్పించారు.

# సినిమా టికెట్ల ధరలపై ప్రభుత్వం ఐదుగురితో కమిటీ ఏర్పాటు



సినిమా టికెట్ల ధరల ఖరారుపై ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సినిమా టికెట్ల ధరల ఖరారుపై ఏపీ ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసింది. హైకోర్టు ఆదేశాలతో కమిటీ ఏర్పాటు చేస్తూ హెూం శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ బుధవారం అమరావతిలో ఉత్తర్వులు జారీ చేశారు. హెూం శాఖ ముఖ్య కార్యదర్శి నేతృత్వంలో 5 మంది సభ్యులతో కమిటి ఏర్పాటు చేస్తున్నట్లు జారీ చేసిన ఉత్తర్వుల్లో ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇందులో సభ్యులుగా సమాచార, ఆర్థిక శాఖ, న్యాయ శాఖల కార్యదర్శులతోపాటు సినీ నిర్మాత వివేక్ కుచిభట్ల ఉండనున్నారు. సినిమా టికెట్ ధరలు పెంచాలంటూ గతంలో హైకోర్టులో పిటీషన్ దాఖలైన సంగతి తెలిసిందే.

# వీరయ్య చౌదరి హత్య కేసును ఛేదించిన పోలీసులు... 9 మంది అరెస్టు

ఒంగోలు (చైతన్యరథం): టీడీపీ నేత వీరయ్య చౌదరి దారుణ హత్య కేసును ప్రకాశం జిల్లా పోలీసులు ఛేదించారు. ఈ హత్య కేసులో 11 మంది నిందితులను గుర్తించామని జిల్లా ఎస్పీ దామోదర్ వెల్లడించారు. బుధవారం విలేకర్ల సమావేశంలో ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ.. 9 మంది నిందితులను అరెస్టు చేశామన్నారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని చెప్పారు. మృతుడు వీరయ్య స్వగ్రామం అమ్మనబ్రోలుకి చెందిన ఆళ్ళ సాంబయ్య ఈ హత్య కేసులో ప్రధాన కుట్రదారుడిగా తమ దర్యాప్తులో గుర్తించామన్నారు. ఈ నిందితుల్లో ముప్పా సురేష్, దేవేంద్రనాథ్ చౌదరిలు వీరయ్య స్వగ్రామానికి చెందిన వారని తెలిపారు. ఇసుక వ్యాపారి వినోద్ అనే వ్యక్తితో పాటు నెల్లూరుకి చెందిన నలుగురు కిరాయి ముఠాతో వీరయ్య హత్యకు పథక రచన చేసి అమలు చేశారన్నారు. రాజకీయ, వ్యాపారాల్లో విభేదాలు నేపథ్యంలో వీరయ్య చౌదరిని కిరాయి హంతకులతో హత్య చేయించారని పేర్కొన్నారు.



# యార్లగడ్డ చొరవతో విద్యుత్ ప్రమాద మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



గన్నవరం (చైతన్యరథం): విద్యుత్ ప్రమాద మృతుని కుటుంబానికి ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు చొరవతో నష్టపరిహారం అందింది. బాపులపాడు మండలం, బండారుగూడెం గ్రామానికి చెందిన మరీదు గోవిందులు (33) ఈ ఏడాది జనవరి నెల 12 వ తేదీ విద్యుత్ షాక్ గురై ప్రాణాలు కోల్పోయాడు. మృతునికి భార్య, ఒక కుమార్తె (2)లు ఉండగా కుటుంబ పెద్ద మరణంతో వీరిద్దరు అనాథలుగా మిగిలారు. దీంతో ఈ కుటుంబ దుస్థితిని బండారు గూడెం గ్రామ పార్టీ అధ్యక్షులు కొండేటి నాగరాజు ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన యార్లగడ్డ విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి మృతుని భార్య పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మృతుని కుటుంబానికి పరిహారం అందించాలని ఆదేశించారు. మృతుని కుటుంబ సభ్యులకు సహకరించాలని తన వ్యక్తిగత సిబ్బందిని ఎమ్మెల్యే యార్లగడ్డ ఆదేశించారు. ఈ మేరకు విద్యుత్ శాఖ నియమ నిబంధనల ప్రకారం గోవిందులు మృతిపై విచారణ జరిపిన అధికారులు ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి మృతి చెందినట్లు నిర్ధారించుకొని అతని కుటుంబానికి రాష్ట్ర విద్యుత్ శాఖ తరఫున రూ.5 లక్షల రూపాయల పరిహారాన్ని మంజూరు చేశారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఉండగా మృతుడు మరీదు గోవిందులు కుటుంబ సభ్యులైన అతని భార్య మరీదు వందన, కుమార్తె మరీదు ప్రణయ స్థానిక నాయకులతో కలిసి గౌరవ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావును కలిసి తమ కుటుంబానికి అండగా నిలిచి పరిహారం అందే విధంగా కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ కార్యకర్తలకు, అభిమానులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని వారికి ఏ కష్టం వచ్చినా తప్పకుండా సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. పార్టీ తరపున మరికొంత ఆర్థిక సహాయం అందే విధంగా కృషి చేస్తానని మృతుని కుటుంబ సభ్యులకు యార్లగడ్డ హామీ ఇచ్చారు.

# ఎంపి కేశినేని శివనాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన టీడీపీ కొటికలపూడి గ్రామ నూతన కార్యవర్గం

- టీడీపీ గ్రామ అధ్యక్షుడుగా అర్జా సుధాకర్ సుధాకర్ ఎన్నిక
- నూతన కార్యవర్గానికి ఎంపి కేశినేని శివనాథ్ అభినందనలు



విజయవాడ (చైతన్యరథం): మైలవరం నియోజకవర్గం ఇబ్రహీంపట్నం మండలంలోని కొటికలపూడి గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా నూతనంగా ఎంపికైన అర్జా సుధాకర్ సుధాకర్ తోపాటు, నూతనంగా ఎంపికైన పార్టీ నూతన కార్యవర్గ సభ్యులు కేశినేని శివనాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో బుధవారం ఎంపి కేశినేని శివనాథ్‌ను కలిసి గ్రామ పార్టీలో నూతన కార్యవర్గ సభ్యులుగా తమకి అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపి కేశినేని శివనాథ్ కొటికలపూడి గ్రామ తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడిగా ఎంపికైన అజ్జా సుధాకర్ కు అభినందనలు తెలపటంతో పాటు శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించారు.ఉపాధ్యక్షుడుగా ఎన్నికైన కొలాకాని తిరుపతి రావు, సెక్రటరీ గంధ్రాల కిషోర్ తోపాటు ఇతర కార్యవర్గ సభ్యులకి ఎంపి కేశినేని శివనాథ్ అభినందనలు తెలిపారు. ఈకార్యక్రమంలో మాజీ ప్రెసిడెంట్ మల్లేటి రామారావు, వైస్ ఎంపీపీ బండి వెంకటేశ్వరరావు, టీడీపీ గ్రామ సీనియర్ నాయకులు నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, వీర్ల వెంకయ్య, శ్రీనివాసరావులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# పోలవరంలో దారుణం... వైద్యుల నిర్లక్ష్యం కారణంగా నిండు గర్భిణి మృతి

ఏలూరు జిల్లా (చైతన్యరథం): పోలవరం మండలంలో దారుణం జరిగింది. వైద్య అందక నిండు గర్భిణి మృతి చెందారు. కొత్తకొంకాల గ్రామానికి చెందిన గర్భిణి శిరీషకు పురిటి నొప్పులు వచ్చాయి. కుటుంబ సభ్యులు ఆమెను పోలవరం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యులు లేకపోవడంతో నర్సు పరీక్షలు నిర్వహించారు. అయితే గర్భిణి పరిస్థితి విషమించడంతో రాజమండ్రికి తీసుకెళ్లాలని సూచించారు. కాసేపట్లో గర్భిణి మృతి చెందారు. దీంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే గర్భిణి శిరీష చనిపోయిందని ఆరోపించారు.

# సాగునీటి వ్యవస్థను నీరుగార్చిన వైసీపీ

**కావలి కాలువకు నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యేలు కాకర్ల సురేష్, దగుమాటి**

**700 క్యూసెక్కుల నీటితో 70,000 నేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు విడుదల..!**

సంగం, (చైతన్యరథం): సోమశిల నుండి సంగం బ్యారేజ్ కి వచ్చిన నీటిని కావలి ఉత్తర కాలువకు 700 క్యూసెక్కుల నీటిని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, కావలి ఎమ్మెల్యే దగు మాటి కృష్ణారెడ్డి, చేతుల మీదుగా ప్రత్యేక పూజలు నిర్వహించి బుధవారం ఉదయం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కావలి ఉత్తర కాలువ ద్వారా విడుదలైన నేటితో సుమారు 70,000 వేల ఎకరాల ఆయకట్టు సాగులోనికి వస్తుందన్నారు. రైతన్నలు పంటలు సాగు చేసుకోవాలని తెలిపారు. అనుభవజ్ఞులైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమశిల ప్రాజెక్టును సందర్శించి ప్రత్యేక బడ్జెట్‌ని కేటాయించి, రైతన్నల పక్షపాతిగా నిలిచారన్నారు. 40 సంవత్సరాల అనుభవం కలిగిన మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి రెండుసార్లు సోమశిల ప్రాజెక్టును సందర్శించి రైతన్నల కష్టాలను తీర్చేందుకు సోమశిల జలాలను విడుదల చేశారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఇరిగేషన్ విద్యుత్‌శాఖలను పూర్తిగా నిర్వీరం చేసిందనేది అక్షరసత్యం అన్నారు. అనుభవం ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యవస్థలను చక్కదిద్దుతున్నారన్నారు. మెట్ట ప్రాంతం సస్యశ్యామలం కావాలంటే సోమశిల హై లెవెల్ ఉత్తర కాలువ వెలుగొండ ప్రాజెక్టు పూర్తి కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్‌శాఖ అధికారులు స్థానిక నాయకులు తదితరులు ఉన్నారు.





# వైసీపీ చెరనుంచి టీడీపీ ఒడిలోకి చీరాల పురపాలక పీఠం

**నాలుగు రోజుల్లో చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎంపిక**

చీరాల, (చైతన్యరథం): చీరాల మున్సిపాలిటీ పీఠాన్ని తెలగుదేశం పార్టీ కైవసం చేసుకుంది. చీరాల మున్సిపాలిటీలో 33 వార్డులు ఉన్నాయి. చైర్మన్, వైస్ చైర్మన్ పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా 27 మంది కౌన్సిలర్లు టీడీపీకి మద్దతు తెలిపారు. ఇప్పటికే వైసీపీ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు వైసీపీని వీడి టీడీపీ గూటికి చేరారు. అయినప్పటికీ చైర్మన్ శ్రీనివాసరావు వైసీపీలో ఉండగా కలెక్టర్‌కు టీడీపీ కౌన్సిలర్లు ఇచ్చిన నోటీసు ప్రకారం నేడు అవిశ్వాస తీర్మానం నిర్వహించారు. శ్రీనివాసరావుకు వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంలో 27 మంది కౌన్సిలర్లు టీడీపీకి మద్దతు తెలపడంతో అవిశ్వాసం ముగిసింది. మరోపక్క వైసీపీ వైస్ చైర్మన్ జైసన్ బాబుకు వ్యతిరేకంగా 27 మంది కౌన్సిలర్లు టీడీపీకి మద్దతు తేలిపారు. మరో నాలుగు రోజుల్లో చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎంపిక ఉంటుందని అధికారులు తెలిపారు. దీంతో చీరాలలో కూటమి నేతలు కార్యకర్తలు టపాసులు పేల్చి, బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు.



# సత్ఫలితాలు సాధించండి

**డాక్టర్ శివప్రసాద్, సుబ్బానాయుడికి ఎమ్మెల్యే సోమిరెడ్డి అభినందన**


నెల్లూరు, (చైతన్యరథం): సర్వేపల్లి శాసనసభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిని ఏపీ ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ బోర్డు చైర్మన్ డాక్టర్ శివప్రసాద్, ఏపీ ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిద్దరినీ సోమిరెడ్డి అభినందించారు. అంకితభావంతో పదవులకు న్యాయం చేయాలని సూచించారు.



# పార్టీ కోసం బాధ్యతాయుతంగా పని చేయాలి

**ఎమ్మెల్యే సిందూర, మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి**

అనంతపురము, (చైతన్యరథం): పార్టీ కోసం బాధ్యతాయుతంగా ప్రతి ఒక్కరు పని చేయాలని నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పిలుపునిచ్చారు. పుట్టపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డితో కలసి కొత్తచెరువు మండల టీడీపీ నాయకులు కార్యకర్తలతో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. పార్టీకి పనిచేయని పదవులకు దూరంగా పెడతామని తెలిపారు. పార్టీకికష్టపడిన కార్యకర్తలకే తగిన గుర్తింపుని ఇస్తామన్నారు. గత ఎన్నికల్లో టిడిపికి వచ్చిన మెజార్టీ పై పంచాయతీల వారీగా పోలింగ్ బూత్ లో వచ్చిన ఓట్ల సంఖ్యను కార్యకర్తల దృష్టికి తీసుకొచ్చారు. కుటుంబ సభ్యులను సైతం పక్కనపెట్టి పుట్టపర్తి నియోజకవర్గ ప్రజల కోసం మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి అహర్నిశలు సేవ చేస్తున్నారని అలాంటి నాయకుడిని, టీడీపీని 2019లో గెలిపించుకోలేకపోయారని కార్యకర్తలను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడారు. కరోనా సమయంలో కూడా నియోజకవర్గ ప్రజలే నా దేవుళ్ళంటూ ప్రజల వద్దకు వెళ్లి నిత్యవసర సరుకులు కూరగాయలు వంటివి పంపిణీ చేసి ప్రజలను ఆదుకున్న విషయాన్ని కూడా ఎమ్మెల్యే ప్రస్తావించారు. 30 ఏళ్లుగా పల్లె కుటుంబాన్ని ఆదరిస్తున్న ఈ నియోజకవర్గ ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటామని పేర్కొన్నారు. అయితే తెలుగుదేశం పార్టీకి నష్టం కలిగిస్తే ఉపేక్షించే ప్రసక్తి లేదని హెచ్చరించారు, మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ 30 ఏళ్ల రాజకీయ చరిత్రలో మచ్చలేని వ్యక్తిగా ప్రజలకు సేవ చేస్తున్నానని పేర్కొన్నారు. పార్టీ కోసం అందరూ కలిసికట్టుగా పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎలివేషన్ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. పార్టీ కి తీవ్ర నష్టం కలిగిస్తే వారిపై క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కొత్తచెరువు మండల కన్వీనర్లు శ్రీనివాసులు రామకృష్ణ టీడీపీ సీనియర్ నాయకులు సాలెక్క గారి శ్రీనివాసులు, ఎల్లైసీ నర్సింహులు, టీడీపీ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





**కన్నుల పండువగా రుక్మిణీ, సత్యభామ సమేత**

# వేణుగోపాలుని కల్యాణోత్సవం

**అమ్మవార్లకు పట్టు వస్త్రాల సమర్పించిన కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి**

కందుకూరు, (చైతన్యరథం): కందుకూరు నియోజకవర్గం ఉలవపాడు గ్రామంలో శ్రీ వేణుగోపాలస్వామి కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డికి కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరు నాగేశ్వరరావు దంపతులు ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారిని దర్శనం చేసుకుని ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించి అర్చకులచే తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటూరు దంపతులతో కలిసి రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామివారి కల్యాణోత్సవాన్ని తిలకించారు. ఈ కార్యక్రమంలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరు నాగేశ్వరరావు, ఫౌండర్ ట్రస్టీ సుధీష్ చంద్ర రెడ్డి కుటుంబ సభ్యులతో పాటు పెద్ద సంఖ్యలో స్థానిక టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైభవంగా కోదండరాముని రథోత్సవం

**పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీ కాకర్ల సురేష్..!**

కలిగిరి, (చైతన్యరథం): కలిగిరి మండలం పెదపాడు గ్రామంలోని శ్రీ కోదండరామస్వామి, నవమి ఉత్సవాలలో జరుగుతున్న రథోత్సవంలో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పాల్గొన్నారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో మండల నాయకులు గ్రామ నాయకులు ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు స్వాగతం పలికారు. శ్రీ సీతాసమేత రామచంద్రమూర్తిని ఎమ్మెల్యే దర్శనం చేసుకున్నారు. కొద్దిసేపు రథాన్నిలాగారు. పురోహితులు ఆశీర్వాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో రామభక్త బృందం తదితరులు పాల్గొన్నారు.



# అమలవుతున్న అభివృద్ధి పనులు చూడండి

**స్థానికులను ఆహ్వానించిన ఎమ్మెల్యే కోటంరెడ్డి**

నెల్లూరు రూరల్, (చైతన్యరథం): ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 339 పనుల్లో భాగంగా నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటం రెడ్డిశ్రీధర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక నాయకులు ప్రతి ఇంటికీ వెళ్లి పని జరిగిన ప్రదేశానికి గురువారం ఉదయం విచ్చేయాలని ప్రతి ఒక్కరినీ 36వ డివిజన్ నాయకులు పూడి ఆనంద్, డాక్టర్ ఊరందూరు సురేంద్ర బాబు, నీత్ రాజ్, కిరణ్ కుమార్ శామ్యూల్ తదితరులు ఆహ్వానించారు.



# ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యత

**అధికారులను ఆదేశించిన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి**

బనగానపల్లె, (చైతన్యరథం): అధికారులు ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యతనిచ్చి బాధితుల సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని రాష్ట్ర రోడ్లు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో బీసీ జనార్దన్ రెడ్డి ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా పలువురు తమ సమస్యలను ఏకరుపెడుతూ వినతిపత్రాలు సమర్పించారు. వినతి పత్రాలను పరిశీలించిన మంత్రి చిన్నచిన్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మరికొన్ని అధికారులకు అందజేసి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని ఆదేశించారు.



# వినియోగదారులకు మెరుగైన విద్యుత్తు అందించాలి

## పట్టణాల్లో లోఓల్టేజీ సమస్య తలెత్తకూడదు, ఎస్పీడీసీఎల్ ఎస్ఈ కార్యాలయాన్ని ప్రారంభించిన మంత్రి మండిపల్లి

రాయచోటి, (చైతన్యరథం): విద్యుత్ వినియోగదారులకు మెరుగైన విద్యుత్ అందించాలని రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి బుధవారం రాయచోటి పట్టణంలోని ఏపీ ఎస్పీడీసీఎల్ కార్యాలయంలో 10 లక్షలతో రీమోడల్ చేసిన ఎస్ఈ కార్యాలయాన్ని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా,



యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని మారుమూల గ్రామాలకు సైతం మెరుగైన విద్యుత్ అందించడం జరుగుతుందన్నారు. విద్యుత్ అధికారులు సిబ్బంది సమన్వయంతో పనిచేసి విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు. విద్యుత్ అధికారులకు ఎటువంటి సమస్యలున్న వెంటనే తమకు తెలియజేసి పరిష్కరించుకోవచ్చునన్నారు. ప్రజల నుంచి ఎక్కడ కూడా లో-వోల్టేజ్ సమస్య ఫిర్యాదులు రాకూడదన్నారు. అతి త్వరలో మారుమూల గ్రామాలకు సైతం త్రీఫేస్ కరెంటు అందజేసి ప్రజల జీవనోపాదులు మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. నూతన అన్నమయ్య జిల్లా ఏర్పడిన సందర్భంగా రాయచోటి పట్టణంలో ఏపీఎస్పీడీసీఎల్ నూతన ఎస్ఈ కార్యాలయం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీంతో నూతన ఎస్ఇ చాంబర్ నిర్మాణానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్ఇ చంద్రశేఖర్ రెడ్డి, అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# 17న సీఎం చంద్రబాబు పాణ్యం పర్యటన

## స్థల పరిశీలనలో ఎమ్మెల్యే కలెక్టర్, టీడీపీ అధ్యక్షుడు

పాణ్యం, (చైతన్యరథం): ఈ నెల 17 వ తేదీ శనివారం సీఎం చంద్రబాబు నాయుడు స్వచ్ఛంద్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొనటానికి పాణ్యం నియోజకవర్గానికి వస్తున్న సందర్భంగా బుధవారం నంద్యాల రోడ్ లోని కేంద్రీయ విద్యాలయం ప్రక్కన జరిగే ప్రజావేదిక సభ స్థలాన్ని కలెక్టర్ పీ రంజిత్ భాష , మున్సిపల్ కమిషనర్ రవీంద్ర బాబుతో కలిసి పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు టీటీడీ బోర్డు మెంబర్ మల్లెల రాజశేఖర్, టీడీపీ కర్నూలు జిల్లా అధ్యక్షులు ప్యాలకుర్తి తిక్కారెడ్డి నాయకులు పాల్గొన్నారు



# వైభవంగా దుర్గమాంబ జాతర ప్రారంభం

## 40లక్షలతో నిర్మించిన కట్టడాలను ఎమ్మెల్యే పరిటాల సునీత, శ్రీరామ్ దుర్గమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్ల ఊరేగింపు

## హరియానచెరువు నుంచి పాల కావడి ఊరేగింపు నసనకోటలో అలుముకున్న ఆధ్యాత్మిక వాతావరణం

రాప్తాడు, (చైతన్యరథం): రామగిరి మండలం నసనకోటలో దుర్గమాంబ జాతర మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. దేవస్థానం వద్ద 40 లక్షల రూపాయల నిధులతో నిర్మించిన ప్రొటెక్షన్ వాల్ రైలింగ్ అదనపు సౌకర్యాలు నాగలకట్ట నిర్మాణాలను ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ ప్రారంభించారు. చాలా ఏళ్ల తర్వాత జాతర మహోత్సవం నిర్వహిస్తుండటంతో నసనకోటతోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో ఒక ఆధ్యాత్మిక వాతావరణం కనిపిస్తోంది. తొలి రోజు కార్యక్రమంలో భాగంగా దుర్గమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్ల ఊరేగింపు వైభవంగా సాగింది. హరియాన్ చెరువు గ్రామం నుంచి పాల కావిడి ఊరేగింపు కూడా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలలో భాగంగా స్వామివారికి జలధివాసము కార్యక్రమాన్ని నిర్వహించారు. మూడు రోజుల తర్వాత విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించనున్నట్లు అర్చకులు తెలిపారు. అఖండ దీపారాధన, సభావందనము, గోపూజ, గంగపూజ, గణపతి పూజ, స్వస్తిపుణ్యాహవాచనము, శ్రీ అభయాంజనేయ స్వామికి జలాధివాసము వంటి కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంకాల వేదపారాయణము, శ్రీ లలితా సహస్ర పారాయణం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే పరిటాల సునీత శ్రీరామ్, సిద్దార్థ దంపతులతో పాటు పంచాయతీ పెద్దలు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. నసనకోట గ్రామంలో చాలా ఏళ్ల తర్వాత ఈ ఉత్సవాలు జరుగుతుండటం చాలా సంతోషంగా ఉందని, ఐదు రోజులపాటు జరిగే ఉత్సవాల్లో భక్తులందరూ పాల్గొనాలని శ్రీరామ్, సునీత విజ్ఞప్తి చేశారు. ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లన్నీ దగ్గరుండి పర్యవేక్షించారు.





# కార్యకర్తల కోసమే మంత్రి లోకేష్ రాక

## మూడురోజుల అనంత పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే దగ్గుపాటి పాల్గొన్న కలెక్టర్ వినోద్ కుమార్, జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ శివుడు యాదవ్, శాప్ ఛైర్మన్ రవి నాయుడు

అనంతపురము, (చైతన్యరథం): పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలను, అలాగే ఇబ్బందులు పడ్డవారిని పార్టీ ఎప్పటికీ మర్చిపోదని వారి కోసమే మంత్రి నారా లోకేష్ మూడు రోజులు పాటు అనంతపురం జిల్లాలో పర్యటిస్తున్నట్లు అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. నగరంలోని ఎంవైఆర్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నారా లోకేష్ పాల్గొనే కార్యకర్తల సమావేశానికి సంబంధించిన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్, శాప్ ఛైర్మన్ రవి నాయుడుతో పాటు పలువురు టీడీపీ కీలక నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. ఎంవైఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగే సమావేశానికి కార్యకర్తలు ఎంతమంది వస్తారు ఇక్కడ ఎలాంటి ఏర్పాట్లు ఉండాలన్న అంశాల గురించి నాయకులు చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అనేకమంది కార్యకర్తలు కేసులు ఎదుర్కొన్నారన్నారు. వివిధ రూపాల్లో ఇబ్బందులు పడ్డారని, వారిని పార్టీ ఎప్పటికీ మర్చిపోదన్నారు. వారిని కలవడానికి మంత్రి నారా లోకేష్ జిల్లాకు వస్తున్నారని తెలిపారు. మొదటి రోజు గుంతకల్లు నియోజకవర్గంలో పర్యటన ఉంటుందని తర్వాత రోజు కూడా గుంతకల్లు లో బేతపల్లిలో రెన్యూ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయనున్నారన్నారు. అదే రోజు అనంతపురంలో కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు కుమార్తె వివాహానికి హాజరవుతారని సాయంత్రం ఎంవైఆర్ ఫంక్షన్ హాల్ లో కార్యకర్తల సమావేశం ఉంటుందని వివరించారు. మరుసటి రోజు జేఎన్టీయూ స్నాతకోత్సవంలో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అర్బన్ నియోజకవర్గ పరిధిలో పార్టీ కోసం కష్టపడ్డ నాయకులను మంత్రి నారా లోకేష్ కలుస్తారని వారికి గుర్తింపుగా ఒక శ్వేత పత్రం కూడా అందజేస్తారని అన్నారు. ఈ పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే దగ్గుపాటి పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్ మాట్లాడుతూ మూడు రోజులపాటు ఆయన కార్యకర్తల కోసమే సమయాన్ని వెచ్చిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ స్టేట్ మీడియా కోఆర్డినేటర్ బివి వెంకటరాముడు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి బుగ్గయ్య చౌదరి, అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి అభ్యర్థి కమిటీ సభ్యుడు కోనంకి గంగారామ్, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ, తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీనరసింహ, ఏడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, సింగనమల నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యుడు ఆలం నరసానాయుడు, టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఫిరోజ్ అహ్మద్, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సైపుద్దీన్, బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దలవాయు వెంకట నారాయణ, బెస్త సాధికార సమితి రాష్ట్ర నాయకుడు చేపల హరి, టీడీపీ నాయకులు నెట్టెం బాలకృష్ణ, వద్దే హరి, వద్దే వెంకటేష్ పాల్గొన్నారు.



# పుట్టపర్తి పర్యాటకాభివృద్ధికి చేయూతనివ్వండి

## ప్రముఖ కంపెనీలను కోరిన పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి జాయ్ లూక్కాస్ కంపెనీ ప్రతినిధులతో కలిసి పర్యాటక ప్రాంతాల పరిశీలన

పుట్టపర్తి, (చైతన్యరథం): పుట్టపర్తి భగవాన్ శ్రీ సత్యసాయిబాబా 100వ శత జయంతోత్సవాల సందర్భంగా చేపట్టే అభివృద్ధి పనులకు తగిన చేయుతనివ్వాలని ఎమ్మెల్యే



సింధూర, మాజీమంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి కలిసి పలు కార్పొరేట్ సంస్థలను కోరారు. పుట్టపర్తి మున్సిపల్ పరిధిలోని శిల్పారామం పుడా పరిధిలో ఉన్న పార్కు స్థలాన్ని చిత్రావతి పరివాహక ప్రాంతం ఆంజనేయస్వామి విగ్రహం, తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి తో పాటు మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, సామకోటి ఆదినారాయణ, ప్రముఖ జాయ్ లుక్కాస్ జ్యువెలరీ కంపెనీ ప్రతినిధులు జాయ్ లూకాస్, రోబిన్, మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద, ప్రభుత్వ అధికారులు, పర్యాటక అధికారి నర్సయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులతో పాటు పరిశీలించారు. పుట్టపర్తి చిత్రావతి ప్రాంతాన్ని సుందరీకరణ అభివృద్ధి పనులకు కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులతో అభివృద్ధి చేయాలని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి జాయ్ లూకాస్ జ్యువెలరీ ప్రతినిధులను కోరారు. పుడా పరిధిలో ఉన్న 14 పార్కుల అభివృద్ధికి తగిన తోడ్పాటు నివ్వాలన్నారు. పుట్టపర్తి శిల్పారామంలో తగిన మౌలిక వసతుల కల్పనకు తగిన అభివృద్ధికి సహకారం ఇవ్వాలన్నారు. కలెక్టర్ టీఎస్ చేతన్ కలసి అభివృద్ధి పనులపై చర్చించారు. తమ కంపెనీ ద్వారా పుట్టపర్తి పర్యాటక రంగ అభివృద్ధికి తగిన నిధులు ఇచ్చి సహాయ సహకారాలు అందిస్తామని ఆ కంపెనీ ప్రతినిధులు జాయ్ లుక్కాస్, రిబిన్‌లు తెలిపారు.

# ఒత్తిడి వ్యూహానికే విలవిల్లాడిన పాక్



పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ చేపట్టిన విషయం తెలిసిందే. ఇందుకు ప్రతిగా పాక్ ప్రతిస్పందించే అవకాశాన్ని పసిగట్టిన నావికాదళం సముద్ర సంసిద్ధతను గణనీయంగా పెంచడానికి పలు చర్యలు చేపట్టింది. ఇందులోభాగంగా పాక్‌లోని కరాచీ పోర్టు లక్ష్యంగా ఐఎన్ఎస్ విక్రాంత్, బ్రహ్మోస్ క్షిపణులతో కూడిన యుద్ధ నౌకలు, జలాంతర్గాములను మోహరించినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. వాటిని మోహరించడంతో ఆపరేషన్ సిందూర్ ఫలించిందని తెలిపాయి. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌పై త్రిముఖ ఒత్తిడి వ్యూహాన్ని ప్రయోగించామని నావికాదళ అధికారులు పేర్కొన్నారు. కరాచీ పోర్టును లక్ష్యంగా చేసుకొని 36 ఫ్రంట్‌లైన్ నావికా దళాలను మోహరించామని తెలిపారు. వీటిలో బ్రహ్మోస్ క్షిపణులతో కూడిన ఏడు డిస్ట్రాయర్లు, మీడియం రేంజ్ సర్ఫేస్–టు ఎయిర్ క్షిపణులు వరుణాస్త్ర హెవీవెయిట్ టార్పెడోలు ఉన్నాయన్నారు. వీటిలో కొత్తగా ప్రవేశపెట్టిన తుషిల్‌తో సహా ఏడు స్టెల్త్ గైడెడ్–క్షిపణి యుద్ధనౌకలను సైతం మోహరించినట్లు వివరించారు. ఐఎన్ఎస్ విక్రాంత్, బ్రహ్మోస్ క్షిపణులతో కరాచీ పోర్టును దిగ్బంధించడం వల్ల వారి నావికాదళం సమర్థవంతంగా ప్రతిస్పందించలేకపోయిందని కేవలం నౌకాశ్రయానికే పరిమితమవ్వాల్సి వచ్చిందని అధికారులు పేర్కొన్నారు. ఈ ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో అంతర్జాతీయ వాణిజ్య నౌకలు తమ దారిని మళ్లించుకున్నాయి.

పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత్ పాక్‌లోని ఉగ్రస్థావరాలపై దాడులు చేసింది. కాగా ఇందులో భారత క్షిపణులు పాకిస్థాన్ అణుస్థావరాలను తాకినట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు. మే 9 అర్ధరాత్రి 10వ తేదీన పాకిస్థాన్లోని కీలక వాయుసేన స్థావరాలపై అత్యంత కచ్చితత్వంతో దాడులు చేశామని భారత్ ప్రకటించింది. పూర్తి స్వదేశీ ఆయుధాలతో దాడి చేసి 11 వాయుసేన స్థావరాలను దెబ్బతీసినట్లు తెలిపింది. రావల్పిండిలోని పాక్ న్యూక్లియర్ కమాండ్ కంట్రోలు సమీపంలో ఉన్న నూర్ఖన్ ఎయిర్ఫోర్స్‌పైనా ఇండియన్ ఆర్మీ ప్రిసిషన్ స్ట్రైక్ చేసింది. దీంతో పాక్ అమెరికా సహాయంతో భారత్‌తో కాళ్ల బేరానికి వచ్చింది.

ఐఎన్ఎస్ విక్రాంత్..

రూ.20వేల కోట్లతో నిర్మించిన ఐఎన్ఎస్ విక్రాంత్‌ను 2022 సెప్టెంబర్లో నౌకాదళంలోకి ప్రవేశపెట్టారు. 262 మీటర్ల పొడవు, 62 మీటర్ల వెడల్పుతో ఐఎన్ఎస్ విక్రాంత్ భారత్‌లో నిర్మించిన అతి పెద్ద యుద్ధనౌక. మిగ్–29కే, హెలికాప్టర్లతో సహా 30 యుద్ధ విమానాలను ఇది మోసుకెళ్లగలదు. విక్రాంత్ డిజైన్ భారత నౌకాదళంలోని వార్షిప్ డిజైన్ బ్యూరో తయారుచేసింది. ఈ నౌక నిర్మాణాన్ని కొచ్చిన్ షిప్‌యార్డ్ పూర్తిచేసింది.

# గర్వించతగ్గ భారతపుత్రికను అవమానిస్తారా

**మంత్రి వివాదాస్పద వ్యాఖ్యలపై మండిపడ్డ మహిళా కమిషన్ - వెనక్కు తగ్గిన మధ్యప్రదేశ్ మంత్రి**



పాకిస్థాన్‌తో పోరుకు సంబంధించి మీడియాకు వివరాలు వెల్లడిస్తూ వచ్చిన సైనికాధికారిణి కర్నల్ సోఫియా ఖురేషీపై మధ్యప్రదేశ్ గిరిజన సంక్షేమశాఖ మంత్రి విజయ్ షా చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను జాతీయ మహిళా కమిషన్ ఖండించింది. బాధ్యతాయుత స్థానాల్లో ఉన్న కొంతమంది వ్యక్తులు స్త్రీల పట్ల అలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని కమిషన్ చైర్ పర్సన్ విజయ రహాట్కర్ వ్యాఖ్యానించారు. ఇది మన సమాజంలోని మహిళల గౌరవాన్ని దెబ్బతీయడమే కాకుండా దేశ భద్రతలో ముఖ్యపాత్ర పోషిస్తున్న కుమార్తెలను అవమానించినట్లు అవుతుందని పేర్కొన్నారు.

మంత్రి పేరు నేరుగా ప్రస్తావించనప్పటికీ గౌరవనీయ స్థానాల్లో ఉన్నవారు స్త్రీల పట్ల గౌరవప్రదమైన వైఖరిని పెంపొందించుకోవడం చాలా ముఖ్యమని అన్నారు. "కర్నల్ సోఫియా ఖురేషీ దేశం గర్వించదగ్గ భారత పుత్రిక. దేశాన్ని ప్రేమించే భారతీయులందరికీ సోదరి. ఎంతో ధైర్యం, అంకిత భావంతో ఆమె దేశసేవ చేస్తున్నారు. అటువంటి మహిళలను చూసి దేశం గర్వపడుతోంది. దేశం ప్రగతిశీల అభివృద్ధి వైపు వెళ్లాలంటే స్త్రీలు ప్రతి రంగంలోనూ ముందుకు వచ్చి నాయకత్వం చేపట్టాలి. మహిళలపై అగౌరవ వ్యాఖ్యలు చేయడం దేశాభివృద్ధిని అడ్డుకోవడమే" అని మహిళా కమిషన్ చైర్ పర్సన్ విజయ రహాట్కర్ సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు.

ఓ కార్యక్రమంలో మధ్యప్రదేశ్ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి విజయ్ షా సైనికాధికారిణి కర్నల్ సోఫియా ఖురేషీని ఉద్దేశించి ప్రసంగించారు. 'వాళ్లు (ఉగ్రవాదులు) మన సోదరీమణుల సిందూరాన్ని తుడిచేసి వితంతువుల్ని చేశారు. వాళ్ల (ఉగ్రవాదుల) మతానికి చెందిన సోదరిని సైనిక విమానంలో ప్రధాని మోదీజీ పాక్‌కు పంపించి పాఠం నేర్పించారు' అని ఇండోర్ సమీప గ్రామంలో ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదాన్ని రేకెత్తించాయి. ఆయన మంత్రి పదవిపై వెంటనే వేటువేయాలని కాంగ్రెస్ నేతలు ప్రధానికి విజ్ఞప్తిచేశారు. మంత్రి వ్యాఖ్యలు అత్యంత సిగ్గుచేటుగా, కించపరిచేవిగా ఉన్నాయని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తప్పుబట్టారు. తన వ్యాఖ్యలపై తీవ్ర వ్యతిరేకత రావడంతో మంత్రి క్షమాపణలు తెలియజేశారు. ఉగ్రవాదుల దుశ్చర్యలతో తన మనసు వికలమై అలాంటి వ్యాఖ్యలు చేశానని, కులమతాలకు అతీతంగా ఖురేషీ చేసిన సేవలకు తాను సెల్యూట్ చేస్తున్నానని విలేకరులకు చెప్పారు. ఆమెను కించపరిచే ఆలోచన కలలో కూడా రాదని, తన మాటలు ఎవరినైనా నొప్పిస్తే పదిసార్లు క్షమాపణ చెప్పేందుకు సిద్ధమని అన్నారు.

**తత్వం బోధపడినట్లేనా**

# సింధూ జలాలపై పాకిస్థాన్ కాళ్లబేరం



సింధూ జలాల ఒప్పందం నిలిపివేత వల్ల జరిగే నష్టం ఏంటో పాకిస్థాన్‌కు తెలుసొచ్చింది. మొన్నటి వరకు ఈ అంశంలో తీవ్రస్వరంతో మాట్లాడిన దాయాది ఇప్పుడు ఆత్మరక్షణలో పడినట్లు కనిపిస్తోంది. కాల్పుల విరమణకు అంగీకరించిన భారత్ సింధూ జలాల విషయంలో వెనక్కి తగ్గేదే లే' అని ప్రకటించడంతో ఇప్పుడు కాళ్ల బేరానికి వచ్చింది. నిర్ణయాన్ని పునఃసమీక్షించుకోవాలని కోరింది. ఈ మేరకు భారత ప్రభుత్వానికి లేఖ రాసింది. సింధూ జలాలు నిలిపివేస్తే పాక్‌లో తీవ్ర దుర్భిక్షం నెలకొంటుందని, భారత జలశక్తి మంత్రిత్వ శాఖకు పాక్ జలవనరులశాఖ లేఖ రాసినట్లు సమాచారం. ఈ విషయంలో చర్చించేందుకు పాక్ సిద్ధంగా ఉందని పేర్కొంది. ప్రోటోకాల్లో భాగంగా ఈ అంశాన్ని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు పంపినట్లు తెలుస్తోంది. అయితే, రక్తం, నీరు రెండూ కలిసి ప్రవహించలేవంటూ ఈ విషయంలో వెనక్కి తగ్గేది లేదని ప్రధాని మోదీ ఇప్పటికే స్పష్టంచేశారు. పాక్ చర్చలంటూ జరిగితే ఉగ్రవాదం, పాక్ ఆక్రమిత కాశ్మీర్ పైనే అని పేర్కొన్నారు.

ఏమిటీ ఒప్పందం..?

పహల్గాంలో పర్యటకులపై ఉగ్రదాడి అనంతరం సింధూ జలాల ఒప్పందం నుంచి వైదొలుగుతున్నట్లు భారత్ ప్రకటించిన సంగతి తెలిసిందే. సింధూ, దాని ఉపనదుల జలాలను పంచుకోవడానికి వరల్డ్‌బ్యాంకు మధ్యవర్తిత్వంలో భారత్, పాకిస్థాన్ మధ్య ఒప్పందం 1960లో కుదిరింది. ఈ ఒప్పందంపై అప్పటి భారత ప్రధాని నెహ్రూ, పాకిస్థాన్ అధ్యక్షుడు అయూబ్‌ఖాన్ సంతకాలు చేశారు. దీని ప్రకారం సింధు ఉప నదుల్లో తూర్పున పారే రావి, బియాస్, సట్లెజ్ నదులపై భారత్‌కు హక్కులు లభించాయి. సింధూ నదితోపాటు దాని పశ్చిమ ఉపనదులైన జీలం, చీనాబ్‌లపై పాకిస్థాన్‌కు హక్కులు దక్కాయి. ఉగ్రదాడి అనంతరం పాకిస్థాన్‌కు బుద్ధి చెప్పేందుకు సింధూనదీ జలాల ఒప్పందాన్ని భారత్ రద్దు చేసింది.

# పాక్‌పై బిగుస్తున్న ద్వైపాక్షిక వత్తిడి

***జైశంకర్‌తో ఏకీభవిస్తున్న ప్రపంచ దేశాలు***



ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నందుకు పాక్‌పై భారత్ ఇప్పటికే దౌత్యచర్యలు తీసుకున్న విషయం తెలిసిందే. ఇప్పుడు దాయాదిపై ద్వైపాక్షికంగా ఒత్తిడి తెచ్చేందుకు భారత్ సిద్ధమైంది. ఈ క్రమంలోనే కేంద్రం పలు దేశాల రాయబారులు, విదేశాంగమంత్రులకు ప్రత్యేక బ్రీఫింగ్ ఇస్తోంది. ఇందులో భాగంగా కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ ఆపరేషన్ సిందూర్‌పై ఆస్ట్రియా విదేశాంగశాఖ మంత్రి బీట్ మెయిన్ రైసింగర్‌తో ఫోన్లో చర్చలు జరిపారు. పాక్‌లోని ఉగ్రవాద స్థావరాలపై దాడుల గురించి మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని భారత్ ఏమాత్రం సహించబోదని స్పష్టం చేశారు. ఉగ్రవాదానికి, అణ్వస్త్ర బెదిరింపులకు వ్యతిరేకమనే అంశాలపై ఇరువురు ఏకాభిప్రాయానికి వచ్చినట్లు జైశంకర్ సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. రష్యా, ఉక్రెయిన్ మధ్య కొనసాగుతున్న యుద్ధం గురించీ తాము చర్చలు జరిపినట్లు వెల్లడించారు. ఇందులో భాగంగానే మంగళవారం జైశంకర్ ఆస్ట్రేలియా విదేశాంగ మంత్రి పెన్నీ వాంగ్‌తోనూ ఫోన్లో మాట్లాడారు. భారత్ ఉగ్రవాదాన్ని ఏ మాత్రం సహించదని వారికి తెలియజేశారు. ఇతర ప్రపంచ దేశాల ప్రతినిధులతో చర్చించారు. పాక్‌పై మిలిటరీ చర్యకు కారణాలు చెప్పి, మద్దతు కొనసాగించాలని కోరారు. ఆపరేషన్ సిందూర్ అనంతరం పాక్‌పై భారత్ చేపట్టిన చర్యల గురించి చైనా, అమెరికా, జపాన్, జర్మనీ, యూకే, రష్యా వంటి 70 దేశాల దౌత్యాధికారులకు భారత్ వివరించింది. ఉగ్రవాద నిర్మూలనలో భారత్ వేసిన ముందడుగు, అనంతరం చోటుచేసుకున్న పరిణామాల వివరాలను వారికి తెలియజేసింది.

# పరదీప్ ఓడరేవులో హై అలెర్ట్

**పోర్టుకొచ్చిన ఓడలో 21మంది పాకిస్తానీయులు**

**జాగ్రత్తలు తీసుకున్న అధికారులు**



భారత్–పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో దేశవ్యాప్తంగా అన్ని ఓడరేవుల వద్ద భద్రతను కట్టుదిట్టం చేసిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో ఒడిశాలోని పరదీప్ పోర్టుకు వచ్చిన ఓ షిప్ కలకలం రేపింది. అందులో 21 మంది పాకిస్థాన్ సిబ్బంది ఉన్నట్లు అధికారులు గుర్తించడమే అందుకు కారణం. దీంతో ఆ పోర్టులో భద్రతను పెంచారు. ఆ ప్రాంతంలో హైఅలర్ట్ ప్రకటించారు. బుధవారం ఉదయం దక్షిణ కొరియా నుంచి సింగపూర్ మీదుగా ఓ నౌక పరదీప్ పోర్టుకు చేరింది. 'ఎమ్జీ సైరెన్ పేరుతో ఉన్న ఈ షిప్‌లో మొత్తం 25 మంది సిబ్బంది ఉన్నారు. ఇది ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సంస్థ కోసం ముడి చమురును తీసుకొచ్చింది. తనిఖీలు చేపట్టగా సిబ్బందిలో 21 మందిని పాకిస్థానీయులుగా గుర్తించారు. ఇమిగ్రేషన్ డిపార్ట్మెంట్ నుంచి దీనిగురించి సమాచారం అందడంతో వెంటనే ఒడిశా మెరైన్ పోలీసులు, సీఐఎస్ఎఫ్ భద్రతా సిబ్బంది అప్రమత్తమయ్యారు. పోర్టులో భద్రతను మరింత పెంచినట్లు మెరైన్ పోలీసు స్టేషన్ ఇన్స్పెక్టర్ బబితా దుహేరి తెలిపారు. భారత్, పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఓడరేవు ప్రాంతంలో హైఅలర్ట్ ప్రకటించి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ప్రస్తుతం ఈ నౌక పోర్టుకు 20 కి.మీ. దూరంలోని 'పీఎం బెర్త్' వద్ద లంగర్ వేసి ఉంది. ఇందులో 11,350 మెట్రిక్ టన్నుల ముడిచమురు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ముడిచమురు అన్‌లోడింగ్ పూర్తయ్యే వరకూ 25 మంది సిబ్బంది నౌకను వీడకుండా భద్రతా ఏర్పాట్లు చేసినట్లు పోలీసు అధికారులు తెలిపారు.

# ట్రంప్ నోట పాత పాట!

## ఉద్రిక్తతలు తగ్గాలంటే భారత్-పాక్‌లు కలిసి డిన్నర్ చేయాలి



భారత్-పాకిస్థాన్ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందానికి తానే కారణమంటూ పేర్కొంటున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి అదే పాట పాడారు. ఉద్రిక్తతలు తగ్గించుకోవడానికి ఇరుదేశాలు కలిసి మంచి డిన్నర్ ఏర్పాటు చేసుకోవాలని తాజాగా సూచించారు. అణుక్షిపణు లతో యుద్ధాలు వద్దని కోరారు. సౌదీ అరేబియాలో మాట్లాడుతూ తనను తాను శాంతికర్తగా అభివర్ణించుకున్న ట్రంప్.. రెండు అణ్వాయుధ దేశాల మధ్య ఉద్రిక్తతలను తగ్గించడానికి ప్రయత్నించినట్లు చెప్పారు. యూఎస్-సౌదీ ఇన్వెస్ట్మెంట్ ఫోరంలో టంప్ మాట్లాడారు. ఈ కార్యక్రమానికి సౌదీ యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్, టెస్లా సీఈవో ఎలాన్ మస్క్ అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో తదితరులు హాజరయ్యారు. భారత్-పాకిస్థాన్ మధ్య అణుయుద్ధం నివారించడానికి తన మధ్యవర్తిత్వం సహాయపడిందని మరోసారి ట్రంప్ వెల్లడించారు. ఇది లక్షలాది ప్రాణాలను కాపాడిందని పేర్కొన్నారు. ఉద్రిక్తతలు మరింత తగ్గేందుకు.. భారత్, పాకిస్థాన్ దేశాలు మంచి డిన్నర్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇరుదేశాల మధ్య శాంతి ప్రక్రియలో ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, విదేశాంగ మంత్రి మార్కో రూబియోలు పాలుపంచుకున్నారని కొనియాడారు. "ఇరుదేశాల పరిస్థితి బాగుందని అనుకుంటున్నాను. వాళ్లని మనం ఒకచోట చేర్చవచ్చు. మార్కో రూబియో, వాళ్లు కలిసి బయటకువెళ్లి మంచి విందు చేసుకోవచ్చు. ఇది బాగుంటుంది కదా?" అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

"కొన్ని రోజుల క్రితమే భారత్-పాకిస్థాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలను తగ్గించడానికి చారిత్రక కాల్పుల విరమణ ఒప్పందాన్ని అమలుచేయడంలో మా యంత్రాంగం విజయవంతమైంది. ఈ విషయంలో నేను వాణిజ్య అంశాలను ఎక్కువగా ఉపయోగించాను" అని ట్రంప్ మరోసారి వెల్లడించారు.

"సహచరులారా రండి.. ఒక ఒప్పందాన్ని కుదుర్చుకుందాం.. కొంత వ్యాపారం చేద్దాం' అని వారికి నచ్చచెప్పాను. అణు క్షిపణుల వాణిజ్యం చేయొద్దు. అందరికీ ఆనందం కలిగేలా చేద్దాం. వారిద్దరూ (భారత్-పాక్ పాలకులు) గొప్ప, శక్తిమంతమైన, ఉత్తమ, తెలివైన నేతలు. అంతా (యుద్ధం) నిలిచిపోయింది. అది అలాగే కొనసాగాలని ఆశిద్దాం" అంటూ ఎలాన్ మస్క్ వంటి ఉన్నతస్థాయి ఆహూతుల కరతాళధ్వనుల మధ్య ట్రంప్ పేర్కొన్నారు.

అయితే.. కాల్పుల విరమణ విషయంలో మూడోపక్ష మధ్యవర్తిత్వాన్ని భారత్ తిరస్కరించిన విషయం తెలిసిందే. భారత్, పాకిస్థాన్లకు చెందిన డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డీజీఎంఓ) తమంత తాముగా అవగాహనకు వచ్చారని. ఈ వ్యవహారంలో మరెవరి ప్రమేయం లేదని భారత ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

# గాజాపై ఇజ్రాయెల్ వైమానిక దాడులు

### 48మంది మృతి



ఇజ్రాయెల్- హమాస్‌ల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో పశ్చిమాసియా మళ్లీ రణరంగంగా మారింది. వరుస దాడులతో ఇజ్రాయెల్ గాజాపై విరుచుకుపడుతోంది. తాజాగా ఉత్తర గాజాలోని ఇళ్లపై మంగళవారం రాత్రి వైమానిక దాడులకు పాల్పడింది. ఈ భీకర దాడిలో 48మంది పౌరులు మృతిచెందగా.. అందులో 22మంది చిన్నారులు ఉన్నట్టు జబాలియాలోని ఆరోగ్యశాఖ అధికారులు వెల్లడించారు. పలు నివాస భవనాలు తీవ్రంగా ధ్వంసమయ్యాయన్నారు. అమెరికా మధ్యవర్తిత్వంతో ఇరువర్గాల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం.. హమాస్ ఒక ఇజ్రాయెల్-అమెరికన్ బందీని విడుదల చేసిన అనంతరం ఈ దాడులు జరిగాయి. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సౌదీ అరేబియా పర్యటనలో ఉన్న సమయంలోనే గాజాపై ఇజ్రాయెల్ దాడులు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మంగళవారం యుద్ధం గురించి ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు మాట్లాడుతూ.. గాజాలో తమ యుద్ధాన్ని ఆపడానికి ఎటువంటి మార్గం లేదని స్పష్టం చేయడంతో యుద్ధ విరమణపై ఆశలు సన్నగిల్లాయి. హూతీలు ఇటీవల ఇజ్రాయెల్‌పై దాడులకు పాల్పడడంపై నెతన్యాహు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. కచ్చితంగా హూతీలను ఎదురుదెబ్బ తీస్తామని.. గతంలో ఐడీఎఫ్ చేసిన దాడులను వారు గుర్తు పెట్టుకోవాలన్నారు. ఈసారి దాడులు మామూలుగా ఉండవని.. బాంబుల మోతలు హోరెత్తుతాయని హెచ్చరించారు.

హమాస్- ఇజ్రాయెల్ మధ్య రెండోసారి కాల్పుల విరమణ ఒప్పందం కుదరడంతో హమాస్ తన చెరలో ఉన్న బందీలను విడుదల చేస్తుండగా, ప్రతిగా తమ జైళ్లలో ఉన్న పాలస్తీనా పౌరులను ఇజ్రాయెల్ విడుదల చేస్తోంది. ఇప్పటివరకు హమాస్ తన తాజా ఒప్పందంలో భాగంగా మొత్తం 22మంది ఇజ్రాయెల్ వాసులను విడుదల చేసింది. అయితే, బందీల విడుదల ఆలస్యంపై అమెరికా అధ్యక్షుడు హమాస్‌కు డెడ్‌లైన్ విధించారు. వారిని త్వరగా విడుదల చేయకపోతే కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు.

# మన దోస్తీ జిందాబాద్!

### పాక్ ప్రధానితో తుర్కియే అధ్యక్షుడు



ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు సాయం చేసిన తుర్కియేపై భారత్‌లో తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. అక్కడి నుంచి వస్తువుల దిగుమతి నిలిపివేయాలంటూ బాయ్‌కాట్ తుర్కియే నినాదంతో సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం జరుగుతోంది. ఇలాంటి సమయంలోనే కీలక పరిణామం చోటుచేసుకుంది. కాల్పుల విరమణ నేపథ్యంలో తుర్కియేకు ధన్యవాదాలు తెలిపిన పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌ను అభినందించిన ఎర్డోగాన్.. పాకిస్థాన్ తమకు నిజమైన మిత్రదేశమన్నారు. గతంలో మాదిరిగా భవిష్యత్తులోనూ అండగా ఉంటామన్నారు. ఈ సందర్భంగా పాక్ ప్రధానిని విలువైన మిత్రుడిగా ఎర్డోగాన్ అభివర్ణించడం గమనార్హం. "నా విలువైన మిత్రుడు షహబాజ్ షరీఫ్.. తుర్కియే-పాకిస్థాన్ల మధ్య సోదరభావం అనేది నిజమైన స్నేహానికి నిదర్శనం. ప్రపంచంలో కొన్నిదేశాలు మాత్రమే దీన్ని కొనసాగిస్తాయి. తుర్కియేలో మాదిరిగానే పాకిస్థాన్‌లో శాంతి, స్థిరత్వాన్ని కోరకుంటున్నాం. వివాదాల పరిష్కారంలో చర్చలు, రాజీకి ప్రాధాన్యం ఇస్తున్న పాక్ ప్రభుత్వ విధానాన్ని అభినందిస్తున్నాం. గతంలో మంచి, చెడు సమయాల్లో మాదిరిగా.. భవిష్యత్తులోనూ పాక్‌కు అండగా ఉంటాం. పాకిస్థాన్-తుర్కియే దోస్తీ జిందాబాద్!" అంటూ అధ్యక్షుడు ఎర్డోగాన్ పేర్కొన్నారు.

పాకిస్థాన్ ఉగ్రస్థావరాలే లక్ష్యంగా భారత్ 'ఆపరేషన్ సిందూర్‌ను చేపట్టగా.. దీనికి ప్రతిస్పందనగా పాకిస్థాన్ మనపై డ్రోన్ దాడులకు పాల్పడింది. ఈ క్రమంలో దాయాదికి పూర్తి మద్దతు తెలిపిన తుర్కియే.. డ్రోన్లతోసహా యుద్ధనౌకనూ పంపించినట్టు తెలిసింది. వీటితోపాటు సైనిక సాయం కూడా చేసినట్టు సమాచారం. ఇలా శత్రు దేశానికి సాయం చేస్తున్న తుర్కియేపై భారత్‌లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇప్పటికే పలు ట్రావెల్ ఏజెన్సీలు ఆ దేశానికి బుకింగ్‌లను నిలిపివేయగా.. అక్కడి యాపిల్ దిగుమతిని నిరాకరిస్తూ పుణె వ్యాపారులు నిర్ణయం తీసుకున్నారు.



# సైన్యంలోకి లాక్కెళ్తున్నారు

### ఉక్రెయిన్‌పై రష్యా అధ్యక్షుడి వ్యాఖ్య

మరికొన్ని గంటల్లో శాంతి చర్చలు మొదలుకానున్న వేళ.. రష్యా అధ్యక్షుడు పుతిన్ ఉక్రెయిన్ సైన్యంపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ఆ దేశం ప్రజలను బలవంతంగా సైన్యంలో చేరుస్తోందన్నారు. బిజినెస్ రష్యా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పుతిన్ ఈ వ్యాఖ్యలు చేసినట్లు స్పుత్నిక్ న్యూస్ కథనంలో పేర్కొంది. కానీ, రష్యా తరపున యుద్ధంలో పాల్గొనేందుకు ఆసక్తి చూపుతున్న వాలంటీర్ల సంఖ్య క్రమంగా పెరుగుతోందని చెప్పారు. తమ సైన్యం భయపెట్టడం కంటే స్వచ్ఛందంగా చేర్చుకోవడాన్నే నమ్ముతుందని పుతిన్ చెప్పారు. ఉక్రెయిన్ యువతలో సైన్యంలో చేరాలన్న ఉత్సాహం ఏమాత్రం లేదని.. కానీ రష్యన్స్ మాత్రం మిలిటరీపై ఆసక్తిగా ఉన్నారనే విషయం చెప్పేందుకు ఈ రకంగా స్పందించారని సదరు పత్రిక పేర్కొంది. "కీవ్ అధికారులు బలవంతంగా సైన్య సమీకరణ చేపడితే మాత్రం.. ప్రజలను వీధి శు నకాలవలే పట్టుకొని ఈడ్చుకెళతారు. ప్రస్తుతం ఉక్రెయిన్లో ఇలా 30,000 మందిని తీసుకెళ్లారు. కానీ, ఇక్కడ అలాకాదు.. వారే స్వచ్ఛందంగా వస్తారు. దాదాపు 60,000 మంది ముందుకొచ్చారు" అని పుతిన్ పేర్కొన్నారు.

ఉక్రెయిన్‌తో సంక్షోభం మొదలైన వేళ.. 18-60 ఏళ్ల మధ్య పురుషులు దేశం వీడకూడదని రష్యా ఆదేశాలు జారీ చేసింది. 27 ఏళ్ల వయసు కలిగిన వారు తప్పనిగాసరిగా చేరాలని నిబంధనలు విధించారు. గతేడాది రష్యా సైన్యంలో మృతుల సంఖ్య అత్యధికంగా ఉండటంతో.. ఇబ్బందులు ఎదుర్కొంది. మరోవైపు ఉక్రెయిన్‌కు నిర్బంధ చేరికల వయస్సును 25 ఏళ్లగా నిర్ణయించింది. ఇటీవల కాలంలో ఉక్రెయిన్‌లో సైనిక నియామకాలు వివాదంగా మారుతున్నాయి. అభ్యర్థులను పోలీసులు వెంటాడం, వీధిపోరాటాలకు దారి తీస్తున్నాయి. ఈ నియామకాలను బసిఫికేషన్‌గా వ్యవహరిస్తుంటారు. రిక్రూటీలను బస్సుల్లో ఎక్కి తరలిస్తుండటంతో ఈ పేరు వచ్చింది.




# నీరజ్ చోప్రాకు అరుదైన గౌరవం

## టెరిటోరియల్ ఆర్మీలో లెఫ్టినెంట్ కర్నల్ హోదా

భారత స్టార్ జావెలిన్ త్రోయర్, గోల్డెన్ బాయ్ నీరజ్ చోప్రాకు అరుదైన గౌరవం దక్కింది. భారత ప్రాదేశిక సైన్యం(టెరిటోరియల్ ఆర్మీ).. ఈ బల్లెం వీరుడికి లెఫ్టినెంట్ కర్నల్ గౌరవ హోదాను ప్రదానం చేసింది. ఈ విషయాన్ని భారత రక్షణ మంత్రిత్వ శాఖ బుధవారం ప్రకటించింది. ఈ హోదా ఏప్రిల్ 16, 2025 నుంచి అమల్లోకి వస్తుందని తమ ప్రకటనలో తెలిపింది. నీరజ్ చోప్రా గతంలో భారత సైన్యంలో సుబేదార్‌గా పనిచేశాడు.

టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకం సాధించి ఈ ఘనతను అందుకున్న తొలి భారత అథ్లెట్‌గా నీరజ్ చోప్రా చరిత్రకెక్కిన సంగతి తెలిసిందే. ఈ ప్రదర్శన నేపథ్యంలో నీరజ్ చోప్రాను భారత ప్రభుత్వం పలు అవార్డులతో సత్కరించింది. 'పరమ విశిష్ట సేవా పతకం'తో సత్కరించింది. భారత అత్యున్నత క్రీడా పురస్కారమైన మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న అవార్డును 2021లో ప్రదానం చేసింది. 2022లో నీరజ్ చోప్రాకు పద్మశ్రీ అవార్డు కూడా దక్కింది.

పారిస్ ఒలింపిక్స్ 2024లో నీరజ్ చోప్రా రజత పతకం సాధించాడు. ఒలింపిక్స్ చరిత్రలోనే రెండు మెడల్స్ సాధించిన భారత అథ్లెట్‌గాను నీరజ్ చోప్రా రికార్డ్ సాధించాడు. నీరజ్ చోప్రా కంటే ముందు మహేంద్ర సింగ్ ధోనీ, కపిల్ దేవ్, సచిన్ పైలెట్, అనురాగ్ ఠాకూర్, అభినవ్ బింద్రా.. ప్రాదేశిక సైన్యంలో గౌరవ హోదాను పొందారు. ప్రాదేశిక సైన్యం అనేది స్వచ్ఛంద పౌరులతో కూడిన సైనిక సంస్థ, వీరు దేశానికి అవసరమైనప్పుడు సేవ చేయడానికి శిక్షణ పొందుతారు.

ఆపరేషన్ పరాక్రమ్, కార్గిల్ యుద్ధ సమయంలోనూ ప్రాదేశిక సైన్యం.. భారత సైనిక దళానికి సేవలు అందించింది. పాకిస్థాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో భారత ప్రభుత్వం ప్రాదేశిక సైన్యంలో చేరేందుకు దరఖాస్తులను ఆహ్వానించింది. నీరజ్ చోప్రా మే 16న దోహా డైమండ్ లీగ్, జూన్ 24న ఒస్ట్రావా గోల్డెన్ స్పైక్ 2025 అథ్లెటిక్స్ మీట్‌లో పోటీపడనున్నాడు.

# వారు తొందరపడి రిటైర్మెంట్ ప్రకటించారు

## - యువరాజ్ సింగ్ తండ్రి యోగ్ రాజ్ సింగ్



టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ టెస్ట్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించడంపై యువరాజ్ సింగ్ తండ్రి యోగ్‌రాజ్ సింగ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఇద్దరిలో ఇంకా చాలా క్రికెట్ మిగిలి ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. రోహిత్, కోహ్లీ రిటైర్మెంట్ కారణంగా కుర్రాళ్లను ప్రేరేపించేవారు జట్టులో లేకుండా పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. యువరాజ్ సింగ్ కూడా ఇలానే తొందరపడి రిటైర్మెంట్ ప్రకటించాడని చెప్పిన యోగ్ రాజ్ సింగ్.. రోహిత్ శర్మ, వీరేంద్ర సెహ్వాగ్ 50 ఏళ్ల వయసు వరకు క్రికెట్ ఆడాల్సిందని అభిప్రాయపడ్డారు.

'విరాట్ కోహ్లీ గొప్ప ఆటగాడు. అతని రిటైర్మెంట్ జట్టుకు తీరని నష్టమే. 2011లోనూ చాలా మంది ఆటగాళ్లు ఇలానే జట్టు నుంచి తప్పుకున్నారు. కొందరు రిటైర్మెంట్ ప్రకటిస్తే.. మరికొందరు బలవంతంగా ఆటకు వీడ్కోలు పలికారు. ఇంకొందరు జట్టులో చోటు కోల్పోయారు. దాంతో జట్టు పూర్తిగా విచ్ఛిన్నమైంది. ఇప్పటికీ తిరిగి సెట్ అవ్వలేదు. ఏదో రోజు ప్రతి ఆటగాడు రిటైర్మెంట్ ప్రకటించాల్సిందే. కానీ విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలో ఇంకా చాలా క్రికెట్ మిగిలి ఉంది.

నా కొడుకు యువరాజ్ సింగ్ కూడా రిటైర్మెంట్ విషయంలో ఇలానే తొందరపడ్డాడు. రిటైర్మెంట్ సరికాదని ఆ సమయంలో నేను యువీకి చెప్పాను. నడవలేని స్థితికి చేరుకున్నప్పుడే ఆట నుంచి వైదొలగాలి. జట్టు మొత్తం యువకులతో నిండి ఉంటే ఆశించిన ఫలితాలు దక్కవు. అయితే కోహ్లీ తన కెరీర్‌లో సాధించడానికి ఏమి మిగిలి లేదని భావించి ఉండవచ్చు.

### 50 ఏళ్ల వరకు ఆడాల్సింది..

రోహిత్ శర్మకు ప్రతీ రోజు ఉదయం 5 గంటలకు లేపి రన్నింగ్ చేయమని చెప్పే ఓ వ్యక్తి ఉండాల్సింది. రోహిత్ శర్మ, వీరేంద్ర సెహ్వాగ్ చాలా త్వరగా రిటైర్మెంట్ ప్రకటించారు. ఈ గొప్ప ఆటగాళ్లు 50 ఏళ్ల వయసు వరకు ఆడాల్సింది. వారి రిటైర్మెంట్ నన్ను ఎంతో బాధకు గురి చేసింది. ఎందుకుంటే ఇప్పుడు జట్టులోని యువకులను ప్రేరేపించే వ్యక్తులు లేకుండా పోయారు.'అని యోగ్‌రాజ్ సింగ్ ఏఎన్ఐతో అన్నారు.

### షాక్‌లో క్రికెట్ ప్రపంచం..

ఇంగ్లండ్ పర్యటనకు ముందు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వారం వ్యవధిలోనే రిటైర్మెంట్ ప్రకటించి అందర్నీ ఆశ్చర్యపరిచారు. సెలెక్టర్ల సూచనలతో రోహిత్ శర్మ వీడ్కోలు పలకడాని ప్రచారం జరిగింది. కానీ కోహ్లీ రిటైర్మెంట్ అందర్నీ అసంతృప్తికి గురి చేసింది. ప్రపంచంలోనే అత్యంత ఫిట్టెస్ట్ క్రికెటర్ అయిన కోహ్లీ.. మరో రెండేళ్ల వరకైనా ఆడుతారని అంతా అనుకున్నారు. 10 వేల టెస్ట్ పరుగుల లక్ష్యాన్ని అందుకోకుండానే కోహ్లీ ఆట నుంచి తప్పుకున్నాడు.

# శుభ్‌మన్ గిల్‌కు చాలా తెలివితేటలున్నాయి

## - మొయిన్ అలీ




*శుభ్‌మన్ గిల్‌కు ఇంగ్లండ్ మాజీ క్రికెటర్ మొయిన్ అలీ తన మద్దతు తెలిపాడు. టెస్ట్ క్రికెట్‌కు ఇటీవల రోహిత్ శర్మ తన రిటైర్మెంట్ ప్రకటించిన విషయం తెలిసిందే. జూన్‌లో టీమిండియా, ఇంగ్లండ్‌లో పర్యటించనుంది. అక్కడ అయిదు టెస్టుమ్యాచ్ల సిరీస్ ఆడనుంది. ఈ నేపథ్యంలో హిట్‌మ్యాన్ స్థానాన్ని గిల్ భర్తీ చేస్తాడనే వార్తలు వినవస్తున్నాయి.*

*ఈ విషయంలో మొయిన్ అలీ, శుభమన్ గిల్‌కు మద్దతుగా నిలిచాడు. గిల్ చాలా తెలివైన ఆటగాడని కీర్తించాడు. అతడి నాయకత్వ లక్షణాలను మెచ్చుకున్నాడు. ఈ యువ క్రికెటర్ కచ్చితంగా మంచి కెప్టెన్‌గా పేరు తెచ్చుకుంటాడన్నాడు. కెప్టెన్సీ రేసులో బుమ్రా పేరు వినిపిస్తున్నప్పటికీ.. అతడు మొత్తం అయిదు టెస్టు మ్యాచ్లు ఆడేది అనుమానాస్పదమే! ఈ నేపథ్యంలో సెలక్టర్లు అన్ని మ్యాచ్‌లు ఆడగలిగే ఫిట్‌నెస్ ఉన్న వ్యక్తివైపే మొగ్గు చూపాలని మొయిల్ అలీ తన అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాడు.*

*'టీమిండియా టెస్ట్ కెప్టెన్సీకి నా దృష్టిలో శుభ్‌మన్ గిల్ మంచి ఎంపిక. బీసీసీఐ జస్‌ప్రీత్ బుమ్రాను కెప్టెన్‌గా చేయాలనుకుంటోంది! ఎందుకంటే అతడికి మంచి నాయకత్వ లక్షణాలున్నాయి. గతంలోనూ పలు మ్యాచ్‌లకు సారథిగా వ్యవహరించాడు. కానీ గాయాలను పరిగణనలోకి తీసుకుంటే, అతడు సిరీస్ మొత్తానికి అందుబాటులో ఉండటం అనుమానాస్పదమే. శుభ్‌మన్ గిల్‌కు కెప్టెన్‌గా అనుభవం లేనప్పటికీ క్రికెట్‌లో చక్కగా రాణిస్తున్నాడు. ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్‌కు సారథ్యం వహిస్తున్నాడు. పైగా గిల్ చాలా తెలివిగలవాడు. కానీ ఇంగ్లండ్ పరిస్థితులు కాస్త కఠినంగానే ఉంటాయి' అని మొయిన్ అలీ మీడియాతో అన్నాడు.*



# చరిత్ర సృష్టించిన రవీంద్ర జడేజా!

హిట్ మ్యాన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ టెస్ట్ రిటైర్మెంట్ నుంచి అభిమానులు ఇంకా కోలుకోలేదు. కానీ ఇప్పుడు టీమిండియా అభిమానులకు గుడ్‌న్యూస్ వచ్చింది. టీమిండియా క్రికెటర్ రవీంద్ర జడేజా టెస్ట్ క్రికెట్‌లో గతంలో ఎన్నడూ చూడని ఘనతను సాధించి చరిత్ర సృష్టించాడు.

### నంబర్ వన్ ఆల్‌రౌండర్‌గా అత్యధిక కాలం

ఐసీసీ తాజా టెస్ట్ ఆల్‌రౌండర్ ర్యాంకింగ్స్‌లో రవీంద్ర జడేజా ఇప్పటికీ నంబర్ వన్ స్థానంలో కొనసాగుతున్నాడు. చాలా కాలంగా ప్రపంచంలో మరే ఇతర ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా నుంచి ఈ నంబర్ వన్ కిరీటాన్ని లాక్కోలేకపోయాడు. టెస్ట్ ఆల్‌రౌండర్ ర్యాంకింగ్స్‌లో చాలా కాలం పాటు నంబర్ వన్ స్థానంలో నిలిచిన ప్రపంచంలోనే తొలి ఆటగాడిగా రవీంద్ర జడేజా ఇప్పుడు నిలిచాడు. ప్రస్తుతం రవీంద్ర జడేజా 400 రేటింగ్ పాయింట్లను కలిగి ఉన్నాడు. ఇది కాకుండా బంగ్లాదేశ్‌కు చెందిన మెహిదీ హసన్ మిరాజ్ 327 రేటింగ్ పాయింట్లతో జాబితాలో రెండో స్థానంలో ఉన్నాడు.

### ఇంగ్లాండ్ పర్యటనకు రవీంద్ర జడేజా!

ఐపీఎల్ 2025 తర్వాత టీమిండియా ఇంగ్లాండ్‌లో పర్యటించాల్సి ఉంది. ఈ పర్యటనలో రెండు జట్ల మధ్య 5 మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ ఆడనుంది. ఈ 5 మ్యాచ్‌ల సిరీస్ ఆగస్టు వరకు జరుగుతుంది. జూన్ 20న మొదటి మ్యాచ్ ప్రారంభం కానుంది. ఈ సిరీస్ కోసం బీసీసీఐ ఇంకా టీమిండియాను ప్రకటించలేదు. కానీ రవీంద్ర జడేజా ఈ సిరీస్‌లో ఆడటం ఖాయమని భావిస్తున్నారు. రోహిత్, విరాట్, అశ్విన్ టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్ అయిన తర్వాత రవీంద్ర జడేజా ఇప్పుడు టీమిండియాలో అత్యంత సీనియర్ ఆటగాడిగా ఎదగబోతున్నాడు.

### రవీంద్ర జడేజా టెస్ట్ కెరీర్

రవీంద్ర జడేజా ఇప్పటివరకు టీమిండియా తరఫున 80 టెస్ట్ మ్యాచ్‌లు ఆడాడు. టెస్టుల్లో రవీంద్ర జడేజా 3370 పరుగులు చేశాడు. ఈ కాలం రవీంద్ర జడేజా 22 అర్ధ సెంచరీలు, 4 సెంచరీలు చేశాడు. బౌలింగ్‌లో రవీంద్ర జడేజా 323 వికెట్లు పడగొట్టాడు. ఈ కాలంలో రవీంద్ర జడేజా అత్యుత్తమ బౌలింగ్ 42 పరుగులకు 7 వికెట్లు పడగొట్టాడు.

## 'కింగ్‌డమ్' విడుదల వాయిదా

విజయ్ దేవరకొండ హీరోగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో రానున్న చిత్రం 'కింగ్‌డమ్'. మే 30న విడుదల కావాల్సిన ఈ సినిమా తాజాగా వాయిదా పడింది. దీన్ని జులై 4న విడుదల చేయనునట్టు టీమ్ తెలిపింది. ఈమేరకు ఓ నోట్‌ను పంచుకుంది. "అనుకున్న సమయానికి సినిమాను రిలీజ్ చేయాలని ఎంతో ప్రయత్నించాం. కానీ, ప్రస్తుతం దేశంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా దీన్ని వాయిదా వేస్తున్నాం. ఇలాంటి సమయంలో ప్రచారాలు, సెలబ్రేషన్స్ అంటూ సందడి చేయకూడదు. అందుకే మేం సినిమా జులై 4న ప్రపంచవ్యాప్తంగా మీ ముందుకు తీసుకురానున్నాం. మీ అందరూ సహకరిస్తారని ఆశిస్తున్నాం" అని టీమ్ తెలిపింది.. మొదట ఈ సినిమాను మార్చిలో విడుదల చేయాలని భావించారు. మే 30కు వాయిదా పడింది. ఇప్పుడు మరోసారి జులై 4కు వెళ్లింది. విజయ్ సరసన భాగ్యశ్రీ బోర్సే నటిస్తున్న ఈ సినిమాలోని పాటలు ప్రేక్షకాదరణను సొంతం చేసుకుంటున్నాయి. ఇటీవలే ఇందులో 'హృదయం లోపల' అంటూ సాగే పాటని విడుదల చేయగా సోషల్ మీడియాలో సంచలనం సృష్టించింది. పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానున్న 'కింగ్‌డమ్'లో విజయ్ దేవరకొండ గూఢచారిగా కనిపించనున్నారు.



## బ్లో అప్

ఐశ్వర్య మీనన్





## అలాంటి దేశాల కోసం
## మనం డబ్బు ఖర్చు చేయాలా?

భారత్ -పాక్ ఉద్రిక్తతల వేళ తుర్కియే అధ్యక్షుడు ఎర్డోగాన్ వ్యవహరించిన తీరుపై టాలీవుడ్ నటుడు నిఖిల్ అసహనం వ్యక్తంచేశారు. భారత్‌కు వ్యతిరేకంగా వ్యవహరించే దేశాల కోసం డబ్బు ఖర్చు పెట్టాల్సిన అవసరం లేదన్నారు. విహారయాత్రల కోసం ఆయా దేశాలకు వెళ్లాల్సిన అవసరం లేదని తెలిపారు. 'మంచి లేదా చెడు పాక్‌తో మేము సత్సంబంధాలు కొనసాగిస్తాం' అంటూ ఎర్డోగాన్ చేసిన వ్యాఖ్యలపై ఒక నెటిజన్ సోషల్‌మీడియాలో పోస్ట్ పెట్టాడు. దీనిని నిఖిల్ తాజాగా ఎక్స్ వేదికగా షేర్ చేశారు. "ఇంకా ఎవరైనా తుర్కియే వెళ్లాలనుకుంటున్నారా? దయచేసి ఒక్కసారి ఈ పోస్ట్ చూడండి. భారతీయులు ప్రతి ఏడాది తుర్కియేలో పెద్దమొత్తంలో ఖర్చు పెడుతుంటారు. మన దేశానికి వ్యతిరేకంగా వ్యవహరించే వారి కోసం మీ డబ్బు ఖర్చు పెట్టడం దయచేసి మానండి" అని నిఖిల్ పేర్కొన్నారు. పాకిస్థాన్‌లోని ఉగ్రవాదులు, వారి స్థావరాలను అంతం చేయడమే లక్ష్యంగా ఆపరేషన్ సిందూర్‌ను భారత్ చేపట్టగా.. ఆ సమయంలో పాకిస్థాన్‌కు తుర్కియే అనుకూలంగా వ్యవహరించిన సంగతి తెలిసిందే. పహల్గాం ఉగ్రదాడి జరిగిన తర్వాత ప్రపంచమంతా ఉగ్రవాదుల చర్యలను ఖండిస్తున్న సమయంలో పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌ను ఎర్డోగాన్ కలిశారు. ఆ దేశానికి వత్తాసు పలికారు. పహల్గాం ఉగ్రదాడిని ఖండించలేదు సరికదా.. మృతిచెందిన పర్యాటకుల కుటుంబాలకు సానుభూతి కూడా వ్యక్తం చేయడానికి ఇష్టపడలేదు.

## ట్రెండింగ్‌లో
## రామ రామ



మెగాస్టార్ చిరంజీవి లేటెస్ట్ సెన్సేషనల్ మూవీ 'విశ్వంభర'. మెగా ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమా కూడా. దర్శకుడు వశిష్ఠ పూర్తి సోషియో ఫాంటసీ చిత్రంగా దీన్ని రూపొందిస్తున్నాడు. ఇక సినిమా నుంచి ఇటీవల 'రామ రామ' అనే ఫస్ట్ సింగిల్ సాంగ్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ పాట ప్రేక్షకులను ఆకట్టుకోవడంలో విజయం సాధించింది. ఇక తాజాగా ఈ పాట యూట్యూబ్‌లో 25 మిలియన్ వ్యూస్ మార్క్‌ను క్రాస్ చేసింది. దీంతో ఈ పాట ప్రస్తుతం యూట్యూబ్‌లో ట్రెండింగ్ అవుతోంది. ఇక ఈ సినిమాలో అందాల భామ త్రిష హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిత్రానికి ఎం.ఎం.కీరవాణి సంగీతం అందిస్తున్నాడు. యూవీ క్రియేషన్స్ బ్యానర్ ఈ చిత్రాన్ని అత్యంత భారీ బడ్జెట్‌తో ప్రొడ్యూస్ చేస్తున్నారు.

## శంకర్ డాటర్‌గా
## నాకు గౌరవమే

దర్శకుడు శంకర్ కూతురు అనే గుర్తింపుని గౌరవంగా భావిస్తానే కానీ, ఒత్తిడిగా తీసుకోను-అంటోంది అదితి శంకర్. 'భైరవం' చిత్రంతో తెలుగు చిత్ర పరిశ్రమలోకి అడుగుపెడుతున్న ఈ టాలెంటెడ్ హీరోయిన్.. ప్రస్తుతం ఆ సినిమా ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది. ఆ సందర్భంలో మీడియాతో మాట్లాడుతూ-మా నాన్నకి నేను చేస్తున్న సినిమాల గురించి తెలియదు. ఆయన బిజీలో ఆయనుంటారు. ఆయన సినిమాలకి సంబంధించిన విశేషాలు కూడా మాకు అస్సలు చెప్పరు. సినిమాని పసిపాపలా జాగ్రత్తగా చూసుకుంటుంటారు. నేను చేసే సినిమాలకి సంబంధించిన ప్రతి విషయాన్నీ అమ్మకి చెబుతుంటాను.నాకు చారిత్రక కథలన్నా, పీరియాడిక్ చిత్రాలన్నా ఎంతో ఇష్టం. సవాళ్లు ఎదుర్కొనే మహిళ పాత్రలో నటించడమన్నా ఇష్టమే. నటిగా ఈ ప్రయాణంలో చాలా సవాళ్లే ఉన్నాయి కానీ, అవన్నీ మంచి అనుభవాల్నే పంచుతున్నాయి అంటోంది అదితి.



## రంగస్థలం కంటే
## కొంచెం పెద్దగా..

రామ్‌చరణ్ ప్రస్తుతం దర్శకుడు బుచ్చిబాబు సానా డైరెక్షన్‌లో 'పెద్ది' సినిమాతో బిజీగా ఉన్నాడు. రూరల్ స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కుతున్న చిత్రంపై రామ్‌చరణ్ తాజాగా కొన్ని కామెంట్స్ చేశాడు. లండన్‌లో తన మైనపు విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు వెళ్లిన చరణ్, అక్కడి అభిమానులతో పెద్ది సినిమా విశేషాలను పంచుకున్నాడు. ఇప్పటికే 30శాతం షూటింగ్ పూర్తయిందని.. పెద్ది సినిమా రంగస్థలం చిత్రానికంటే పెద్దదిగా ఉంటుందని అన్నారు. దీంతో ఇప్పుడు సోషల్ మీడియాలో పెద్ది ట్రెండ్ అవుతోంది. ఇప్పుడు చరణ్ ఈ సినిమాపై ఇంత కాన్ఫిడెంట్‌గా ఉన్నాడంటే.. ఇక ఈ సినిమా పూర్తయితే, బాక్సాఫీస్ దగ్గర



ఎలాంటి విధ్వంసాన్ని సృష్టిస్తాడో? అని అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు. సినిమాలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా శివరాజ్‌కుమార్, జగపతి బాబు తదితరులు ఇతర ముఖ్యపాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాకు ఏఆర్. రెహమాన్ సంగీతం సమకూరుస్తున్నాడు.

## మళ్లీ రానున్న కుమారి...

క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ తన సొంత ప్రొడక్షన్ హౌజ్ సుకుమార్ రైటింగ్స్‌పై ప్రొడ్యూస్‌చేసిన తొలి చిత్రం 'కుమారి 21ఎఫ్. బాక్సాఫీస్ దగ్గర సూపర్ హిట్ మూవీగా నిలిచింది. ఈ సినిమాను దర్శకుడు పల్నాటి సూర్య ప్రతాప్ డైరెక్ట్ చేయగా పూర్తి రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా మూవీ ప్రేక్షకులను ఆకట్టుకుంది. రాజ్ తరుణ్, హెబ్బాపటేల్ జంటగా నటించిన సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ సూపర్ హిట్ సాంగ్స్ మేజర్ అట్రాక్షన్‌గా నిలవడంతో ఈ మూవీ సెన్సేషనల్ హిట్‌గా నిలిచింది. ఇక 2015లో వచ్చిన ఈ సినిమా విడుదలై పదేళ్ల అవుతుండటంతో చిత్ర యూనిట్ సెలబ్రేషన్స్ ప్లాన్ చేస్తుంది. అంతేగాక, ఈ చిత్రాన్ని గ్రాండ్ రీ-రిలీజ్ చేసేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు.ఈ విషయాన్ని చిత్ర యూనిట్ అధికారికంగా వెల్లడించారు. దీంతో 'కుమారి 21ఎఫ్ రీ-రిలీజ్ ఎప్పుడు ఉండబోతుందా? అని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు.



## 'కింగ్'కు గురువుగా..?

భిన్నమైన పాత్రల్లో నటించి సినీ ప్రియులను ఆకట్టుకున్న బాలీవుడ్ నటుడు అనిల్ కపూర్. ఇప్పుడాయన.. షారుక్ ఖాన్ ప్రధానపాత్రలో నటిస్తున్న 'కింగ్'లో కీలక పాత్రలో నటించనున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో షారుక్‌కు గురువు పాత్రలో అనిల్‌కపూర్ కనిపించనున్నట్లు సమాచారం.ప్రస్తుతం ఈ విషయమై అనిల్‌తో చిత్ర బృందం చర్చలుచేస్తున్నట్లు తెలుస్తోంది. యాక్షన్ థ్రిల్లర్ నేపథ్యంలో సిద్ధార్థ్ ఆనంద్ రూపొందిస్తున్న ఈ చిత్రంలో సుహానాఖాన్,దీపికా పదుకొణె, అభిషేక్ బచ్చన్ తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనుల్లో ఉన్న సినిమా వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది.చిత్రానికి సంబంధించిన పూర్తివివరాలను త్వరలో అధికారికంగా ప్రకటించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు చిత్ర సన్నిహితవర్గాల సమాచారం.

